Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 245 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్, సోమవారం 29-09-2025 పేజీలు : 12 వెల : 2/-

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

## భారత్ వంటి దేశాలు మాతో మాట్లాడేటప్పుడు నోరు జాగ్రత్త: అమెరికా మంత్రి వార్నింగ్

- అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హొవార్డ్ లుట్నిక్ సంచలన వ్యాఖ్యలు
- అమెరికా మార్కెట్ను భారత్ దుర్వినియోగం చేస్తోందని ఆరోపణ



2లో

## ఆట మైదానంలో 'ఆపరేషన్ సిందూర్'... ఇక్కడ కూడా మనదే గెలుపు: టీమిండియా



ఆసియా కప్ ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ పై భారత క్రికెట్ జట్టు సాధించిన విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనదైన శైలిలో స్పందించారు. టీమిండియా ఆటగాళ్లకు అభినందనలు తెలుపుతూ ఆయన చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తన అభినందన సందేశంలో 'ఆపరేషన్ సిందూర్' అనే పదాన్ని ప్రయోగించడం విశేషం.క్రీడా మైదానంలో భారత జట్టు చూపిన అద్భుత ప్రదర్శనను ప్రశంసిస్తూ ప్రధాని మోదీ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

## ప్రపంచంలో సగానికి పైగా సమస్యలు వృద్ధ నేతల వల్లే..



మరణ భయంతో వృద్ధ నేతలు అధికారాన్ని పట్టుకుని వేలాడుతుండటం వల్లనే ప్రపంచంలో సగానికి పైగా సమస్యలు తలెత్తుతున్నాయని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పేర్కొన్నారు. లండన్ లో జరిగిన ఓ కార్యక్రమంలో ఒబామా మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై పరోక్షంగా సెటైర్లు విసిరారు. పిరమిడ్లతో పాటు ప్రతి దానిపై తమ పేరు ఉండాలని ఈ వృద్ధ నేతలు భావిస్తుంటారని, ఇదే సమస్యలకు దారితీస్తుందని చెప్పారు.అధికారంతో పాటు వారు దేనినీ వదులుకోరని ఒబామా వ్యాఖ్యానించారు. మరోవైపు, పారాసెటమాల్ వాడకంపై ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఒబామా తప్పుబట్టారు. గర్భిణిలు పారాసెటమాల్ వాడితే వారి గర్భంలో పెరుగుతున్న శిశువులు ఆటిజానికి గురవుతారని ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం విదితమే.



2లో

## పదేళ్లు సమయం ఇవ్వండి.. న్యూయార్క్ను మరిపించే నగరం కడతా..: సీఎం రేవంత్రెడ్డి

**హైదరాబాద్:** ఫ్యూచర్ సిటి పై కొందరూ కావాలనే రాజకీయం చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ అంటూ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనకు ఇక్కడ భూములు ఉన్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్ తరాల కోసమే ఫ్యూచర్ సిటీ నిర్మాణమని ఉద్ఘాటించారు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్పేటలో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ (%ఖీజణూ%) భవనం, గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్-1 నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమం ఇవాళ (ఆదివారం) జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్రెడ్డి ప్రసంగించారు.ముందుతరాల కోసం చంద్రబాబు, వైఎస్సార్ ఆలోచించారని నొక్కిచెప్పారు. అందువల్లే హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్పోర్టు, %ూ==% వచ్చాయని గుర్తుచేశారు. గతం నుంచి భవిష్యత్కు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఓ మంచి ఆలోచనతో ఈ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పుకొచ్చారు. ఇంకెన్నాళ్లు విదేశాల గురించి మాట్లాడుకుంటాం..? అని ప్రశ్నించారు. పదేళ్ల సమయం ఇవ్వండి.. న్యూయార్క్ను మరిపించే నగరం కడతానని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పేర్కొన్నారు.'మంచి సంకల్పంతో తలపెట్టిన ఈ భారత్ ఫ్యూచర్ సిటీ ప్రారంభోత్సవానికి వరుణదేవుడు కూడా సహకరించాడు. ఆనాడు కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరానికి అంకురార్పణ చేశారు. నిజాం కాలంలో సికింద్రాబాద్ను అభివృద్ధి చేశారు. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, సిలికాన్ వ్యాలీ అభివృద్ధి జరిగింది. గతం నుంచి మనం నేర్చుకోవలసింది ఎంతో ఉంది. మన భవిష్యత్ తరాల కోసం ఫ్యూచర్ సిటీని నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచ నగరాలు భారత్ ఫ్యూచర్ సిటీ గురించి చర్చించుకునేలా నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం. ఒక గొప్ప నగరాన్ని నిర్మించడానికి ఉండాల్సిన అర్హతలన్నీ భారత్ ఫ్యూచర్ సిటీకి ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ హైవేలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేసుకోబోతున్నాం. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి వరకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయబోతున్నాం' అని సీఎం రేవంత్రెడ్డి తెలిపారు.'రాబోయే పదేళ్లలో ప్రపంచంలో ఉండే ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఈ భారత్ ఫ్యూచర్ సిటీలో ఉండాలన్నదే మా లక్ష్యం. ఫ్యూచర్ సిటీని ఒక గొప్ప నగరంగా

మిగతా 2లో

**ఆసియా కప్ ఫైనల్లో అజేయ భారత్ జయభేరి మోగించింది. ఊహించిన దానికంటే ఉత్కంఠగాసాగిన టైటిల్ పోరులో తిలక్ వర్మ (69 నాటౌట్)వీరోచిత పోరాటంతో ఐదు వికెట్ల తేడాతో పాకిస్థాన్ను మట్టికరిపించింది. . 41 ఏళ్ల తర్వాత చిరకాల ప్రత్యర్థులు తలపడిన టైటిల్ పోరు అసలైన క్రికెట్ మజాను అభిమానులకు అందించింది. మునివేళ్లపై నిలబెడుతూ సాగిన పోరులో భారత్. తిలక్ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. సంజూ శాంసన్ (24), శివం దూబే(33)లతో అర్ధ సెంచరీ భాగస్వామ్యాలు నెలకొల్పిన తిలక్.. రవుఫ్ వేసిన చివరి ఓవర్లో సిక్సర్తో విజయాన్ని ఖాయం చేశాడు. ఒకే రన్ అవసరంకాగా.. రింకూ సింగ్(4 నాటౌట్) బౌండరీ బాదడంతో తొమ్మిదోసారి ఆసియా కప్ ఛాంపియన్గా నిలిచింది.**

# టీమిండియాదే ఆసియా కప్




## సిటీకి మెట్రోను ముంచేసి ఫ్యూచర్ సిటీని కడతాడట.. సీఎం రేవంత్ పై కేటీఆర్ సెటైర్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లతో విరుచుకుపడ్డారు. 'ఇప్పుడున్న సిటీకి మెట్రోను ముంచేసి ఫ్యూచర్ సిటీ కడతాడట' అంటూ ఆయన ఎద్దేవా చేశారు. సిటీకి మెట్రోను

మిగతా 2లో

## రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచండి.. అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు



బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచండి అని ఆర్టీసీ అధికారులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. %రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచండి.. అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు

హైదరాబాద్ : బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచండి అని ఆర్టీసీ అధికారులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఇవాళ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.సద్దుల బతుకమ్మ, దసరా పండుగ

## న్యాయస్థానం మెట్లెక్కిన విజయ్ పార్టీ



- కరూర్ లో విజయ్ సభలో తొక్కిసలాట.. 40కి చేరిన మృతుల సంఖ్య
- కఘటనపై స్వతంత్ర, పారదర్శక విచారణ కోరుతూ మద్రాస్ హైకోర్టులో టీవీకే పిటిషన్
- సోమవారం మధ్యాహ్నం మదురై బెంచ్ లో అత్యవసర విచారణ

తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ నిర్వహించిన రాజకీయ సభలో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటన తీవ్ర రాజకీయ, న్యాయపరమైన మలుపు తీసుకుంది. 40 మంది ప్రాణాలు బలిగొన్న ఈ విషాదంపై స్వతంత్ర, పారదర్శక విచారణ జరిపించాలని కోరుతూ స్వయంగా విజయ్

మిగతా 2లో

సత్యమేవ జయతే

సోమవారం 29 సెప్టెంబర్ 2025

# పదేళ్లు సమయం ఇవ్వండి.. న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతా..: సీఎం రేవంత్‌రెడ్డి

ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఇందుకు మీ అందరి సహకారం ఉండాలి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుందాం. ప్రభుత్వం ఉదారంగా మిమ్మల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉంది. నేను కూర్చుని మీ సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నా. రాజకీయ పార్టీల ఉచ్చులో పడి కోర్టులకు వెళ్లి నష్టపోవద్దు. తక్షణమే మీ సమస్యలను పరిష్కరించాలని మా అధికారులను ఆదేశిస్తున్నాను. అందరికీ న్యాయం చేయాలనేదే మా ప్రయత్నం. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ భవనం, స్కిల్ యూనివర్సిటీని పూర్తి చేస్తాం. అప్పుడు నెలకు మూడుసార్లు ఇక్కడికే వచ్చి ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తాం. ప్రపంచంలో ఎవరూ ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చినా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలోనే కూర్చుని మాట్లాడుతా. ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తా. సింగరేణి కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఇక్కడ పది ఎకరాలు కేటాయించాలని మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబుకు సూచన చేస్తున్నాను. 2026 డిసెంబర్‌లోగా ఆ కార్యాలయ నిర్మాణం పూర్తిచేసుకునేలా చూడాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు..తనకు పదేళ్లు సమయం ఇస్తే, ప్రపంచ ప్రఖ్యాత నగరం న్యూయార్క్‌ను మించిపోయేలా తెలంగాణలో ఒక అద్భుతమైన నగరాన్ని నిర్మించి చూపిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కొందరు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించిన ఆయన, ఈ బృహత్తర ప్రాజెక్ట్ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, రాష్ట్ర భవిష్యత్ తరాల ఉజ్వల భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలో ఆదివారం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయానికి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "విదేశాలకు వెళ్లి వచ్చిన ప్రతి ఒక్కరూ న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ నగరాల గొప్పదనం గురించి చెబుతుంటారు. మనం ఇంకెన్నాళ్లు ఆ నగరాల గురించి మాట్లాడుకుంటూ ఉండిపోవాలి? అలాంటి ప్రపంచ స్థాయి నగరాన్ని మన తెలంగాణలో ఎందుకు నిర్మించుకోలేం?" అని ప్రశ్నించారు. ప్రజలు తనకు అవకాశం ఇస్తే, పదేళ్లలోనే ఆ కల సాకారం చేసి చూపిస్తానని అన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మరో 70 ఏళ్ల తర్వాత కూడా ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలపైనా ఆయన స్పందించారు. "కొందరు ఈ ప్రాజెక్ట్‌ను నా వ్యక్తిగత ఆస్తుల కోసం చేస్తున్నానని అనవసర ఆరోపణలు చేస్తున్నారు. ఇది అవాస్తవం. ఇది నా కోసం కాదు, మన పిల్లల భవిష్యత్తు కోసం నిర్మిస్తున్న నగరం" అని ఆయన గట్టిగా చెప్పారు. గతంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర రెడ్డి లాంటి నాయకులు దూరదృష్టితో ఆలోచించడం వల్లే ఈరోజు తెలంగాణలో హైటెక్ సిటీ, శంషాబాద్ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేశారు. గత పాలకుల నుంచి మంచిని స్వీకరించి ముందుకు సాగాలన్నదే తన విధానమని తెలిపారు.ఈ ఫ్యూచర్ సిటీలో బుల్లెట్ రైళ్లు, అత్యాధునిక రవాణా వ్యవస్థలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, ప్రపంచ స్థాయి విద్యా, వైద్య సంస్థలు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానికంగా వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం విజయవంతం కావడానికి స్థానిక ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఏదైనా ఒక మంచి పనికి శ్రీకారం చుట్టినప్పుడు విమర్శలు రావడం సర్వసాధారణమని, వాటిని పట్టించుకోకుండా లక్ష్యం వైపు సాగినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

హైదరాబాద్ నగరంలోని చెరువుల పరిరక్షణ కోసం 'హైడ్రా' (హైదరాబాద్ రోడ్స్ అండ్ బిల్డింగ్స్ అథారిటీ) ఏర్పాటు ఆలోచన చేసినప్పుడు కూడా తనపై ప్రారంభంలో విమర్శలు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని, అంబర్‌పేటలో సుదీర్ఘకాలం కబ్జాలకు గురై కనుమరుగైన బతుకమ్మకుంటను పునరుద్ధరించిన తర్వాత ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.ఒకప్పుడు ఆనవాళ్లు కూడా లేకుండా పోయిన బతుకమ్మకుంటను తిరిగి పునరుద్ధరించడం ఒక గొప్ప మైలురాయి అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రూ.7.15 కోట్ల వ్యయంతో 14.16 ఎకరాల విస్తీర్ణంలో హైడ్రా చేపట్టిన పనులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి బతుకమ్మలతో హాజరైన స్థానిక మహిళలు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైడ్రా రూపొందించిన ప్రత్యేక గీతాన్ని సీఎం ఆవిష్కరించారు.

మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల నగరంలో అకస్మాత్తుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో కేవలం 2 సెంటీమీటర్ల వర్షం పడితేనే నగరం అస్తవ్యస్తంగా మారుతోంది. దీనికి ప్రధాన కారణం చెరువులు, నాలాలు కబ్జాకు గురికావడమే. ఒకప్పుడు హైదరాబాద్‌కు చెరువులు, మూసీ నది గొప్ప వరం. కానీ ఆక్రమణల వల్ల మూసీ అంటే మురికికూపం అనేలా తయారైంది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వరద నీటిని నియంత్రించడానికి సమగ్ర ప్రణాళికలు అవసరమని, నగరంలోని సహజ వనరులను కాపాడుకోవడం ద్వారానే హైదరాబాద్ భవిష్యత్తు స్థిరంగా ఉంటుందని స్పష్టం చేశారు. బతుకమ్మకుంట పునరుద్ధరణ స్ఫూర్తితో నగరంలోని మిగతా చెరువులను కూడా కాపాడుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసియా కప్ విజేతగా భారత్

ఆసియా కప్ ఫైనల్లో అజేయ భారత్ జయభేరి మోగించింది. ఊహించిన దానికంటే ఉత్కంఠగాసాగిన టైటిల్ పోరులో తిలక్ వర్మ (69 నాటౌట్)వీరోచిత పోరాటంతో ఐదు వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. 41 ఏళ్ల తర్వాత చిరకాల ప్రత్యర్థులు తలపడిన టైటిల్ పోరు అసలైన క్రికెట్ మజాను అభిమానులకు అందించింది. మునివేళ్లపై నిలబెడుతూ సాగిన పోరులో భారత్. తిలక్ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. సంజూ శాంసన్ (24), శివం దూబే(33)లతో అర్ధ సెంచరీ భాగస్వామ్యాలు నెలకొల్పిన తిలక్.. రవుఫ్ వేసిన చివరి ఓవర్లో సిక్సర్‌తో విజయాన్ని ఖాయం చేశాడు. ఒకే రన్ అవసరంకాగా.. రింకూ సింగ్(4 నాటౌట్) బౌండరీ బాదడంతో తొమ్మిదోసారి ఆసియా కప్ ఛాంపియన్‌గా నిలిచింది.%లీగ్ దశ సూపర్ 4లో అలవోకగా నెగ్గిన టీమిండియాకు ఫైనల్లో పాకిస్థాన్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఛేదనలో టోర్నీ ఆసాంతం అదరగొట్టిన అభిషేక్ శర్మ(5) ఫైనల్లో ఉసూరుమనిపించాడు. పెద్ద షాట్లతో విరుచుకుపడాలనుకున్న అభిని పాక్ పేసర్ ఫహీం స్లో డెలివరీతో బోల్తాకొట్టించాడు. ఆ కాసేపటకే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(1) లాంగాఫ్‌లో షాట్‌కు యత్నించి సల్మాన్ అఘా చేతికి దొరికాడు. దాంతో..2.3 ఓవర్లలో 10 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. సమోచితంగా ఆడాల్సిన ఓపెనర్ శుభ్‌మన్ గిల్(5 నాటౌట్) సైతం ఫహీం ఓవర్లోనే రవుఫ్ చేతికి దొరికాడు.. అయినా సరే తిలక్ వర్మ (1నాటౌట్) ఒత్తిడిలోననూ కీలక ఇన్నింగ్స్




ఆడాడు. నాలుగో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పిన సంజూ శాంసన్(24) ఔటయ్యాడు. అబ్రార్ ఓవర్లో బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా సంజూ ఆడిన బంతిని ఫఖర్ చక్కగా అందుకున్నాడు. దాంతో.. 57 పరుగుల విలువైన భాగస్వామ్యానికి తెరపడింది.సంజూ శాంసన్(24)తో కలిసి 44 బంతుల్లో 50 రన్స్ జోడించాడు. అబ్రార్ ఓవర్లో తిలక్, ఆయూబ్ ఓవర్లో చెరొక సిక్సర్ బాదిన ఈ ఇద్దరూ జట్టు స్కోర్ 70 దాటించారు. రన్‌రేటు పెరుగుతున్నందున పెద్ద షాట్‌కు యత్నించిన సంజూ వెనుదిరిగాడు. ఇంకా విజయానికి 46 బంతుల్లో 70 రన్స్ కావాలి. రవుఫ్ వేసిన 15వ ఓవర్లో.. దూబే బౌండరీ బాదగా చివరి బంతిని తిలక్ స్టాండ్స్‌లోకి పంపగా జట్టు స్కోర్ వందకు చేరింది. రవుఫ్ వేసిన 18వ ఓవర్లో శివం దూబే(33) సిక్సర్‌తో సమీకరణం 12 బంతులకు 17 రన్స్‌గా మారింది. ఫహీం మూడు బంతులకు మూడు రన్స్ రాగా.. నాలుగో బంతిని బౌండరీకి పంపాడు దూబే.. చివరి బంతికి ఔటయ్యాడు. చివరి ఓవర్లో 10 రన్స్ అవసరమవ్వగా.. తిలక్ సిక్సర్‌తో జట్టును విజయానికి చేరువ చేశాడు. రింకూ సింగ్ బౌండరీ కొట్టడంతో రెండు బంతులు మిగిలి ఉండగానే 5 వికెట్ల విజయంతో విజేతగా నిలిచింది టీమిండియా.

## సిటీకి మెట్రోను ముంచేసి ఫ్యూచర్ సిటీని కడతాడట.. సీఎం రేవంత్ పై కేటీఆర్ సెటైర్

రద్దు చేసి ఫ్యూచర్ సిటీకి మెట్రో ప్రణాళిక వేయడంలోనే రేవంత్ రెడ్డి చావు తెలివితేటలు బయటపడ్డాయని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని రేవంత్ రెడ్డి సొంత పార్టీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వ్యాసాలు రాస్తున్నాడని కేటీఆర్ గుర్తుచేశారు.అధికార పార్టీకి చెందిన మరో ఎమ్మెల్యే.. 'మా ముఖ్యమంత్రి నిధులు ఇవ్వడంలేదని వరల్డ్ బ్యాంకుకు లేఖలు రాస్తున్నాడు' అని, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అంత అధ్వాన్నంగా ఉందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నికల రూపంలో ప్రజలకు మంచి అవకాశం దొరికిందని కేటీఆర్ అన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేసేందుకు బాకీ కార్డులను ప్రజలకు అందజేస్తున్నామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.మంత్రి జూపల్లి కృష్ణారావు మాటలు వింటుంటే నవ్వొస్తోందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ మంత్రులు తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందో లేదో అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అచ్చంపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనగర్జన సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. అచ్చంపేట నుంచి జైత్రయాత్ర మొదలుపెడుతున్నామని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. గతంలోనే తాము ఆల్మట్టి ప్రాజెక్ట్ ఎత్తు పెంపును అడ్డుకున్నామని గుర్తు చేశారు. మళ్లీ పెంపునకు కర్ణాటక ప్రభుత్వం చర్యలు చేపడితే నల్లమల పులిబిడ్డగా చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తారో చూడాలని ఎద్దేవా చేశారు. గతంలో ఆర్డినెన్స్‌పై గట్టిగా హెచ్చరించిన పులి మాజీ సీఎం కేసీఆర్ అని కేటీఆర్ గుర్తు చేశారు. ఆల్మట్టిని అడ్డుకునే దమ్ముంటే రాహుల్ గాంధీతో చెప్పి కర్ణాటక సీఎంను పిలిపించి ఎత్తును అడ్డుకోవాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి నల్లమల పులికాదు.. నల్లమల నక్క.. అని విమర్శించారు. పెంచుతామన్న పెన్షన్లు, మహిళలకు ఇస్తామన్న రెండున్నరవేలకు మొండిచేయి చూపారని ఆరోపించారు. కాంగ్రెస్ బాకీ కార్డును ఇంటింటికీ పంపిణీ చేసి ప్రభుత్వ తీరును ఎండగడతామని ధీమా వ్యక్తం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఏమయ్యిందని నిలదీశారు.కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు బీఆర్ఎస్‌కు బ్రహ్మాస్త్రంగా మారుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మోసపోతే గోస పడతామని కేసీఆర్ ఆనాడే చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు యూరియా విషయంలో తెలుస్తోందని చెప్పుకొచ్చారు. సన్నవడ్లకు బోనస్ అనేది బోగస్ అయ్యిందని విమర్శించారు. అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి తాము శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు చేయటానికి రేవంత్ రెడ్డికి చేతకావటం లేదని ఆరోపించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే పనులు చేపట్టడం లేదని విమర్శించారు. రాహుల్ గాంధీకి భయపడి ఆల్మట్టిపై రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదని మండిపడ్డారు.

రాష్ట్రానికి పెద్ద మనిషి అయిన సీఎం రేవంత్ రెడ్డి తమకు అప్పు పుట్టడం లేదని చెప్పటం సిగ్గుచేటని కేటీఆర్ విమర్శించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. త్వరలో అచ్చంపేటకు మంచి నాయకుడిని నియమిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సభకు మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామారెడ్డి, నవీన్ రెడ్డి, ఎమ్మెల్యేలు విజయుడు, ఇన్ ఛార్జ్ మర్రి జనార్దన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు హాజరయ్యారు..

## రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచండి.. అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు

సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారికి రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాలకు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ప్రతి బస్ స్టేషన్‌లోనూ ప్రత్యేక అధికారిని నియమించాలని, అక్కడ రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలతో పాటు ఉన్నతాధికారులందరూ క్షేత్రస్థాయిలో ఉంటూ.. 97 డిపోలు 340 బస్ స్టేషన్లు సమన్వయం చేసుకొని ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆదేశించారు.దసరా నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 7754 స్పెషల్ బస్సులను టీజీఎస్ఆర్టీసీ నడుపుతున్నట్లు మంత్రి దృష్టికి ఆర్టీసీ ఉన్నతాధికారులు తీసుకెళ్లారు. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, దసరా అక్టోబర్ 2న ఉన్నందున.. ఈ శనివారం నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచామని అధికారులు వివరించారు.

## ఇక్కడ ఎవరున్నారో ఆ మౌలానా మరిచిపోయినట్లున్నారు: యోగి ఆదిత్యనాథ్

ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో పోలీసులు, స్థానికుల మధ్య జరిగిన హింసాత్మక ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. వ్యవస్థను ఎవరు అడ్డుకున్నా తమ ప్రభుత్వం అమలు చేసే శిక్ష కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. శనివారం జరిగిన 'వికసిత్ యూపీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఐ లవ్ మహమ్మద్" ప్రచారానికి మద్దతుగా నిరసనకు పిలుపునిచ్చిన ఇత్తెహాద్ ఎ మిల్లత్ కౌన్సిల్ చీఫ్ మతాధికారి తౌకీర్ రజా ఖాన్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు."నిన్న, ఒక మౌలానా రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నారో మరిచినట్లున్నారు. ఈ వ్యవస్థను ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆపేస్తానని అనుకుంటున్నారేమో. కానీ మేం ఒక విషయం స్పష్టంగా చెప్పదలుచుకున్నాం. రోడ్ల దిగ్బంధం కావొచ్చు, కర్ఫ్యూ కావొచ్చు, అల్లర్లకు పాల్పడే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకునేలా మేం గట్టిగా గుణపాఠం చెప్పి తీరుతాం" అని ముఖ్యమంత్రి హెచ్చరించారు.రాష్ట్రంలో 2017కు ముందు వ్యవస్థను నిలిపివేసే పరిస్థితి ఉండేదని, కానీ ఆ తర్వాత ఒక్క కర్ఫ్యూని కూడా తాము అనుమతించడం లేదని స్పష్టం చేశారు. అప్పటి నుంచే ఉత్తరప్రదేశ్ అభివృద్ధి కథ మొదలైందని అన్నారు.

కాగా, పోలీసులు తౌకీర్‌ను అదుపులోకి తీసుకుని కస్టడీకి తరలించారు. "తౌకీర్ రజాను అదుపులోకి తీసుకున్నాం. చట్టపరమైన చర్యలు కొనసాగుతాయి. అంతా ప్రశాంతంగానే ఉంది. పరిస్థితి నియంత్రణలో ఉంది" అని బరేలీ ఎస్ఎస్పీ అనురాగ్ ఆర్య మీడియాకు తెలిపారు.

## భారత్ వంటి దేశాలు మాతో మాట్లాడేటప్పుడు నోరు జాగ్రత్త: అమెరికా మంత్రి వార్నింగ్

**అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హెూవార్డ్ లుట్నిక్ సంచలన వ్యాఖ్యలు**

**అమెరికా మార్కెట్‌ను భారత్ దుర్వినియోగం చేస్తోందని ఆరోపణ**

**రష్యా నుంచి చమురు కొనుగోలుపై తీవ్ర అభ్యంతరం**

**విధానాలు మార్చుకోకపోతే పరిణామాలు తప్పవని వార్నింగ్**

**ట్రంప్ అధికారంలోకి వస్తే వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగే సూచనలు**



అమెరికా వాణిజ్య మంత్రి హెూవార్డ్ లుట్నిక్ భారత్‌ను ఉద్దేశించి తీవ్రమైన హెచ్చరికలు చేశారు. "మా గురించి మాట్లాడేటప్పుడు భారత్, బ్రెజిల్ వంటి దేశాలు చాలా జాగ్రత్తగా ఉండాలి" అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ రాజుకునేలా ఉన్నాయి.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన లుట్నిక్, అమెరికా మార్కెట్‌ను భారత్ తన స్వప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. "భారత్ వెంటనే తన మార్కెట్లను పూర్తిగా అందుబాటులో ఉంచాలి. అమెరికా ప్రయోజనాలకు నష్టం కలిగించే విధానాలను తక్షణమే విరమించుకోవాలి. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ఆయన హెచ్చరించారు. స్విట్జర్లాండ్, బ్రెజిల్‌తో పాటు భారత్‌ను కూడా అమెరికా 'సరిచేయాల్సిన' దేశాల జాబితాలో చేర్చడం గమనార్హం. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత భారత్.. రష్యా నుంచి రాయితీపై ముడి చమురు దిగుమతులను భారీగా పెంచడాన్ని కూడా లుట్నిక్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది అమెరికా విధానాలకు పూర్తిగా విరుద్ధమని ఆయన అన్నారు. ఇప్పటికైనా భారత్ ఎవరి పక్షాన నిలబడాలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో వాణిజ్య ఒప్పందాలపై దాని ప్రభావం పడుతుందని పరోక్షంగా సూచించారు.

ుట్నిక్ వ్యాఖ్యలు ట్రంప్ అనుసరించే 'అమెరికా ఫస్ట్' విధానాలకు అద్దం పడుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం ఇంకా అధికారికంగా స్పందించలేదు.

## న్యాయస్థానం మెట్లెక్కిన విజయ్ పార్టీ పార్టీయే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించడం గమనార్హం.

ఈ ఘటనపై తమ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం మధ్యాహ్నం 2:15 గంటలకు మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం అత్యవసరంగా విచారించనుందని టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ సి.టి.ఆర్. నిర్మల్ కుమార్ ఆదివారం మీడియాకు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ జస్టిస్ ఎం. దండపాణి నివాసంలో తమ న్యాయవాదుల బృందం అత్యవసరంగా ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు ఆయన వివరించారు. జనసందోహం నిర్వహణ, భద్రతా ఏర్పాట్లలో జవాబుదారీతనాన్ని నిర్ధారించేందుకు స్వతంత్ర విచారణ అవసరమని కోర్టుకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.శనివారం సాయంత్రం కరూర్ లోని వేలుసామిపురంలో జరిగిన ఈ బహిరంగ సభలో తొక్కిసలాట చోటుచేసుకుంది. విజయ్ ప్రసంగాన్ని వినేందుకు వేలాదిగా జనం ఉదయం నుంచే తీవ్రమైన ఎండలో వేచి ఉన్నారు. అయితే, సరైన ఆహారం, నీరు, వైద్య సదుపాయాలు లేకపోవడం, విజయ్ రాక ఆలస్యం కావడంతో జనం ఒక్కసారిగా వేదిక వద్దకు చొచ్చుకురావడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరుకైన దారుల్లో తొక్కిసలాట జరిగి ఊపిరాడక, కాళ్ల కిందపడి అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 9 మంది చిన్నారులు, అధికశాతం మహిళలు ఉన్నారు. మరో 60 మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, రిటైర్డ్ జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌తో విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు. అయితే, ప్రతిపక్ష నేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ఇది ప్రభుత్వ భద్రతా వైఫల్యం వల్లే జరిగిందని, ఇది మానవ తప్పిదమని తీవ్రంగా ఆరోపించారు. మృతుల సంఖ్య పెరుగుతుండటం, ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, న్యాయస్థానం జోక్యంతో ఈ ఘటనపై రాబోయే రోజుల్లో రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

## పోలీస్ కొత్త బాస్... నేరస్తుల గుండెల్లో రైళ్లు..

**వరంగల్ యాసిడ్ దాడి నుంచి...**

**షాద్ నగర్ దిశా ఎన్‌కౌంటర్ వరకు..**

**సజ్జనార్ సంచలన ట్రాక్ రికార్డ్ ఇదే.**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో భారీగా బదిలీలు చేసింది. ఇందులో భాగంగాసజ్జనార్ హైదరాబాద్ కమిషనర్ లను నియమించింది. పోలీస్ డిపార్ట్మెంట్లో సజ్జనార్ అంటూ ఓ ట్రాక్ రికార్డ్ ఉంది.ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్ గా పేరున్న ఆయన కొన్నాళ్ల పాటు ఖాకీ చొక్కా వదిలి ఆర్టీసీ ఎండీగా కూడా పని చేయాల్సి వచ్చింది. మళ్లీ ఇప్పుడు హైదరాబాద్ పోలీస్ బాస్ గా మరోసారి లాఠీ పట్టుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన "ట్రాక్ రికార్డ్ పై స్పెషల్ స్టోరీ."%ఖ్రూ% సజ్జనార్.. ఈ పేరు వింటే నేరస్తులు, రేపిస్టుల గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి. ఎందుకంటే ఆయన ఎన్కౌంటర్ స్పెషలిస్ట్. సంచలనం సృష్టించిన వరంగల్ ఇంజనీరింగ్ కాలేజీ యువతులపై యాసిడ్ దాడి, హైదరాబాద్ సమీపంలో జరిగిన దిశా రేప్.. ఈ రెండు కేసుల్లో ఆయన హాయంలో ఏడుగురు నేరస్తులు ఎన్కౌంటర్ లో హతమయ్యారు. ఆ తర్వాత ప్రభుత్వం ఆయనను %ఖూ=ఒ% ఎండీగా నియమించింది. అక్కడ కూడా తనదైన మార్క్ చూపిన సజ్జనార్.. నాలుగేళ్ల తర్వాత ఆయన మళ్లీ యూనిఫాం వేయనున్నారు. ఇటీవల హైదరాబాద్ లో క్రైమ్ రేటు విపరీతంగా పెరిగిపోయింది. అందుకే ప్రభుత్వం సజ్జనార్ కు మళ్లీ లాఠీ చేతికిచ్చిందన్న చర్చ సాగుతోంది.2008లో వరంగల్ ఎస్పీగా ఉన్నప్పుడు, ఇంజనీరింగ విద్యార్థినులపై యాసిడ్ దాడి చేసిన ముగ్గురు నిందితులను సజ్జనార్ ఎన్కౌంటర్లో లేపేశారు. ఆ టైంలో ఆయనపై పెద్ద ఎత్తున ప్రసంశలు వచ్చాయి. నిందితులు క్రైమ్ సీన్ రీక్రియేషన్ సమయంలో తప్పించుకునే ప్రయత్నంలో పోలీసులపై దాడి చేశారు. పోలీసుల ఆత్మరక్షణలో ఎన్కౌంటర్ జరిగింది. ఈ సంఘటనతో 'ఎన్కౌంటర్ స్పెషలిస్ట్' అనే ట్యాగ్ సజ్జనార్కు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఆయన చేసిన పని సామాన్య ప్రజలు మెచ్చుకున్నారు.

2018 మార్చిలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్గా నియమితులైన సజ్జనార్ క్రైమ్ రేట్ తగ్గించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు, పిల్లల సేఫ్టీ, సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీపై ఫోకస్ చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్, సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాలు తీసుకువచ్చారు. 2019, నవంబర్ 27న జరిగిన వెటర్నటీ డాక్టర్ దిశ హత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మహబూబ్ నగర్ చెందిన మహ్మద్ ఆరిఫ్ పాషా, జొల్లు శివ, నవీన్, చెన్నకేశవులు షాద్‌నగర్ %ూ==% టోల్గేట్ సమీపంలో దిశాను అత్యాచారం చేసి, హత్య చేశారు. మృతదేహాన్ని షాద్ నగర్ మండలం చటాన్ పల్లి జాతీయ రహదారిపై ఉన్న వంతెన కిందకు తీసుకెళ్లి డీజిల్ పోసి నిప్పంటించారు. ఈ కేసు రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమైంది. స్పాట్లో ఎలాంటి ఆధారాలు దొరకకపోయినా ఈ కేసు సజ్జనార్ వారం రోజుల్లోనే ఛేదించారు.

సత్యమేవ జయతే

సోమవారం 29 సెప్టెంబర్ 2025

## పరిగి పట్టణంలో ఆత్మ కమిటీ నూతన భవనాన్ని ప్రారంభించిన పరిగి ఎమ్మెల్యే. టీ రామ్మోహన్ రెడ్డి...



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా...పరిగి పట్టణంలో వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ%-%ఆత్మ) కమిటీ నూతన భవనాన్ని పరిగి ఎమ్మెల్యే %డ% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీ ఆర్ ఆర్ మాట్లాడుతూ... రైతుల అభివృద్ధికి ఆత్మ కమిటీ కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ భవనం ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,ఆధునిక వ్యవసాయ పద్ధతులు,ప్రభుత్వ పథకాలపై అవగాహన మరింత సులభంగా అందుతుందని చెప్పారు. జిల్లాలోని మొట్టమొదటి ఆత్మ కమిటీ భవనం పరిగిలో నిర్మించడం గర్వకారణమని ఎమ్మెల్యే గారు తెలిపారు.

అలాగే భూమికి భూసార పరీక్షలు చేయించడం ద్వారా పంట దిగుబడి ఎక్కువగా పెరుగుతుందని రైతులకు సూచించారు.వ్యవసాయ శాఖలో ఆధునాతన పద్ధతులను రైతులు తప్పనిసరిగా తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో వరి పంట అధికంగా పండబోతుందని అన్నారు..

## దారూర్ మండలంలోని వివిధ గ్రామాలలో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి బృందం పర్యటన...గోపాల్ రెడ్డి...




. సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా... రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు ముఖ్యంగా రైతులు అల్లాడి పోతున్నారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పంటలు పూర్తిగా నష్టపోయి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వర్షాల కారణంగా ప్రజలు, రైతులు అడతేవు లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు,రైతులు అల్లాడి పోతున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు స్పందించి యుద్ధ ప్రతికన సహాయ చర్యలు చేపటి ప్రజలను, రైతులను ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేశారు..

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం. - ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి..

### ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే...



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..టి పరిగి మండలం సుల్తాన్పూర్ తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ పూజా కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే %డ% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అధికారులు,స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి లబ్దిదారులతో కలిసి నూతన గృహప్రవేశంలో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు.లబ్దిదారుల కుటుంబంతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.తమ సొంత ఇంటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,పరిగి ఎమ్మెల్యే టీ ఆర్ ఆర్ ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని లబ్దిదారులు తెలిపారు.

# పటాన్‌చెరు నియోజకవర్గంలోని బిహెచ్ఎల్ లో ఓనం ఉత్సవాలలో పాల్గొన్న మాదిరి ప్రిథ్వీరాజ్







సత్యమేవ జయతే- పటాన్చెరు పటాన్‌చెరు నియోజకవర్గంలోని బిహెచ్ఎల్ అయ్యప్ప దేవాలయం ఆవరణలో, కేరళ సంబంధిత నాయర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఓనం మహోత్సవం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి టీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎం డి ఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్ గారు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. నాయర్ అసోసియేషన్ ప్రతినిధులు పృథ్వీరాజ్ గారిని శాలువా మరియు మోమెంటోతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓనం పండుగ కేవలం కేరళ ప్రజలకు మాత్రమే కాకుండా, మన దేశంలోని సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీక అని, పండుగలు ప్రజల మధ్య ప్రేమ, ఐక్యత, సహకార భావాలను పెంచుతాయని, మనం ఎక్కడి నుంచో వచ్చినా, ఏ భాష మాట్లాడినా, పండుగలే మనందరినీ కలుపుతాయని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ నృత్యాలు, ఓనసద్య (విందు భోజనం) తో వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో శేర్లింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ , వెస్ట్ జోన్ బిల్డర్ అసోసియేషన్ సభ్యులు మిర్యాల రాఘవరావు , నాయర్ అసోసియేషన్ సభ్యులు, కేరళ రాష్ట్ర కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నారింజ వాగును సందర్శించిన ఎమ్మెల్యే మాణిక్ రావు,డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్







సత్యమేవ జయతే -జహీరాబాద్ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నారింజ వాగు నిండి , నీటి ప్రవాహం పెరుగుతున్న వరద ఉధృతి వల్ల చుట్టుపక్కల గ్రామాల రైతులు, ప్రజలు ఎదుర్కుంటున్న ఇబ్బందులను నారింజ వాగును సందర్శించి ,అడిగి తెలుసుకుని, అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని , ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ శాసనసభ్యులు శ్రీ కొనింటి మాణిక్ రావు , డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్. ఎమ్మెల్యే గారి %డ% చైర్మన్ గార్లతో పాటుగా మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప,మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్,జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం , మాజీ కేతకీ సంగమేశ్వర ఆలయ చైర్మన్ నర్సింహా గౌడ్, మాజీ న్యాల్కల్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింహా రెడ్డి,కొత్తూరు బి గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు శ్రీకాంత్ , నాగుర్ అరుణ్ ,ప్రశాంత్,మాణిక్ , మల్లప్పా, అతీఫ్, తౌఫిక్ , కలీమ్ నాయకులు కార్యకర్తలు తదితరులు.

# 42శాతం రిజర్వేషన్ లు పచ్చి మోసం..!

**42శాతం రిజర్వేషన్ లు పచ్చి మోసం..!**

**- ఓ చేత్తో ఇచ్చి.. మరో చేత్తో అడ్డుకునే కుట్ర**

**- ఇచ్చిన హామీలను అమలులో విఫలం**

**- కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు**

**-ఇంటింటికి కాంగ్రెస్ బాకీల ఉద్యమంకు శ్రీకారం**

**- బీసీ కమీషన్ మాజీ సభ్యులు నూలి శుభప్రద్ పటేల్....**




సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..తాండూరు, : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పేరుతో మోసం చేసేందుకు యత్నిస్తోందని రాష్ట్ర బీసీ కమీషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నూలి శుభప్రద్ పటేల్ విమర్శించారు.ఆదివారం తాండూరు పట్టణంలోని ఎన్ఎస్పీ ట్రస్టు కార్యాలయంలో శుభప్రద్ పటేల్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం బీసీల రిజర్వేషన్లపై ఇచ్చిన జీఓలో మోసం దాగి ఉందని అన్నారు. కేవలం జీవో మేరకే రిజర్వేషన్లను ప్రకటించే అవకాశం ఉంటే 22నెలల సమయం ఎందుకు అవసరమని ప్రశ్నించారు. జీఓలను కోర్టు కొట్టేస్తుందని తెలిసి డ్రామాలు ఆడుతుందని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో తమిళనాడు తరహాలో చట్టం చేసి రిజర్వేషన్లను ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ నుంచి కోరడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిందని గుర్తుచేశారు. రిజర్వేషన్ కోసం చట్టం చేసి కేంద్రానికి పంపిస్తామని చెప్పిందని, అనుకున్నట్లుగా చట్టంను కేంద్రానికి పంపితే పెండింగ్ లో ఉండిపోయిందని, చట్టంతో పాటు అసెంబ్లీలో తీర్మానించిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్ లోనే ఉండిపోయాయని అన్నారు. చట్టం పెండింగ్లో ఉండగానే జీఓలు ప్రకటించి మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీఓలు జారీ చేస్తే ఆయన ముఖ్య అనుచరుడు మాధవ రెడ్డి అనే వ్యక్తి ద్వారా జీఓలపై హౌస్ మోషన్ పిటిషన్ ద్వారా కోర్టుకు వెళ్లారని ఆరోపించారు.

ఓ చేత్తో రిజర్వేషన్లు ఇచ్చి.. మరో చేత్తో అడ్డుకునే కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎంతో పాటు మంత్రులతో సన్నిహిత సంబంధాలు ఉన్న మాధవ రెడ్డి చేతో కేసును ఉపసంహరించుకోమని చెప్పే అవకాశం లేదా అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ బీసీ రిజర్వేషన్ల బిల్లుపై జీఓ జారీ చేస్తే కోర్టు కొట్టేసిందని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అదే జీవోల ద్వారా రిజర్వేషన్లను ప్రకటించి మోసం చేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. బీసీల రిజర్వేషన్ల చట్టంపై కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలో దర్నాలు చేస్తే సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ ఎవ్వరు, కూడా మద్దతు తెలుపలేదని, అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల రిజర్వేషన్లపై చిత్త శుద్ది లేదనే విషయం అర్థమవుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ కూడా బీసీ రిజర్వేషన్ల విషయంలో పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తుందని విమర్శించారు. ఈ రెండు పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం తప్పదని అన్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. రైతుభీమా, పెట్టుబడి, మహిళలకు ఆర్థిక చేయూత, నిరుద్యోగులకు భృతి వంటి ఎన్నో హామీలను విస్మరించిందని అన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలపై కాంగ్రెస్ బాకీల కార్డు అనే ఉద్యమంతో ఇంటింటికి వెళ్లే కార్యక్రమాన్ని త్వరలో శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించి ఎన్నికల్లో బుద్దిచెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు భాను, నరేష్ గౌడ్, సిద్దిఖ్, శ్రీధర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండగ పూట త్రాగునీరు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం





సత్యమేవ జయతే– సిర్గాపూర్‌నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామంలో గతవారం రోజుల నుండి మిషన్ భగీరథ నీరు రాక మరియు గ్రామంలోని త్రాగునీరు బోరు మోటర్లు కాలిపోయి రిపేర్లు వచ్చిన ఎవరు పట్టించుకోకపోవడంతో ఈరోజు బతుకమ్మ పండుగ రోజు కూడా ఆడపడుచులు దూరం నుంచి నీరు తీసుకువచ్చి నిత్య అవసరాల కోసం వాడుకుని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు..వారు పంచాయతీ సెక్రటరీని నిలదీయగా నా చేతిలో ఏం లేదు నేనే ఇప్పటికె అనేక డబ్బులు పెట్టి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని వారు తెలిపారు..ఆక్రయించిన యువకులు గ్రామస్తులు స్టార్టర్ డబ్బాలను తీసుకువచ్చి గ్రామపంచాయతీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుండి ప్రజలకు తాగునీరు ఇవ్వడంలో విఫలమైందని ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఎంపీ మరియు ఎమ్మెల్యే గారు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిచో రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెబుతామని తెలిపారు..

## ఓట్ చోరీతోనే కేంద్రంలో బీజేపీకి మూడోసారి అధికారం - పరిగి ఎమ్మెల్యే టీ. ఆర్ ఆర్....







సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారు బీజేపీ కేంద్ర ప్రభుత్వంపై 'ఓట్ చోర్.. గద్దె చోడ్' అనే నినాదంతో చేపట్టిన ఓట్ చోరీ ఉద్యమానికి మద్దతుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు పరిగి ఎమ్మెల్యే%ఉ%డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఓట్ చోరీపై తెలంగాణ గ్రామాల్లో సంతకాల సేకరణ కార్యక్రమని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పరిగి పట్టణంలో పలు కాలనీలో ప్రజలను కలిసి సంతకాలను సేకరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ...కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారం పొందిన కారణం ఓటు చోరీనే అని,ఈ అంశాన్ని ప్రతి ఇంటికి చేరవేసే బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఉండాలని పిలుపునిచ్చారు.దేశవ్యాప్తంగా ఓటు చోరీ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని,రాహుల్ గాంధీ గారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు..

## కరూర్ ఘటన.. మృతుల కుటుంబాలకు విజయ్ రూ.20 లక్షల సాయం

తమిళ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తన ప్రచార సభలో జరిగిన దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు భారీ ఆర్థిక సాయాన్ని ప్రకటించి తన బాధ్యతను చాటుకున్నారు. ఈ విషాద ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 20 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే ఘటనలో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. తాను ప్రకటించిన ఈ మొత్తం వారి కుటుంబాల్లో వెలుగులు నింపలేదని, వారికి జరిగిన నష్టాన్ని పూడ్చలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తాను, తన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని విజయ్ హామీ ఇచ్చారు. కాగా, శనివారం కరూర్ పట్టణంలో విజయ్ నిర్వహించిన ప్రచార సభకు భారీగా జనం తరలివచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో 39 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తమిళనాడులో తీవ్ర విషాదాన్ని నింపింది.

# రాంపగోపాలపేట్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు అదుపు తప్పుతున్నాయి







### స్థానికనాయకుల దౌర్జన్యం -జిహెచ్ఎంసీ అధికారులపై బెదిరింపులు - కోట్ల రూపాయల వసూళ్లు

సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : రాంపగోపాలపేట్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు పెచ్చరిల్లిపోతూ ప్రజా సమస్యలుగా మారుతున్నాయి. స్థానికంగా జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాలు బహిరంగ రహస్యమై, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ఉన్న జిహెచ్ఎంసీ అధికారులపైనే ఒత్తిడి, బెదిరింపులు జరిగుతున్నాయని సమాచారం వెలువడుతోంది.

బిల్డర్లు, డెవలపర్లు నుండి భారీ మొత్తాలను వసూలు చేసుకుంటూ, కొందరు స్థానిక నాయకులు ఈ వ్యవహారాలను బలపరుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కు కోట్ల రూపాయల ఆదాయం కోతకు గురవుతూ, చట్టబద్ధమైన పాలన వ్యవస్థ క్రమంగా బలహీనమవుతోంది.

ప్రభుత్వం మారినా పరిస్థితులు మారకపోవడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. క్రమశిక్షణ, నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిన బదులు, కొందరు నాయకులు అక్రమ నిర్మాణాలకు పూర్తిగా సహకరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ నేతలు %-% రియల్ ఎస్టేట్ ముఠాలు కలిసిపోవడంతో పట్టణ పాలనపై ప్రజలకు నమ్మకం దెబ్బతింటోంది.

ఈ పరిస్థితుల్లో జిహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకునే ప్రయత్నం చేస్తే స్థానిక నాయకుల నుంచి తీవ్రమైన బెదిరింపులు ఎదురవుతున్నాయి. దాంతో అధికార యంత్రాంగం కూడా వెనకడుగు వేస్తున్నదని తెలుస్తోంది.

స్థానికులు, పౌర సంఘాలు, జిహెచ్ఎంసీ సిబ్బంది అందరూ కలిసి అక్రమ నిర్మాణాలను అరికట్టాలని, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేయడం, అవినీతి వలయాన్ని ఛేదించడం, జిహెచ్ఎంసీకి పూర్తి స్థాయి అధికారాలు మరియు రక్షణ కల్పించడం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో, రాజకీయ సంకల్పంతో మాత్రమే పారదర్శకతను నెలకొల్పి నగరాన్ని రక్షించవచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాంపగోపాలపేట్ డివిజన్‌లో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాల ముఠాలను అరికట్టడం నగర అభివృద్ధి, ప్రజల విశ్వాసం కోసం అత్యవసరం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ప్రేం నగర్ రోడ్లపై మళ్లీ ప్రజా ఆగ్రహం -నాసిరకం పనులపై కాంట్రాక్టర్‌కు గట్టి హెచ్చరికలు

### ప్రేం నగర్ రోడ్లపై మళ్లీ ప్రజా ఆగ్రహం

### నాసిరకం పనులపై కాంట్రాక్టర్‌కు గట్టి హెచ్చరికలు

సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : బంజారా హిల్స్ పరిధిలోని ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉన్న ప్రేం నగర్ రోడ్లపై మళ్లీ ప్రజా ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొద్ది రోజుల క్రితమే నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకుల కళ్యాణ్, స్థానికంగా జరుగుతున్న రహదారి పనుల నాణ్యతపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ ఫిర్యాదుకు స్పందించిన ప్రభుత్వం, స్థానిక నాయకులు కొత్త రోడ్లను వేయించి, వాటిని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.

అయితే, ప్రజలు చెబుతున్న దాని ప్రకారం కొత్తగా వేసిన రహదారులు ఇప్పటికే చీలిపోతూ, పాడైపోతున్న లక్షణాలు కనిపిస్తున్నాయి. బహిరంగ మాన్‌హోల్స్, పూర్తి కాని పనులు, నాసిరకం మెటీరియల్ వాడకంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా అభివృద్ధి చేసిందని చెప్పబడిన రోడ్డు %ర్‌తీవ్‌ఎష్ట్ర% కేవలం కొన్ని వారాల్లోనే పాడైపోయే స్థితికి చేరుకుందని వారు ఆరోపిస్తున్నారు.

గతంలో నిర్లక్ష్యంతో, ఖర్చు తగ్గించే ప్రయత్నాలతో విమర్శలు ఎదుర్కొన్న కాంట్రాక్టర్ మళ్లీ



ఆరోపణలపాలవుతున్నాడు. ప్రజలు వెంటనే రహదారులను మరమ్మత్తు చేయాలని, ప్రజా డబ్బు వృథా చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇకపై ఇలాంటి నాసిరకం, హడావుడిగా చేసే పనులు జరగకుండా పర్యవేక్షణ కఠినంగా ఉండాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు.

ప్రేం నగర్ నివాసితుల అసహనం రోజు రోజుకూ పెరుగుతుండగా, వారి ఆందోళన స్వరాలు మరింత బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమస్య ఇప్పుడు పాలన నమ్మకాన్ని సవాలు చేసే స్థాయికి చేరుకుంటోంది. అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ అసంతృప్తి పెద్ద ఎత్తున నిరసనలుగా మారే అవకాశం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఆవిష్కరించిన పరిగి ఎమ్మెల్యే టీ ఆర్ ఆర్..













సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా. దోమ మండలంలోని కొండాయిపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే%ఉ% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ గారు మరియు ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.లి ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీ ఆర్ ఆర్ గారు మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాత,సమాజానికి సమానత్వం,న్యాయం అందించిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

అంబేద్కర్ గారి ఆలోచనలు శాశ్వతమై అన్ని తరాలకు దారి చూపే మార్గదర్శకాలు అని పేర్కొన్నారు.

సమాజంలో ఎలాంటి వెనుకబడిన వర్గాలైనా విద్య, హక్కులు, అవకాశాల ద్వారా ముందుకు రావాలని ఆయన కలలు కన్నారని గుర్తుచేశారు. అంబేద్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు.

## వేలు తెగితే 50 రూపాయలకే చికిత్స... భారత్ లో వైద్యంపై అమెరికన్ యువతి వీడియో వైరల్!

**భారత వైద్య వ్యవస్థపై అమెరికన్ మహిళ ప్రశంసలు**

**కూరగాయలు కోస్తూ తెగిన బొటనవేలుకు చికిత్స**

**ఆసుపత్రిలో కేవలం రూ. 50 ఖర్చు అయిందని వెల్లడి**

**అమెరికాలోని ఖరీదైన వైద్యంతో పోల్చుతూ పోస్ట్**

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఇన్స్టాగ్రామ్ వీడియో**



మన దేశ వైద్య వ్యవస్థను ఓ అమెరికన్ మహిళ ఆకాశానికెత్తేశారు. భారత్‌లో వైద్యం ఎంత సులభంగా, చౌకగా లభిస్తుందో వివరిస్తూ ఆమె పోస్ట్ చేసిన ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. కేవలం 50 రూపాయలకే తనకు అద్భుతమైన వైద్యం అందిందని చెప్పడం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. వివరాల్లోకి వెళితే, క్రిస్టెన్ ఫిషర్ అనే అమెరికన్ మహిళ గత నాలుగేళ్లుగా భారతదేశంలో నివసిస్తున్నారు. ఇటీవల ఇంట్లో కూరగాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె బొటనవేలు తెగింది. తీవ్రంగా రక్తస్రావం కావడంతో, ఆమె కంగారు పడకుండా తన సైకిల్‌పై ఇంటికి దగ్గర్లోని ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు వెంటనే స్పందించి ఆమెకు చికిత్స అందించారు. మొత్తం 45 నిమిషాల్లోనే చికిత్స పూర్తయిందని, అదృష్టవశాత్తు కుట్లు వేయాల్సిన అవసరం కూడా రాలేదని క్రిస్టెన్ తెలిపారు. ఈ మొత్తం చికిత్సకు అయిన ఖర్చు కేవలం 50 రూపాయలేనని (సుమారు 60 సెంట్లు) తెలుసుకుని ఆమె ఆశ్చర్యపోయారు. "నా వేలు తెగింది, రక్తం బాగా పోయింది. సైకిల్‌పై ఆసుపత్రికి వెళ్లాను. 45 నిమిషాల్లో పని పూర్తయింది. 50 రూపాయలు చెల్లించి ఇంటికి వచ్చేశా" అని ఆమె తన అనుభవాన్ని ఇన్స్టాగ్రామ్ వీడియోలో పంచుకున్నారు.

## దుర్గామాత దర్శించుకున్న బిజెపి నేత







సత్యమేవ జయతే న్యూస్/ నర్సాపూర్ నర్సాపూర్ పట్టణం లో హిందూ వాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మ వారిని దర్శించుకున్న మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ గారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్ గారు, మెదక్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు గుండం శంకర్ గారు,జిల్లా కార్యవర్గ బాలరాజు గారు,జిల్లా ఎస్టి మోర్చా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్ గారు, నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు చంద్రయ్య గారు, నర్సాపూర్ పట్టణ ప్రజల కార్యదర్శి సంఘసాని రాజు గారు రామ్ రెడ్డి గారు బిజెపి నాయకులు ఉన్నారు...

## భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో వెన్నెముద్ద బతుకమ్మ వేడుకలు



సత్యమేవ జయతే - భద్రాద్రి కొత్తగూడెంభద్రాద్రి కొత్తగూడెం : బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాకుండా తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని, మహిళల సామాజిక కలయికను ప్రోత్సహించే ఆచారంగా నిలిచిందని జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు.

ఆదివారం కలెక్టరేట్ ప్రాంగణంలో అట్టహాసంగా జరిగిన ' వెన్నముద్ద బతుకమ్మ' ఉత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, పూలతో అలంకరించిన గౌరమ్మకు పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలలో భాగంగా ఇంటర్మీడియట్ శాఖ విద్యాశాఖ, ఆధ్వర్యంలో ఈ వేడుకలను విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన బతుకమ్మ పండుగలో గౌరమ్మకు పూలతో పూజించడం ప్రధాన ప్రత్యేకత అని, ఇతర పండుగల మాదిరి నైవేద్యాలకన్నా పూలనే సమర్పించడం బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపును కల్పిస్తుందని పేర్కొన్నారు. పూలను పూజించే మన సంస్కృతి గొప్పదని ఆమె అన్నారు. స్త్రీల ఐక్యత, కుటుంబ సఖ్యతకు ప్రతీకగా నిలిచే వెన్నముద్ద బతుకమ్మలో చిన్నారులు, మహిళల ఉద్యోగులు పాటలు పాడి, ఆటలాడి అందరిని ఉత్సాహపరిచారు.

ఈ వేడుకల్లో జి ఈ సి ఈ ఓ అన్నామని, ప్రభుత్వ జూనియర్ కళాశాల ములకలపల్లి ప్రిన్సిపల్ కల్పన, విద్యాశాఖ అధికారి కార్యాలయం సిబ్బంది, మరియు కస్తూరిబా గాంధీ విద్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ బరాజ్‌కు పెరుగుతున్న వరద



సత్యమేవ జయతే - మేడిగడ్డ బరాజ్‌మేడిగడ్డ బరాజ్ : ఎగువన కురుస్తున్న వర్షాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్‌కు గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. శనివారం బరాజ్ ఇన్‌ఫ్లో 6,94,800 క్యూసెక్కులు కాగా, ఆదివారం 7,71,580 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రస్తుతం వరద ప్రవాహం సముద్రమట్టానికి 96 మీటర్ల ఎత్తులో ఉందని భారీ నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కాళేశ్వరంలో గోదావరి నది ప్రవాహం 10.4 మీటర్ల ఎత్తులో ఉందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. వరద పెరుగుతున్న నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

# సిరిసిల్ల కలెక్టర్‌గా హరిత.. సందీప్‌కుమార్ ఝా బదిలీ



సత్యమేవ జయతే - రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా ఎం హరితను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న సందీప్‌కుమార్ ఝాను రోడ్డు భవనాల శాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది. 2013 బ్యాచ్‌కు చెందిన ఆమె అనేక పదవులు నిర్వర్తించారు. విద్యాశాఖ కార్యదర్శిగా పనిచేశారు. సహకార శాఖ డైరెక్టర్, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ (ఎఫ్ఏసీ)కు 2024 జనవరిలో విధులు నిర్వర్తించారు. వరంగల్ రూరల్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.



- సందీప్‌కుమార్ ఝా బదిలీపై సంబురాలు

కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను ప్రభుత్వం బదిలీ చేయడంతో సిరిసిల్లలోని ఆయన బాధితులంతా శనివారం సంబురాలు జరుపుకొన్నారు. ఆయన బదిలీ వార్త వినగానే బాధితులంతా పటాకులు కాల్చి, ఆలయాల్లో కొబ్బరికాయలు కొట్టారు. స్వీట్లు పంచిపెట్టి సంతోషాన్ని వ్యక్తం చేశారు. రగుడు చౌరస్తాలోని కలెక్టరేట్ వద్ద పటాకులు కాలుస్తున్న బాధితులు శ్రీనివాస్, అగ్గి రాములు, అబ్బాడి అనిల్ మరికొంత మందిని పోలీసులు అడ్డుకున్నారు. పటాకులు కాల్చవద్దంటూ నిలువరించారు. దీంతో రెచ్చిపోయిన బాధితులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తమపై అక్రమ కేసులు పెట్టి హింసించాడంటూ కడుపుకాలి పోతుందంటూ మండి పడ్డారు. ఆయన వెళ్లడం మాకెంతో సంతోషంగా ఉందని అందుకే పటాకులు కాల్చి సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. కలెక్టర్ బదిలీ కావడం ప్రజలు సంబురాలు జరుపుకోవడం రాష్ట్రంలోనే చర్చనీయాంశమైంది.

# నిజామాబాద్‌లో భారీ చోరీకి పాల్పడిన ముఠా సభ్యుల అరెస్టు

**- ఇద్దరు నిందితుల అరెస్టు, పరారీలో మరో ముగ్గురు**

**- 31 తులాల బంగారు నగలు రికవరీ**

**- కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య వెల్లడి**



సత్యమేవ జయతే - నిజామాబాద్

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దోపిడీకి పాల్పడిన ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురు సభ్యులు ఓ ముఠాగా ఏర్పడి నగరంలో తిరుగుతూ కాలం వేసిన ఇంటికి కన్నం వేసి, దోచుకున్న డబ్బులతో జల్సాలు చేయడమే వృత్తిగా పెట్టుకున్నారు. ఈ ముఠాకు చెందిన ఐదుగురు సభ్యులు గత ఐదు రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐదో టాణా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ తాళం వేసిన ఇంట్లో భారీ చోరీకి పాల్పడ్డారు. కమిషనరేట్ లోని కమాండ్ కంట్రోల్ లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు.

నాగారం పరిధిలోని బ్రాహ్మణ కాలనీకి చెందిన వేలేటి పవన్ శర్మ అనే వ్యక్తి ఈనెల 23న ఇంటికి తాళం వేసి పూజలు చేసేందుకు వెళ్లాడు. ఇంటికి తాళం ముండడానికి గమనించిన ఐదుగురు సభ్యులు గల ముఠా అతని ఇంటి తాళం ధ్వంసం చేసి లాకర్ లో ఉన్న 33 తులాల బంగారు ఆభరణాలతో పాటు 25 తులాల వెండి వస్తువులు , రూ.30 వేలు నగదు దోచుకుపోయారు. ఈ ఘటన పై బాధితుడు ఐదో టాణా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. దీంతో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక టీమ్ ను ఏర్పాటు చేసి నిజామాబాద్ నార్త్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 51 ఎస్సై గంగాధర్ సిబ్బందితో కలిసి దోపిడీకి పాల్పడిన ముఠా కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులను గుర్తించి నగర శివారులోని నాగారం పరిధిలోగల డబుల్ బెడ్ రూమ్ అపార్ట్మెంట్ చౌరస్తా వద్ద ఈరోజు దోపిడీకి పాల్పడిన ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు సీపీ తెలిపారు. ఐదుగురు సభ్యులు కల ఈ ముఠాలో ధర్మపురి హిల్స్ ప్రాంతానికి చెందిన షేక్ సల్మాన్, దొడ్డి కొమరయ్య కాలనీకి చెందిన మరాఠీ ఆకాష్ రావు ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకొని వారి వద్ద నుండి 31 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేసి ఆటో రిక్షాను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఈ ముఠాకు చెందిన షేక్ సాదక్, వినోద్ రమేష్ చావ్లా, ముక్తే సాయినాథ్ అను మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు సీపీ పేర్కొన్నారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దోపిడీ ముఠా సభ్యులను పట్టుకోవడంలో కృషిచేసిన ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి తోపాటు నార్త్ సీఐ శ్రీనివాస్, ఐదో టౌన్ ఎస్సై గంగాధర్, సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ అభినందించి వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

# రూ. 7.77 కోట్ల కరెన్సీ నోట్లతో దుర్గా మహాలక్ష్మి అలంకారం

సత్యమేవ జయతే - మహబుబానగర్ మహబుబానగర్ : దసరా నవరాత్రి ఉత్సవాలు మహబూబ్‌నగర్ జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల 7వ రోజు అమ్మవారు మహాలక్ష్మి అవతారం లో భక్తులకు దర్శనమిచ్చారు. పాలమూరులోని బ్రాహ్మణ వాడి శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయ నిర్వాహకులు అమ్మవారిని రూ. 7,77,77,777.77 కరెన్సీ నోట్లతో అలంకరించారు.

జిల్లా కేంద్రంలోనో రవీంద్రనగర్‌లో ఉన్న శీతలాదేవి ఆలయం, శ్రీనివాసకాలనీలోని వాసవిమాత ఆలయం, కుర్వునిశెట్టి కాలనీలోని తోట మైసమ్మ ఆలయం, నవాబ్‌పేట మండలం పర్వతాపురం మైసమ్మ దేవాలయం, కోయిలకొండ మండలం సూరారం, మూసాపేట మండలం నందిపేటలో అమ్మవారి ఉత్సవాలు వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నిత్యం పూజా కార్యక్రమాలతో పాటు తీర్థ, ప్రసాదాలు భక్తులకు అందజేస్తున్నారు. పలు మంటపాల వద్ద చిన్నారుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



## ప్రయాణికులకు శుభవార్త.. ఎంజీబీఎస్ నుంచి ఆర్టీసీ బస్సులు ప్రారంభం

సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : బతుకమ్మ, దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు శుభవార్త. మూసీకి వరద తగ్గడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులను ఎంజీబీఎస్ నుంచి పునరుద్ధరించారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు వెళ్లాల్సిన బస్సులను అధికారులు అందుబాటులో ఉంచారు. అంతర్ రాష్ట్ర సర్వీసులు కూడా ప్రారంభమయ్యాయి. దీంతో ఆర్టీసీ ప్రయాణికులతో ఎంజీబీఎస్ కిటకిటలాడుతోంది.

శుక్రవారం రాత్రి భారీ వరద నేపథ్యంలో ఎంజీబీఎస్ నీట మునిగిన సంగతి తెలిసిందే. దీంతో అదే రోజు రాత్రి 8 గంటల నుంచి ఎంజీబీఎస్‌లో ఉన్న బస్సులను, ప్రయాణికులను అధికారులు ఖాళీ చేయించారు. ఈ క్రమంలో నిన్నటి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఆరాంఘర్, ఉప్పల్, ఎల్‌బీనగర్, జేబీఎస్, మెహిదీపట్నం వరకే జిల్లా సర్వీసులు రాకపోకలు కొనసాగించాయి.



# రైతుల పంటలను సర్వే చేయించి పరిహారం ఇవ్వటానికి కృషి : ఎమ్మెల్యే రాందాస్ నాయక్ శంకుస్థాపన



సత్యమేవ జయతే – ఖమ్మం ఖమ్మం : రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, పేదల సంక్షేమ మార్గం నడుస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇంటితో సాకారం చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లులేని పేదలను గుర్తించి వారికి విడుతల వారిగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయటమే కాక బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుందన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల పంటలను సర్వే చేయించి వారికి పరిహారం ఇవ్వటానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజాశీర్వాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియా కొరత సృష్టిస్తుందని దానిని అధిగమించటానికి రాష్ట్రం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోతుందన్నారు.

– అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన..

సింగరేణి మండలం బీటీ రోడ్ల పనులకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శంకుస్థాపన చేశారు. భాగ్యనగర్ తండా నుండి పోలంపల్లి వరకు రూ.80 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు, భజ్యాతండాగిద్దవారిగూడెం వరకు రూ.1.70 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పనులు నాణ్యత లోపాలు లేకుండా గ్రామస్తులు పర్యవేక్షించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సోసైటీ అధ్యక్షులు దుగ్గినేని శ్రీనివాసరావు, ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, బానోత్ రాంమూర్తి, బానోత్ దేవ్లానాయక్, ఇమ్మడి తిరుపతిరావు, మేదరి వీరప్రతాప్, దారావత్ భద్రునాయక్, గడ్డం వెంకటేశ్వర్లు, పెద్దబోయిన ఉమాశంకర్, ఆలోత్ ఈశ్వరీనందరాజ్, బానోత్ రూప్ల, అజ్మీర ఈర్యా, కిలారి అప్పారావు, దారావత్ హేమలత బాలాజీ, అజ్మీర హేమ్లానాయక్, హట్కర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికార సాధనకై బీసీలు నడుం బిగించాలి : బండ ప్రకాశ్ ముదిరాజ్




సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : రాజ్యాధికార సాధనకై బీసీలు నడుం బిగించాలని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, ఉద్యోగ, పదోన్నతులు వంటి విషయాల్లో బీసీలు అన్యాయానికి గురవుతున్నారని, ఇటువంటి అనేక అంశాలకు సంబంధించి బీసీ మేధావుల ఫోరమ్ ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు సమగ్ర అధ్యయనాలు, గణాంకాలు, వివరాలతో కూడిన 'హిస్సా, ఇజ్జత్, హుకుమత్,' పేరుతో రచించిన పుస్తకంలో సవివరంగా వివరించారని, ప్రతి బీసీ ఈ పుస్తకాన్ని చదవడం ద్వారా రాజ్యాధికార సాధన ఉద్యమానికి మానసికంగా మరింతగా దగ్గరయ్యే అవకాశం ఉందన్నారు.

ఆదివారం బేగంపేట్‌లోని ఐఎఎస్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బీసీ మేధావుల ఫోరమ్ ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు రచించిన ఈ పుస్తకాన్ని బీఎస్‌పి జాతీయ సమన్వయకర్త, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ జె.పూర్ణచందర్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూధనాచారి, జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్, మాజీ ఎం.పిలు వి.హనుమంతరావు, బూర నర్సయ్యగౌడ్‌లతో పాటు మేధావులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పుస్తక రచయిత టి.చిరంజీవులు మాట్లాడుతూ బీసీల ఉద్యమానికి ఒక సైద్ధాంతిక పునాది నిర్మించి, తాము కోల్పోయిన ప్రయోజనాలను తిరిగి సాధించుకునేందుకు బీసీలంతా ఎందుకు ఏకం కావాల్సిన అవసరం ఉందనే విషయమై స్పష్టత ఇచ్చే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించడం జరిగిందన్నారు.

# ఏపీలో తగ్గనున్న విద్యుత్ ఛార్జీలు

### ట్రూడౌన్ ప్రకటించిన కూటమి సర్కారు

### గత ప్రభుత్వ హయాంలో పెంచిన ఛార్జీలను తిరిగివ్వనున్న విద్యుత్ శాఖ

### నవంబర్ నెల నుంచి వచ్చే ఏడాది అక్టోబర్ వరకు మినహాయింపు చేయనున్న సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత ప్రభుత్వం మోపిన విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ట్రూఅప్ పేరుతో వైసీపీ ప్రభుత్వ హయాంలో వసూలు చేసిన సుమారు 923.55 కోట్లను ప్రస్తుతం మినహాయించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఏపీఈఆర్సీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నవంబర్ నెల నుంచి వచ్చే ఏడాది అక్టోబర్ వరకు విద్యుత్ బిల్లుల భారం తగ్గనుంది. గత ఐదేళ్లలో ట్రూఅప్ పేరుతో విద్యుత్ ఛార్జీల బాదుడే తెలిసిన వినియోగదారులకు కూటమి ప్రభుత్వం ట్రూడౌన్ (ఛార్జీల తగ్గింపు) ను పరిచయం చేస్తోందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను డిస్కంలు రూ.2,758.76 కోట్లకు ట్రూఅప్ కోసం దాఖలు చేయగా ఏపీఈఆర్సీ మాత్రం రూ.1,863.64 కోట్లకే ఆమోదం తెలిపింది.డిస్కంలు వినియోగదారుల నుంచి రూ. 2,787 కోట్లు వసూలు చేశాయి. దీంతో ఆ మొత్తం నుంచి రూ. 1,863.64 కోట్లను మినహాయించి మిగిలిన రూ. 923.55 కోట్లను వినియోగదారులకు తిరిగి చెల్లించాలని ఏపీఈఆర్సీ ఆదేశించింది. దీంతో ఈ మొత్తాన్ని ట్రూడౌన్ ఛార్జీల రూపంలో నవంబర్ నుంచి వచ్చే ఏడాది అనగా 2026 అక్టోబర్ వచ్చే విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు చేస్తారు. దీని వల్ల యూనిట్‌కు 13 పైసలు చొప్పున వినియోగదారులకు లబ్ధి చేకూరనుంది.ట్రూఅప్ అంటే ఛార్జీల పెంపు అయితే.. ట్రూడౌన్ అంటే ఛార్జీల తగ్గింపు. వినియోగదారుల నుంచి ట్రూఅప్ పేరుతో వసూలు చేసిన మొత్తం కన్నా తక్కువ ఖర్చు అయితే.. డిస్కంల దగ్గర నుంచి ఆ మిగిలిన మొత్తాన్ని వసూలు చేసి వినియోగదారులకు సర్దుబాటు చేయడాన్నే ట్రూడౌన్ అంటారు.

# ఆడబిడ్డలకు ఆదర్శంగా.. జనగామ డిప్యూటీ కలెక్టర్‌గా కంకోల్ తేజస్వి

సత్యమేవ జయతే – మునిపల్లి

మునిపల్లి : నిజ జీవితంలో కొంతమంది ఎవరికి నచ్చిన రంగంలో వారికి నచ్చే విధంగా వారికి ఇష్టం వచ్చిన రంగాల్లో ముందుకు దూసుకుపోతుంటారు. మరి కొంతమంది ఇష్టం ఉన్నా లేకున్నా తల్లిదండ్రుల నిర్ణయాలను గౌరవిస్తూ తల్లిదండ్రులకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగిపోతుంటారు. మరి కొంతమంది అది కావాలి.. ఇది కావాలి అంటూ కలలు కంటుంటారు. కొంతమంది మాత్రమే కంటున్న కలలను నిజం చేసుకోవాలన్న దృఢ సంకల్పంతో కన్న కలలను జీవితంలో నెరవేర్చేందుకు వారు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తారు. కంటున్న కలలను నిజం చేసుకునేందుకు కొంత మంది మాత్రమే అనుకున్న లక్ష్యం వైపు ముందుకు సాగుతూ కలలు నిజం చేసి తోటి ఆడబిడ్డలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

మునిపల్లి మండలంలోని కంకల్ గ్రామానికి చెందిన మడపతి ప్రసన్న-సంగమేశ్ దంపతుల ఏకైక కూతురు తేజస్వి. తల్లిదండ్రులు తేజస్విని ఏం చదువుతా అంటే అది.. కూతురికి నచ్చిన విద్యను చదివించారు. ఈ రోజు తల్లిదండ్రుల ధైర్యం%ొ%భర్త ఆశీస్సులు.. అత్తమామల అండదండలతో తేజస్వి జనగాం డిప్యూటీ కలెక్టర్‌గా నియామకమైంది. కంకోల్ గ్రామానికి చెందిన ఓ మిడిల్ క్లాస్ కుటుంబం నుంచి ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత శిఖరాల్లోకి వెళ్లడం మునిపల్లి మండలానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ఆడబిడ్డపై మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన విద్యార్థి ఉన్నత చదువులు చదువుకొని డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక అవడం పట్ల గ్రామస్తులతో పాటు మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తేజస్విని ఆదర్శంగా తీసుకోవాలంటూ అభినందనలు తెలుపుతున్నారు.

– ముందు నుంచే పట్టుదల..

మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన తేజస్వినికి విద్యా రంగంలో ముందు నుంచే పట్టుదల ఎక్కువ%ొ% విద్యారంగంలో అనుకుంటే సాధించేవరకు వదిలిపెట్టదు. 2020లోనే జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికై నేటి వరకు ప్రభుత్వ ఉద్యోగ విధులు నిర్వహిస్తూనే ఉన్నత చదువులు చదువుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు పోటి పరీక్షలకు సిద్ధమయ్యారు. అనుకున్న లక్ష్యం వైపు పరుగులు తీశారు%ొ%ఆడబిడ్డలు అనుకుంటే ఏదైనా సాధిస్తారు అని గర్వంగా చెప్పుకునేందుకు తేజస్వి తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచారు.

– డిప్యూటీ కలెక్టర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : మునిపల్లి మాజీ ఎంపీపీ శైలేజ

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆడబిడ్డ జనగాం డిస్ట్రిక్ట్ డిప్యూటీ కలెక్టర్గా ఎంపిక కావడం చాలా సంతోషం. మండలంలోని విద్యార్థినులు మారుమూల గ్రామం కంకోల్ లో పుట్టి ఉన్నత చదువులు చదువుకొని డిప్యూటీ కలెక్టర్గా ఎంపికైన తేజస్విని మండలంలోని విద్యార్థినిలు ఆదర్శంగా తీసుకొని మరింత ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత శిఖరాలకు



చేరుకోవాలి.గ్రామాల్లో తల్లిదండ్రులు ఆడబిడ్డ పుట్టగానే అరిష్టం అనుకుంటారు..ఆ ఆడబిడ్డ ఆ ఇంటి అదృష్టంగా భావించి పుట్టిన ప్రతి ఆడబిడ్డను చదివించి వారి జీవితాల్లో వెలుగులు తల్లిదండ్రులే నింపాలి. మండలంలోని ప్రజలు మీ ఇంట్లో ఉండే ఆడబిడ్డలను తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలి. అప్పుడు ఆడబిడ్డలకు సమాజంలో తగిన గుర్తింపు దక్కుతుంది.

– వెలకట్టలేని ఆనందం : డిప్యూటీ కలెక్టర్ తేజస్వి తండ్రి సంగమేశ్

మా ఇంటి బిడ్డ ఉన్నత చదువులు చదువుకొని ప్రజలకు సేవ చేసేంత గొప్ప స్థాయికి చేరుకోవడం చాలా ఆనందంగా ఉంది. మా కూతురు చదువుతా అన్నది మేము చదివించాం. గత నాలుగు సంవత్సరాల క్రితం మా బిడ్డకు వివాహం చేసాం.. అప్పటినుంచి మాతోపాటు మా అల్లుడు సైతం మా కూతురు చదువుకు సహకరించారు. మా కూతురు ఎల్లప్పుడూ చదువు చదువు అంటు చదువుని ఇష్టంగా చదివేది.. మూడోసారి ప్రయత్నంలోనే డిప్యూటీ కలెక్టర్గా ఎంపికైంది అందుకు చాలా సంతోషం.పండుగలు%ొ% దావత్ లు అంటూ చూడకుండా ఎప్పుడు పుస్తకాలు ముందే కూర్చునేది..ఆరోజు ఇష్టంగా చదివి నేడు డిప్యూటీ కలెక్టర్ ఎంపిక కావడం సంతోషం. పిల్లలు ఏం చదువుతా అంటే అది తల్లిదండ్రులు చదివించాలి.వారికి నచ్చిన చదువు చదివితేనే వారు అనుకున్న లక్ష్యం చేరుకుంటారు.

– కుటుంబ సభ్యుల సహకారంతోనే డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన : తేజస్వి

కుటుంబ సభ్యుల సహకారంతోనే నేను అనుకున్న లక్ష్యం సాధించాను. నేను పెట్టుకున్న లక్ష్యం సాధిస్తానో లేదో అనుకున్న రోజుల్లోనే మా కుటుంబ సభ్యులు నువ్వు అనుకున్న దానికంటే ఎక్కువ సాధిస్తావు బిడ్డ నీకు నచ్చింది చదువుకోని నీ వెనకాల మేమున్నామంటూ కుటుంబ సభ్యులు అండగా నిలబడ్డారు.

కుటుంబ సభ్యుల ధైర్యంతోనే నేను అనుకున్న లక్ష్యం చేరుకున్నాను.. నేను డ్యూటీ కలెక్టర్‌ను అవుతానో లేదో నాకు తెలవదు కానీ నా కుటుంబ సభ్యులు నాపై పెట్టుకున్న నమ్మకమే నన్ను ఈ రోజు ఈ స్థాయికి చేర్చింది. మా అమ్మ నాన్న నన్ను చదివించేందుకు చాలా కష్టపడ్డారు.

మా అమ్మానాన్నలు కన్న కలలను నేను నెరవేర్చాలన్న పట్టుదలతో ముందుకు సాగుతూ అనుకున్న లక్ష్యం చేరుకున్నాను.. 2017లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం, 2020లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహించాను. నా కూతురు పుట్టిన 15 రోజుల్లోనే పోటీ పరీక్ష ఉండడంతో పరీక్షకు హాజరయ్యాను. నేను అనుకున్న లక్ష్యం చేరుకోవడంలో నా భర్త, అమ్మానాన్న అత్త మామల సహకారం చాలా గొప్పది. రెండు మూడు రోజుల్లో జనగాం జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకుంటాను. పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి సమస్యలపై దృష్టి పెట్టి నిరుపేదల సమస్యల పరిష్కారంలో ముందుంటా.

– ప్రతీ ఆడబిడ్డ చదువుకోవాలి : ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

అనుకున్న లక్ష్యం చేరుకోవడంలో ఆడబిడ్డలు ముందుంటారు.. ఇంట్లో ఉండే ఆడబిడ్డను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలి. ఆందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండలం కంకోల్ గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబంలో పుట్టి నేడు డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక కావడం చాలా సంతోషం. ఆడబిడ్డ కోరుకున్న చదువును చదువుకునేందుకు తల్లిదండ్రులు సహకరించాలి. తెలంగాణ రాష్ట్రంలోనే మునిపల్లి మండలం కంకోల్ గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన తేజస్విని మండలంలోని ఆడబిడ్డలు అందరూ ఆదర్శంగా తీసుకోవాలి.

# 3 దశల్లో పంచాయతీ ఎన్నికలు!

### 2 దశల్లో ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు2 దశల్లో ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు

### సత్యమేవ జయతే- తెలంగాణ

### నిర్వహణ వ్యయం రూ.350 కోట్లు

రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ %రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 దశల్లో.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను 2 దశల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎన్నికల నిర్వహణకు రూ. 350 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించగా ఇందులో రూ.3.08 కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయి. రాష్ట్రంలో 1,67,03,168 మంది గ్రామీణ ఓటర్లు ఎన్నికల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది.

ముఖ్యాంశాలు ఇలా.

రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీలు, 1,12,534 వార్డులు, 5,763 ఎంపీటీసీలు, 565 జడ్పీటీసీలకు ప్రత్యక్షంగా, 565 మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు), 31 జడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాలకు పరోక్షంగా ఎన్నికలు జరుగుతాయి. మొత్తం పంచాయతీల్లో వందశాతం ఎస్టీ లున్న పంచాయతీలు 1,248, షెడ్యూల్డ్ ప్రాంతాల్లోనివి 1,289, ఇతర ప్రాంతాల్లోనివి 10,223.




రాష్ట్రంలో 11 గుర్తింపు పొందిన పార్టీలు, 31 నమోదు పార్టీలు తమ గుర్తులపై జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పాల్గొంటాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతాయి.

మహిళా ఓటర్లే ఎక్కువ

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని మొత్తం 1,67,03,168 మంది ఓటర్లలో 85,36,770 మంది మహిళలు, 81,65,894 మంది పురుషులు.. 504 మంది ఇతరులు.

సమస్యాత్మక కేంద్రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం మొత్తం 31,377 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఇందులో 8,123 సమస్యాత్మక, 8,113 అతి సున్నిత, 515 అత్యంత సున్నితమైనవి. 1,12,720 పంచాయతీ పోలింగ్ కేంద్రాల్లో 19,774 సమస్యాత్మకం, 21,093 అతి సున్నిత, 2,324 అత్యంత సున్నితమైనవి.

బ్యాలెట్ బాక్సులు

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు 37,652, పంచాయతీ ఎన్నికలకు 1,35,264 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా 1,18,547 సిద్ధం చేశారు.

ఎన్నికల సిబ్బంది

జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు 651 మంది, ఎంపీటీసీ ఎన్నికలకు 2,337 మంది ఆర్వోలు, 2,340 మంది ఏఆర్‌వోలు, 39,533 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,58,725 మంది ఇతర సిబ్బంది పాల్గొంటారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 4,956 మంది ఆర్వో మొదటి దశ, 14,407 మంది ఆర్వో రెండో దశ, 79,798 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,03,318 మంది ఇతర సిబ్బంది పాల్గొంటారు.

ఎన్నికల దశలు ఇలా..

పంచాయతీ ఎన్నికలు మొదటి దశలో 41 మండలాల్లోని 1,098 చోట్ల జరుగుతాయి. ఇక్కడ 9,324 వార్డులున్నాయి. రెండో దశలో 272 మండలాల్లోని 5,910 గ్రామాల్లో నిర్వహిస్తారు. 52,190 వార్డులున్నాయి. మూడో దశలో 252 మండలాల్లోని 5,752 గ్రామాల్లో చేపడతారు. ఇక్కడ 51,020 వార్డులున్నాయి.

మొదటి దశలో 290 జడ్పీటీసీలు, 2,977 ఎంపీటీసీలు, రెండో దశలో 275 జడ్పీటీసీలు, 2,786 ఎంపీటీసీల్లో

# కాంగ్రెస్, బీజేపీ నేతల ఫొటోలు పోలీసు స్టేషన్లలో పెట్టాలి : ఆర్ఎస్ ప్రవీణ్

సత్యమేవ జయతే – అచ్చంపేట

అచ్చంపేట : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. ఈ రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ నేతల ఫొటోలను పోలీసు స్టేషన్లలో పెట్టాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన జన గర్జన సభలో ఆర్ఎస్పీ పాల్గొని ప్రసంగించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో ఉన్న బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా అచ్చంపేటలో బీజేపీకి, కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఎన్నో కష్టాలు పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాల మీద సోషల్ మీడియాలో పోస్టులు పెడితే రేవంత్ రెడ్డి కేసులు పెట్టి, రౌడీషీట్లు ఓపెన్ చేయిస్తున్నాడు.. జైల్లో పడేస్తాడట. పోలీసు స్టేషన్లలో, రౌడీషీట్లలో ఉండాల్సిన వ్యక్తి రేవంత్ రెడ్డి. ప్రజల పక్షా పోరాడుతున్నా మనం కాదు.. నిలువునా దోచుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ నేతల బొమ్మలు పోలీసు స్టేషన్లలో ఉండాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



పేర్కొన్నారు.ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీల మీద ఘోరాలకు పాల్పడుతున్నారు. దళితులపై అత్యాచారాలు జరిగేది యూపీలోనే అది తెలిసీ బీజేపీలోకి వెళ్లారా..? అని గువ్వల బాలరాజును నిలదీశారు ఆర్ఎస్పీ. మధ్యప్రదేశ్‌లో దళితులపై మూత్రం పోసి అవమానించారు ఈ బీజేపీ నేతలు. రోహిత్ వేములను చంపింది కూడా బీజేపీనే. ఈ కాంగ్రెస్, బీజేపీ రెండు కలిసి మళ్లీ తెలంగాణను దోచుకుని మన భవిష్యత్‌ను నాశనం చేసేందుకు వచ్చాయి. పాలమూరు ఎత్తిపోతల పనులను కేసీఆర్ 90 శాతం పూర్తి చేస్తే, మిగిలిన 10 శాతం పనులను నిధులు ఇవ్వకుండా రేవంత్ రెడ్డి అడ్డగించారు. మరి ఎవరు నిజమైన పాలమూరు బిడ్డ.. రేవంతా..? కేసీఆరా..? చేతులు జోడించి కోరుతున్నా రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీలను చిత్తుచిత్తుగా ఓడించి మళ్లీ బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలి. బరాబర్ ఈ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలి అని అచ్చంపేట ప్రజలకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.

సత్యమేవ జయతే



# వాన నీరు ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..

## జుట్టు, చర్మకాంతితో పాటు బీపీకి చెక్ పెట్టొచ్చు ఇలా..



ఇది క్లోరోఫిల్‌లోని ముఖ్యమైన మూలకం, కిరణజన్య సంయోగక్రియ ప్రక్రియకు అవసరమైన మూలకం. అలాగే, వర్షాకాలంలో పిడుగులు పడినప్పుడు, వాతావరణంలోని నైట్రోజన్ హైడ్రోజన్‌తో కలిసిపోవడానికి సహాయపడుతుంది. ఇది భూమి మట్టిలో వర్షం ద్వారా తీసుకువెళ్ళే మొక్కలకు క్లిష్టమైన ఎరువులు అందిస్తుంది.వర్షపు నీరు తాగడానికి సురక్షితమేనా..? అన్న ప్రశ్నకు సమాధానం అవుననే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. వర్షపు నీటిని తాగడం ఆరోగ్యానికి చాలా మంచిదని చెబుతున్నారు. చాలా అంటే చాలా మంచిది. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ఇప్పటికీ వర్షపు నీటిని నేరుగా సేకరించి ఏడాది పొడవునా ఉపయోగిస్తున్నారు. ఇది వారి ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. అయితే, వర్షపు నీటిని సేకరించడానికి సరైన సమయాన్ని ఎంచుకోవడం చాలా అవసరం. అయితే వర్షాకాలం ప్రారంభమైన కొన్ని రోజుల తర్వాత పడే వాననీటిని సేకరించాలి. ఎందుకంటే ఆ వర్షపు నీరు తాగడానికి అనువైనదిగా పరిగణిస్తారు. అయితే ఇందుకు సేకరణ కోసం రాగి పాత్రలను ఉపయోగించడం చాలా మంచిది. ఎందుకంటే రాగికి నీటి నాణ్యతను పెంచే లక్షణం ఉంటుంది.వర్షపు నీరు పంపు నీటి కంటే, చవకైన, మెరుగైన ప్రత్యామ్నాయం. ఇందులో ఉన్న అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. వర్షపు నీటిని తాగడం వల్ల దాని ఆల్కలీన్ %జూ౧% కారణంగా జీర్ణక్రియ మెరుగుపడుతుందని చెబుతారు. అలాగే రక్తపోటు సమస్య కూడా అదుపులోకి వస్తుందని చెబుతున్నారు. వర్షపు నీరు ఆరోగ్యకరమైన చర్మం, జుట్టుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. వర్షపు నీటిలో ఆల్కలీన్ %జూ౧% చర్మం, సహజ స్థితిస్థాపకత, తేమను నిర్వహించడానికి సహాయపడుతుంది. వర్షపు నీటితో జుట్టును కడగడం వల్ల జుట్టు బలపడుతుంది. జుట్టు పెరుగుదలను కూడా ప్రోత్సహిస్తుంది. వర్షపు నీటిని చర్మంపై రాసుకుంటే మొటిమలు, మచ్చలు పోతాయి.వర్షపు నీరు శరీరాన్ని పునరుజ్జీవింపజేస్తుంది. ఇది కంఫర్ట్‌ను అందిస్తుంది. అలాగే అలసట నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాదు.. వర్షపు నీటిలో నత్రజని, అధిక సాంద్రత ఉంటుంది. ఇది క్లోరోఫిల్‌లోని ముఖ్యమైన మూలకం, కిరణజన్య సంయోగక్రియ ప్రక్రియకు అవసరమైన మూలకం. అలాగే, వర్షాకాలంలో పిడుగులు పడినప్పుడు, వాతావరణంలోని నైట్రోజన్ హైడ్రోజన్‌తో కలిసిపోవడానికి సహాయపడుతుంది. ఇది భూమి మట్టిలో వర్షం ద్వారా తీసుకువెళ్ళే మొక్కలకు క్లిష్టమైన ఎరువులు అందిస్తుంది.

# మహిళలకు జింక్ ఎందుకు ముఖ్యం

## అది లేకపోవడం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయి?




స్త్రీ శరీరం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. ఇది యుక్తవయస్సు నుండి గర్భం, తల్లిపాలు, రుతువిరతి వరకు అనేక మార్పులకు లోనవుతుంది. శరీరానికి ఐరన్, కాల్షియం ఎంత అవసరమో, జింక్ ఉనికి కూడా అంతే ముఖ్యం. మన శరీరంలో పోషకాలు ఉండటం మంచి ఆరోగ్యానికి చాలా ముఖ్యం. జింక్ మన ఆరోగ్యానికి అవసరమైన ఖనిజాలలో ఒకటి. దాని లోపం అనేక సమస్యలను కలిగిస్తుంది.

**జింక్ చర్మ ఆరోగ్యానికి మంచిది:**

జింక్ యాంటీ బాక్టీరియల్ సామర్థ్యాల వల్ల మొటిమలు, తామర, ఇతర చర్మ సమస్యలను నివారించవచ్చు.

ఇది ఆరోగ్యకరమైన చర్మాన్ని కలిగి ఉండటానికి, వృద్ధాప్య సంకేతాలను తగ్గించడానికి, కొల్లాజెన్ ఏర్పడటానికి ప్రేరేపిస్తుంది.స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థ అభివృద్ధి, పనితీరు జింక్‌పై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఇది ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్, టెస్టోస్టెరాన్ శరీరం సంశ్లేషణకు కూడా బాధ్యత వహిస్తుంది. లైంగిక అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన హార్మోన్లు, సంతానోత్పత్తికి జింక్ చాలా అవసరం.

**జింక్ మెదడు ఆరోగ్యానికి సహాయపడుతుంది:**

మెదడు అభివృద్ధికి, పనితీరుకు జింక్ చాలా అవసరం. ఇది న్యూరోట్రాన్స్మిటర్ల ఉత్పత్తిలో పాల్గొంటుంది, ఇవి మానసిక స్థితిని నియంత్రించడానికి, నరాల ప్రేరణల ప్రసారానికి చాలా ముఖ్య పాత్ర పోషిస్తుంది.

**గుండె ,ఎముకల ఆరోగ్యాని మంచిది:**

జింక్ వల్ల గుండె ఆరోగ్యం ప్రభావితమవుతుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. బలమైన రక్త నాళాలను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన ఎముకలను రూపొందించడానికి జింక్ కీలకమైన ఖనిజం. ఇది ఎముక పగుళ్ళు,బోలు ఎముకల వ్యాధి వంటి వ్యాధులను నివారిస్తుంది.

**గాయం నయం చేయడానికి:**

శరీరంలో జింక్ లోపిస్తే గాయాలు త్వరగా మానవు. జింక్ కొల్లాజెన్ సంశ్లేషణలో సహాయపడుతుంది, ఇది గాయం నయం చేయడానికి అవసరమైన ప్రోటీన్‌గా పరిగణించబడుతుంది. జింక్ దెబ్బతిన్న చర్మాన్ని రిపేర్ చేస్తుంది. ఇది రుచి, వాసన సామర్థ్యాన్ని పదునుపెడుతుంది.

**థైరాయిడ్ పనితీరును మెరుగుపరుస్తుంది:**

జింక్ థైరాయిడ్ హార్మోన్లు శరీరం జీవక్రియ, మానసిక స్థితి, శక్తి స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

# ఈ ట్యాబ్లెట్‌తో సగానికి

## తగ్గనున్న క్యాన్సర్ మరణాల ముప్పు



న్యూయార్క్ : లంగ్ క్యాన్సర్ నుంచి మరణాల ముప్పును 50 శాతం తగ్గిస్తూ వినూత్న ఆవిష్కరణగా ముందుకొచ్చిన నూతన ట్యాబ్లెట్ (%ఔశీఅ౧వతీ ౯ాఐశ్రీశ్రీ%) ఆశలు రేకెత్తిస్తోంది. పదేండ్ల పాటు ప్రపంచవ్యాప్తంగా చేపట్టిన క్లినికల్ ట్రయల్స్‌లో సానుకూల ఫలితాలు రావడంతో ఈ వండర్ పిల్ క్యాన్సర్ రోగుల్లో ఆశాకిరణంలా మారింది. చికాగోలో జరిగిన అమెరికన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ ఆంకాలజీ వార్షిక సమావేశంలో వెల్లడించిన సర్వే ఫలితాల్లో ఈ విషయం వెలుగుచూసింది.

టాగ్రిసోగా మార్కెట్ కానున్న ఓసిమెర్టినిబ్ అనే డ్రగ్ లంగ్ క్యాన్సర్ రోగుల్లో ప్రభావవంతంగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. కాగా, ఈ మందును ఆస్ట్రాజెనెకా అభివృద్ధి చేసింది. క్యాన్సర్ మరణాల్లో అత్యధికంగా లంగ్ క్యాన్సర్ మరణాలు నమోదవుతుండగా ఏటా 18 లక్షల మంది లంగ్ క్యాన్సర్‌తో మృత్యువాతన పడుతున్నారు.

ఈ రోగులకు ఉపశమనంగా 30 ఏండ్ల కిందట మన ఏం చేయలేకపోయేవారమని అధ్యయన రచయిత, యేల్ క్యాన్సర్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాయ్ హెర్బస్ట్ పేర్కొన్నారు. లంగ్ క్యాన్సర్ చికిత్సలో ఇప్పుడు ఈ ఔషధం ముందుకొచ్చిందని, థెరపీలకు లొంగని లంగ్ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల్లో యాభై శాతం మరణాలను తగ్గించే అద్భుతమైన ఔషధం ఇదని చెప్పారు. ఈ మందును 26 దేశాల్లోని రోగులపై పరీక్షించామని తెలిపారు.



# పార్కిన్సన్ వ్యాధి నియంత్రణకు

## మహిళ మెదడులో పేస్‌మేకర్

న్యూఢిల్లీ : పార్కిన్సన్స్ వ్యాధి నియంత్రణకు ఢిల్లీ వైద్యులు మెదడు లోపల పేస్‌మేకర్‌ను అమర్చి ఓ మహిళకు నూతన జీవితం ప్రసాదించారు. గత తొమ్మిదేండ్లుగా పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్న సావిత్రి దేవి (51) అనే మహిళకు నరాల డిజార్డర్‌ను సరిచేసేందుకు ఢిల్లీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు ఆమె మెదడులో పేస్‌మేకర్‌ను అమర్చారు. దేవికి తరచూ వణుకు రావడం, కదలికల్లో ఇబ్బందులు, రిజిడిటీ వంటి లక్షణాలు బయటపడగా క్రమంగా అవి మరింత పెరగడంతో ఆమె నడిచేందుకు, కనీసం బెడ్‌పై నుంచి లేచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆమె కాళ్లు, చేతులు కూడా నియంత్రణ కోల్పోయి కదులుతుండేవి. ఆపై మందుల నుంచి కూడా ఆమెకు సైడ్ ఎఫెక్ట్స్ రావడం మొదలైంది. ఆమె పరిస్థితిని పరిశీలించిన సర్ గంగారాం ఆస్పత్రి వైద్యులు డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్‌గా పిలిచే మెదడులో పేస్‌మేకర్ అమర్చే ప్రక్రియను సూచించారు.

మెదడులో నిర్దిష్ట భాగాలను ప్రేరేపించే నూతన సర్జరీగా డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్‌ను వ్యవహరిస్తారు.

వ్యాధిని నియంత్రించి రోగి జీవనశైలిని మెరుగుపరిచేందుకే ఈ సర్జరీ ఉద్దేశమని న్యూరోసర్జరీ విభాగం అసోసియేట్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రేయ్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు.

# ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ ఎందుకొస్తుంది?

## ఇది అంత ప్రమాదమా?

గర్భధారణ అనే ప్రక్రియ.. అండంతో శుక్రకణం కలిశాక, అది పిండంగా ఏర్పడ్డ సమయం నుంచి మొదలవుతుంది. అండంతో శుక్రకణం కలవడాన్ని 'ఫలదీకరణ' అంటారు. ఫలదీకరణ జరిగాక ఏర్పడ్డ పిండం గర్భసంచిలో పెరగాలి. కానీ, కొన్ని సందర్భాల్లో గర్భసంచిలో కాకుండా.. దాని పరిసరాల్లో పిండం పెరగడాన్ని 'ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ' అంటారు. అండాశయం (ఓవరీస్) నుంచి అండాన్ని గర్భసంచిలోకి వచ్చేలా తోడ్పడే ట్యూబ్స్‌ను 'ఫెలోపియన్ ట్యూబ్స్' అంటారు. కొన్ని సందర్భాల్లో పిండం గర్భసంచిలో బదులు ఈ ఫెలోపియన్ ట్యూబుల్లో పెరగడంతోపాటు ఒక్కోసారి అండాశయాల్లో (ఓవరీస్), కాస్తంత కిందికి వస్తే గర్భాశయ ముఖద్వారంలో.. ఒక్కోసారి కడుపులో కూడా పెరగవచ్చు. ఈ సమస్యనే 'ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ'గా వ్యవహరిస్తారు.



ఇలాంటి సందర్భాల్లో సాధారణ గర్భధారణలోలా పిండం ఏర్పడటం, ఆ తర్వాత అది శిశువుగా రూపొందే ప్రక్రియ జరగదు. ఫలితంగా ఆ పిండంలో మనుగడ కొరవడుతుంది. అంతేకాదు.. ఒక్కోసారి అరుదుగా తల్లిలో రక్తస్రావానికి కారణమై, ఆమెకు కూడా ముప్పు తెచ్చిపెడుతుంది.

**లక్షణాలు :**

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో మొదట్లో ఎలాంటి లక్షణాలూ కనిపించవు. అయితే కొంతమందిలో గర్భధారణలో కనిపించినట్టే పీరియడ్స్ ఆగిపోవడం, వికారం, వాంతులు కనిపిస్తాయి. అంతేకాదు.. మామూలుగా తమకు తాముగా చేసుకునే ప్రెగ్నెన్సీ పరీక్షల్లోనూ ఫలితాలు 'పాజిటివ్' అని వస్తాయి.

అయితే, మామూలుగా పిండం ఎదుగుదల గర్భసంచిలో మాత్రమే ఉంటుంది. కానీ, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో పిండం ఎక్కడో గర్భసంచి బయట ఏర్పడుతుంది. కాబట్టి, పిండం ఎదుగుదల నార్మల్‌గా ఉండదు.

ఎప్పుడు అనుమానించాలి? డాక్టర్‌ను ఎప్పుడు సంప్రదించాలి అంటే?

- ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీగా అనుమానించడానికి తోడ్పడే కొన్ని లక్షణాలు ఇలా వ్యక్తమవుతాయి.
- తొలిదశల్లో యోని నుంచి రక్తస్రావం కావడం, పొత్తికడుపులో నొప్పి రావడం ద్వారా ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీగా అనుమానించాలి.
- తల తేలికైపోయిన ఫీలింగ్‌తోపాటు స్పృహ తప్పవచ్చు.
- భుజం నొప్పి కూడా కనిపించవచ్చు.
- ఈ లక్షణాలు కనిపిస్తే తక్షణం డాక్టర్‌ను కలవాలి.

**ఎవరెవరిలో ముప్పు ఉంటుందంటే?**

- మొదట ఒకసారి ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ వచ్చి ఉన్నవాళ్లలో మరోసారి కూడా వచ్చే అవకాశముంది.
- జీవిత భాగస్వామి నుంచి గనేరియా, క్లమీడియా వంటి కొన్ని లైంగిక సంబంధిత ఇన్ఫెక్షన్లు సోకిన మహిళల్లో ఈ ముప్పు కనిపించవచ్చు.
- సంతాన సాఫల్యత కోసం చికిత్సలు తీసుకుంటున్నవారిలో.
- ఫెలోపియన్ ట్యూబుల్లో లోపాలుండి, వాటిని సరిదిద్దేందుకు శస్త్రచికిత్స తీసుకున్నవారిలో.
- పొగతాగే అలవాటు ఉన్న మహిళల్లో ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీకి అవకాశాలు ఎక్కువ.

**ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ కాంప్లికేషన్లు**

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ చాలావరకు ఫెలోపియన్ ట్యూబుల్లో పెరుగుతుంది. ఆ పెరుగుదలకు తగినట్లుగా సాగలేక ట్యూబులు గాయపడవచ్చు. ఫలితంగా గాయపడ్డ ట్యూబుల్లోంచి తీవ్రమైన రక్తస్రావం అవుతుంది. ఇలా ఆగకుండా అయ్యే రక్తస్రావంతో ఒక్కోసారి తల్లి ప్రాణానికే ముప్పు రావచ్చు.

**నివారణ**

- పొగతాగే అలవాటుకు పూర్తిగా దూరంగా ఉండటం. ఇది ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ నివారణకే కాదు.. అనేక ఇతర అనారోగ్యాలనూ నివారిస్తుంది.
- లైంగిక సంబంధాల వల్ల సంక్రమించే వ్యాధులను నిర్ధారించడం
- ముందస్తుగా చేసే నిర్ధారణ మరియు చికిత్స ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో చాలా ముఖ్యం.

# సంపూర్ణం...!



దాహాలు అసంపూర్ణంగానే
ఆరంభమౌతాయి.
ఆలోచనల సంఘర్షణలోంచి
ఒకదారి తళుక్కున మెరుస్తుంది.
ఒక లక్ష్యం
నిద్రలేని క్షణాల్ని వేలాడదీస్తుంది.
జీవితం
ఒక్కో పాదముద్రను చెక్కుతూ
నిరాడంబరంగా
విజయానికో చిరునవ్వు
విసురుకుంటూ ముందుకు పోతుంది.
ప్రతి క్షణమూ తిరిగిరానిదే.

ఇక్కడ ఛేదించాల్సినవి
చేయాల్సినవి కొన్ని వుంటాయి.
అలా అలా సంతోషాల్ని
లిఖిస్తూ కాస్త ముందుకు జరగాలి.
అసంపూర్ణం నుంచి
సంపూర్ణానికి
ఒక్కో అడుగు తొడుగుతూ
ఒక్కో మైలురాయిలో చిహ్నాల్ని
కొన్ని తీపి గురుతులుగా నిలిపి
సంపూర్ణ ప్రయాణంగా
ప్రయత్నాల్ని మలచుకోవడం లోనే వుంది
జీవితపు గెలుపు రహస్యం.

# మట్టి చిగుళ్ళ స్వప్నం



మట్టి పిసికిన చేతులు నేర్పాయి అమ్మపాటను
కల్లోలాన్ని సృష్టించమనలే కార్చిచ్చులు
రేపమనలే కఠిన పాషాణ హృదయాలను
ద్రవీభవనం చేశాయే
మట్టి చిగుళ్ళ స్వప్నం
మట్టి పిసికిన చేతులు
నేర్పాయి అమ్మపాటను
కల్లోలాన్ని సృష్టించమనలే
కార్చిచ్చులు రేపమనలే
కఠిన పాషాణ హృదయాలను
ద్రవీభవనం చేశాయే తప్ప
ఏ యుద్ధానికో
ఏ ప్రమాద ప్రయోగాలకో
వంతెనలు వెయ్యమనలే%ూ
%ఒకానొక ఇసుక గూళ్ళ
స్వప్నాల వాసనలను
గవ్వల్లో ఆల్చిప్పల్లో
భద్రంగా దాచిన తీరాల వెంట
ఎప్పుడూ స్వచ్ఛమైన
ప్రభాత వదనాలతో ఆకాశంకేసి
ఆడుకోమన్నాయి, పాడుకోమన్నాయి
దేహాలకు ఇంద్రధనుస్సు రంగులే
అంటాలె తప్ప రక్తం మరకలు కాదు
బుద్ధి జీవనదిలో తేటగా
తేలియాడుతూ మురికిని
పోగొట్టుకుంటూ పారాలె
మనస్సు విభిన్న పూల
పరిమళాల మధ్య
కర్మ మందిరానికి అంకితమవ్వాలె
గతి తర్కం భౌతికం మనల్ని
మెలకువలో ఈదేట్టు చూడాలె%ూ
%వికారాలు చుట్టుముడితే
ఆ మట్టిచేతులనే తలుచుకోవాలె
అవి నేర్పిన నిర్మితుల నమూనా
మానవత్వపు వెలుగు కిరణాల అల్లిక
మనమంతా బతుకు నేత కార్మికులం
పేర్చుదాం నిఖార్సయిన మట్టిపెల్లల్ని
ప్రేమతత్వపు కొలిమిలో కాల్చబడ్డవి అవి
కడదాం ఆ చేతులకు చిగుర్లను
అవి పాకుతూ ఆ పాటల్ని పాడుతుంటాయి!

# బాధిత బహుజన మహిళల బతుకు కథలు




ఎండుటాకుల మధ్య నుంచి పాకుతూ, నాగుపాము దూరమౌతున్న దృశ్యాన్ని ఎప్పుడైనా చూశారా? అప్పుడు పొందిన అనుభూతే ఈ కత్తి పద్మ కథలు 'చీకటి పువ్వు' చదివితే పొందుతాం. అవే గలగలలు, అదే ఆశ్చర్యం, ఒకొక్క కథా పూర్తయినంత వరకూ, నాగు కనుచూపు దాటినంతవరకూ నిశ్చేష్టంగా అదే దృష్టి. ఈ కథల్లో అబలలందరూ బహుజనులే ! బహుజన మహిళలే ఈ సమాజంలో అసలైన శ్రామికులు. ఆహారాన్ని, అభివృద్ధిని వారే ఈ సమాజానికి హెచ్చుగా అందిస్తున్నారు. కళింగాంధ్రలో వైదికం ఎంత ప్రవేశించినా నేటికీ 95 శాతం బహుజనులే ఉంటారు. తూర్పు కాపులు, గొల్లలు, వెలమలు, కాళింగులూ, దళితులు, మత్స్యకారులూ, గిరిజనులూ ఇలా! ఒక కోమటి ఒక కాపు స్త్రీని, ఒక ఆచారి ఒక బ్రాహ్మణ మహిళ జీవితాన్ని నాశనం చేయడం తప్ప అగ్రవర్ణాలనుకొన్నవారు ఈ కథల్లో కనిపించరు. 'గురజాడ, కందుకూరి, శ్రీపాద బ్రాహ్మణ కులంలోని బాధలే రాశారు' అన్న వాక్యానికి అపవాదు ఈ కథలు. కాలం మారింది కదా ! తిరుగుబోతు మొగుళ్ళతో బాధలు పడ్డ స్త్రీలు, తాగుబోతు మగాళ్ళు చనిపోగా విధవలైనవారు, మొగుళ్ళు ఒదిలేస్తే ఒంటరైన మహిళలు, పురుషుల చేతిలో మోసగింపబడ్డ అబలలు ఇలా ఈగ్రంథం నిండా వీరే! కళింగాంధ్రలోని సమాజ బాధిత మహిళలే కనిపిస్తారు. ఈవిడ మామూలు కథకులు రాసినట్టుగా కథను ముగించరు. చిత్రకారుడు ప్రకృతిని చిత్రించి, పేరు మనల్నే పెట్టమన్నట్టు ముగింపు పాఠకుడికే వదిలేస్తారు. కథను మాత్రం ఏ కథకుడూ రాయలేనంత సహజంగా చెబుతారు. అడవి మధ్యగా వంపులు తిరుగుతూ ప్రవహిస్తున్న నది అడవి దట్టమైనచోట కనిపించకుండా పోతుంది. అది వేరే నదిలో లీనమయిందా? అక్కడే ఇంకి పోయిందా? ఇంకా పారుతుందా? సముద్రంలో కలిసి పోయిందా? పాఠకుడే అంచనా వేసుకోవాలి. ఈ కథల్లో ముగింపు కోసం వెతికితే నిరాశే! కాని ఆ రాసే విధానంలోని తెగింపు మాత్రం ఆశ్చర్యం.

'మనాడోల్లకి పెల్లిల్లు అచ్చిరావర్రా' అంటూ బిగ్గరగా ఏడుస్తుంది ఆదిలక్ష్మి 'మనకీ పెళ్ళిళ్ళు అచ్చిరావు' అనే కథ ముగింపులో. ఐతే ఈ కథలన్నింటిలో అన్ని పెళ్ళిళ్లూ పెద్దలు కుదిర్చినవే! ఏ సంసారమూ చివరంటా సజావుగా నడవదు. ఏ స్త్రీ జీవితం కూడా సంతోషంగా గడవదు. తల్లులే, ఇంట్లోని వారే అమ్మాయి ఇష్టాన్ని తెలుసుకోకుండా, డబ్బో, ఉద్యోగమో ఉందని తమకు నచ్చినవాడికిచ్చి చేసెయ్యడం, ఆ సంసారం పెటాకులైపోవడం, మగాడు వేరే స్త్రీని పెళ్ళాడ్డం, ఆడది సమాజానికి బలికావడం జరుగుతుంది. 'సమరమే!' అనే కథ ముగింపులో 'యుద్ధం తప్పనప్పుడు తలపడాల్సిందే! జీతం కోసమో, జీవితం కోసమో తెగించాల్సిందే! మళ్ళీ మళ్ళీ తెగించాల్సిందే! ... ఇలా బాధితురాలు పంతులమ్మచే అనిపిస్తారు.

ఇందులోని 19 కథల్లో బతుకు మీద యుద్ధంలో వీరమరణం పొందిన 'ఎర్రెమ్మ'లు పల్లెల్లో అక్కడక్కడా కనిపిస్తారు. పట్నం జనాలకు ఆమె ఓ వింత పాత్ర. ఛాత్రిబాబు (రావి శాస్త్రి) తన దగ్గరక్కు టటంట్లుగా వచ్చిన పేదల్లో కొందరు మహిళల జీవితాలను కథలుగా, నవలలుగా మలిచారు. కత్తి పద్మ నాల్గు దశాబ్దాలపాటు మహిళా ఉద్యమ కార్యకర్తగా తానే ఆయా పల్లెలకు పోయి, ప్రత్యక్షంగా చూచి, విని, బాధిత మహిళల జీవితాలను చలనచిత్రంలా రూపు కట్టించారు.

ఉత్తరాంధ యాస ఈ పద్మ పట్టుకున్నంతగా ఇంకొక రచయిత పట్టుకోలేదంటే అతిశయోక్తి కాదు. పేరాలు పేరాలు, పేజీలు పేజీలు విశాఖపట్నం యాస అతి సహజంగా ప్రవహిస్తుంటుంది. ఈమె సమాజపు లోతుల్లోకి నడిచారు. మనల్ని నడిపిస్తారు ఈ కథల్లో. లోతులకు దిగితేనే ఏదైనా అంటుతుంది. 'నీగీదల్ని నీ ఇంట్లోనే ఉంచీసుకోయే. ఆటుచ్చా పేడా నీకే ఉండిపోతాయి. ఈదుల్లో ఒదలకే. నీగీద పేడని తెలిత్తే నా కోడలు దాని మొకవే సూడకపోను. పేడమీద గేదెల పేర్లూ లేవూ, నీ పేరూ నేదు. మరి అది ఎవలి పేడో ఎవులికి తెలుత్తాది.

నువ్వు మనసులో ఏదో ఎట్టుకొని ఇలగ పేడమీద పేరెట్టి గొడవకి దిగినావని నాకు తెల్సుగానీ ఇంక ఎక్కువ పేలక. నా ఈదిలో పడిన పేడని మావు తీసి కుసింత కల్లాపి జల్లుకున్నాం. రాయే, వచ్చి మా వాకిలి నాకీసి పేడొట్టుకు పోయే.' ఈ రకంగా నూకాలమ్మను వరహాలమ్మ చేత ఒక దులుపు దులిపిస్తుంది కత్తి. 'మా ఇసాపట్నం కొండ' కథలోది ఈ సన్నివేశం. ఈ కథలో వరహాలమ్మ మొగుడు సత్తిరాజు పోర్టులో ఉద్యోగి. జీతమంతా తాగుడికే ఖర్చు చేస్తుంటాడు. తన వైవాహిక జీవితంలో ఏ రకమైన సుఖానికీ నోచుకోని వరాలమ్మ మొగుణ్ని వీధిలోకి గెంటేసి, పిల్లల్ని తానే పెంచి, గేదెలూ, కోళ్ళూ, కుక్కలే ఆప్తులుగా బతుకుతుంది.

ఇందులోని 19 కథల్లో మందుతాగి బలాదూరుగా తిరిగే మగవాళు ్ళ మహిళలను ఆటవస్తువులుగా వాడుకొని వదిలేయడం చూస్తాం. సమాజంలో మందు ఎంత బలంగా వేళ్ళూనుకుందో, స్త్రీల జీవితాలను ఎలా ఛిద్రం చేస్తోందో వీటిలో స్పష్టపడుతుంది. అన్నీ ఈ కర్మభూమి మీద నడయాడే ఆడదాని కథలే! రక్తమాంసాలు కలిగిన స్త్రీలు మన కళ్ళెదుటే తిరుగుతుంటారు. క్షోభలు, కన్నీళ్ళు, బండబారిపోడాలు, తెగింపులు ఒకటేమిటి? తరతరాలుగా సమాజం చేత తొక్కబడి, సమాజం అడుగు పొరలో మగ్గుతున్న అబలలే తారసపడతారు. 'దారులు మూసుకు పోవాల' కథంతా పూర్తయి, చివరి మూడు లైన్లు చదవగానే ఒకందుకు నవ్వొస్తుంది.

చీకటిపువ్వుగా బతికి విషాదాంతమైన కాంతది కథ కాదు. 50 ఏళ్ళ కిందటి కొందరి పేదింటి ఆడపిల్లల చరిత్ర. తన ప్రమేయం లేకుండానే తన శరీరం అంగడి వస్తువైన అబల వ్యథ ఇది. అంగడి సరుకై బండబారి కూడా ఒక మగాడిని ఇష్టపడి, వాడికి జీవితాన్ని అర్పించిన కథే 'చీకటిపువ్వు'. మండే ఎడారిలోనూ ఒయాసిస్సు ఉంటుంది కదా! ఇందులో కాంత మనసూ అలాంటిదే! ముఖపత్రంపై చీకటిపువ్వును మోషే దయాన్ అత్యంత ప్రతిభావంతంగా వేశారు. పువ్వు ఏ తుమ్మెదకు తన మకరందాన్ని ఇష్టపూర్వకంగా అందిస్తుందో, ఏ తుమ్మెదను చూచి ముడుచుకు పోతుందో, చీదరించుకుంటుందో పూబోడులకే ఎఱుక. అందుచేతనే ఈ కథలను ఇంత ఆర్ద్రంగా కత్తి పద్మ రాయగలిగారు. మగవారికి అసాధ్యమైన రచన ఇది. వారు రాసినా కథలు కొంచం అటు ఇటు అవుతాయే తప్ప ఇంత స్వాభావికంగా రాయలేరు. 308 పుటల 'చీకటి పువ్వు' అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలోనూ రూ.250 లకు దొరుకుతుంది.

# అస్తిత్వ వేదనే కవిత్వమైతే



తన విశాల నేత్రాలతో వసుధ్కైక జీవన సౌందర్యాన్ని దర్శించాలను కుంటుంది కవిత్వం. అందుకోసం మానవ జీవన పార్శ్వాలను ఆత్మీయతాసుగంధంతో నింపుతూవుంటుంది. మనిషి మనిషికీ మధ్య అనుబంధపు ప్రవాహమైపోవాలని తహతహలాడి పోతుంటుంది. మనిషి హక్కుల్ని కాలరాసే సామాజిక అసమానతల్నించీ, కొండంతగా పాకిపోతున్న వివక్షల్నించీ పెల్లుబికే అస్తిత్వ వేదనను చూసి కవిత్వమూ చలించిపోయింది. ఆ అసమానతల్నీ, ఆ వివక్షల్నీ కూకటివేళ్లతో పెకళించడానికి అది కొండంత సామాజిక బాధ్యతను భుజానెత్తుకొని ఒక ఆయుధమై పోయింది. అస్తిత్వ పోరాటమైపోయి ంది. పూలపరిమళాల్ని గుప్పిట పట్టుకోవడానికి ప్రయత్నిస్తూ సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక దోపిడీలకు పాల్పడుతూ పితృస్వామ్య వ్యవస్థ నిర్మించిన మహిళల మౌనవేదనల కోటలపై విర్రవీగే పురుషాహంకారపు పతాకాలను కూలద్రోయడానికి, బహుజనుల ఆత్మగౌరవపు తోటల్లోకి చొరబడిన కులాధిపత్యపు శిశిరాలను కాలరాయడానికి కవిత్వం తన అక్షరాలనిండా చైతన్యప్రవాహాన్ని వొంపుకుంటూనే వుంది. నిరంతర అస్తిత్వ అన్వేషణలో అది ఒక అనివార్య యుద్ధగీతమైపోయింది. బిగుసుకున్న పిడికిలి అయిపోయింది. ఆకాశమంత స్వేచ్ఛ కోసం, వెన్నెలంత ఆత్మగౌరవం కోసం అది తపిస్తూనేవుంది.

'మొగ్గలు పువ్వులవకుండా కిటకిట్లాడే క్రిముల నిఘాచుక్కలు పదునెక్కకుండా మబ్బు మబ్బు రాజుకున్న పొగరెక్కలు ఎగరనీకుండా క్షతపవనాలు చుట్టిన పగవీళ్లు కదా మన మిత్రులు, పుత్రులు, తండ్రులుతీరని శాపాలు, తలకొరివి దీపాలు అని పాడుకుంటూపహారాలతో, పరదాలతో జీవితం మీద పేరుకుంటున్నచావునీటిమట్టాన్ని తోడి పారబోసుకోవడం పూర్తికానేలేదు'('స్లీపింగ్ పార్టనర్' ఖండిక నుంచి)అంటూ స్త్రీ అస్తిత్వాన్ని తన పదఘట్టనలతో అణచివేసే పితృస్వామ్యవ్యవస్థ మీద ధ్వజమెత్తింది కొండేపూడి నిర్మల కలం. పూల సరాగాలు కాకముందే మొగ్గల నిండా విరాగాల్ని నింపే సామాజిక కీటకాల నిఘాపై నిఘాపెట్టింది కవిత్వం. నిండుగా కాంతులు చిమ్మకముందే నారీనక్షత్రాలను కప్పేసిన పురుషాహంకారపు మబ్బుల పొగకు పొగ పెట్టాలని యత్నిస్తోంది. రెక్కలస్వేచ్ఛకు అడ్డుపడే ప్రచండ పవనాల పగను పసిగడుతోంది. ప్రియతములనే వాళ్లతో గడిపే క్షణాలన్నీ తీరని శాపాల్కైపోతుంటే, వారంతా తమపాలిట కొరివి దీపాల్కైపోతుంటే ఆ మహిళ వేదనంతా తానే అయిపోయింది కవిత్వం. ఆమె పాలిట పహారాలుగా, పరదాలుగా పెత్తనం చెలాయిస్తున్న పురుషాధిపత్యపు శృఖలాల్ని ఛేధించడానికి చ్కైతన్యప్రవాహమై పోయింది. సన్నని నీటిపాయలు సెలయేళ్ల్కైపోవాలని, సెలయేళ్లు నదుల్కైపోవాలని, నదులు సముద్రాల్కైపోవాలని, ఆ సముద్రాలు అస్తిత్వపు అలలతో ఎగిసిపడుతుండాలని అది తపిస్తోంది.'నేనూ/ నా వేసబాసలు వెక్కిరింతల్కైనచోటనా ఇల్లు ఊరవతల కాలనీగా మొలుస్తున్నపూట నన్ను ఎక్కడికక్కడ వేరుచేస్తున్న చోటజివ్వుమనే నొప్పితో నవ్వుల తోటనెలా అవుతానునా చెప్పులపై నడిచి/ నా డప్పులతో ఊరేగినా సప్పరంలో కొలువుదీరేదాకా/ నేను ఇలాగే ఇలాగేనా నెత్తురుతో మాట్లాడుతుంటానునేనేందో తెల్సుకున్నాకా/ నాను నాలాగే మాట్లాడుతుంటాను'('నేను పలానా' ఖండిక నుంచి) అంటూ బహుజన అస్తిత్వ వేదనను అక్షరీకరించింది వర్తమానకవి పల్లిపట్టు నాగరాజు కలం. తన ఉనికికి అడ్డుపడే కులాధిపత్యపు వెక్కిరింతల్ని ప్రశ్నించే బాధితుడికి కవిత్వం తోడ్కైంది. మనిషి నుంచి, సామూహిక మనిషితనం నుంచి తనను వేరుచేసేసామాజిక బాధ అతడిది. ఆధిపత్యం తన ఆత్మగౌరవానికి తూట్లు పొడిచేబాధ అతడిది. అతడి వేదనతో కవిత్వం మమేకమైపోయింది.

పనిగట్టుకొని అతడిని 'పలానా' చేసేస్తున్న సామాజికశక్తులపై యుద్ధం ప్రకటించాలని, అతడు తల ఎత్తుకొనే నవ్వులతోట కావాలని, ఆత్మీయతా పరిమళాల మధ్య అతడు తొక్కుడుబిల్లాట ఆడాలని, అతడిని బాధిస్తున్న తరతరాల జివ్వుమనే నొప్పి రివ్వుమని ఎగిరిపోవాలని అది తపిస్తోంది.

ఆత్మవిశ్వాసపు డప్పులతో ఊరేగి సంకల్పపు కొలువుదీరేదాకా కుతకుతలాడే నెత్తుటితో మాట్లాడే అతడి అనంతమైన బాధతో జతకట్టి ఓదార్పునిస్తుంది కవిత్వం. మనిషి విభిన్న జీవన పార్శ్వాలలోకి తొంగిసూస్తూ అతడిలో సంలీనమైపోతూ వుంటుంది. అందుకే అది నిరంతరం ఆరళ్ల కాసారంలో మగ్గిపోయే గానుగెద్దు జీవితం లాంటి అమ్మ దుఃఖమైపోతుంది. బానిసత్వపు కొలిమిలో ఇనుప దిమ్మెలా రగిలిపోయే అయ్య వేదన్కైపోతుంది. కవిత్వం తనలోని సహస్ర ముఖాలను అస్తిత్వ పతాకాలుగా ఎగరేస్తుంటుంది.

# నదితో కొంచెంసేపు



ఎక్కడి నుంచో చల్లని ఊసులను మోసుకొస్తున్న
గాలి ఊర్లను నగరాలను చుట్టేస్తూ ఒడ్డున
కూర్చున్న వాళ్ళని పలకరిస్తూ పయనమవుతున్నది
నదితో కొంచెంసేపు
ఎక్కడి నుంచో చల్లని ఊసులను
మోసుకొస్తున్న గాలి
ఊర్లను నగరాలను చుట్టేస్తూ
ఒడ్డున కూర్చున్న వాళ్ళని పలకరిస్తూ
పయనమవుతున్నదిజి
పడవ పడవకో కథ
అలలకూ సుడులకూ అనాది బంధం
తెడ్లను కదిలించే చేతలకు జవసత్వాలను ఇస్తానని
అలలతో స్వాగతిస్తుంటుంది నది
పిండార పోసిన వెన్నెలైనా
ఎండకు మెరిసిపోయే దిన రూపమైనా
నది నవ్వుల పసి పాపే అవుతుంది
కలతల భాషతో కలల భాష
భాష్పమో భావమో గుండె పండు కాదు
కన్నీళ్ళ సుడులేనా కలకాలం
నా నీళ్ళ సుడులు చూడమనేది నది
నలుపును తెలుపును నీలమయం చేసి
ఆకాశాన్ని ప్రతిబింబిస్తుంది
తన నొరుసుకుని నిలుచున్న
చెట్ల వేళ్లను ముద్దాడుతూ
అమిత ప్రేమ కురిపిస్తుంది
పుట్టుక అర్థం అదే కదా!
కొండకు అద్దానికి అరతెర తీసిన అర్థమై
ఈ కాలుష్యాలకు హెచ్చరిస్తూ
కన్నతల్లి అవుతుంది నది!
దాహం తీర్చిన అలల చేతులూ నదివే
తనను దాటుతూ నడిచే నడకకు
తన నీటి చర్మం ఎండిందంటే బాటా తానే!
ఆవిరిగొనే గ్రీష్మం ఆర్తి దీర్చే వర్షం
భరింపుల వెనుక తను ఓ ఉదాహరణ
అవుతానంటుంది నది!
జలచరాలూ భూ చరాలూ
పొగసూరని మనసుతో విచ్చుకొనే
పచ్చి బాలింతల తానేనంటున్నది నది!
కలుషితం కానంతవరకు
తన నీరు చనుబాల తీరేనంటున్నది!
నదితో కాసేపు ఉంటే కాలం
చిరుజల్లులు కురిపిస్తుంది
పరమాణువు పరిణామం
పరమార్థపు పరిమాణం
ప్రశ్నలతో పసిగట్టమంటున్నది నది!
పొలం రెండు చేతుల కోసం
చూసినట్టు కలకాలం
చూస్తానంటున్నది విచిత్రంగా నది!

# పబీబెన్.కామ్



షార్క్ ట్యాంక్.. సోనీ లివ్‌లో టెలికాస్ట్ అవుతున్న ఓ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్. ఐఐటీలు, ఐఐఎమ్‌ల పట్టభద్రులు ఆ వేదిక మీద బిజినెస్ ఐడియాలను పంచుకుంటారు. తమ ప్రణాళికలు వివరిస్తారు. అంకెల మంత్రమేసి ఇన్వెస్టర్లను ఆకర్షిస్తారు. పబీబెన్‌లాంటి మహిళలు అక్కడి దాకా రావడం అరుదు. పబీబెన్.. నిరక్షరాస్యురాలు. గుజరాత్, కచ్ ప్రాంతంలోని ఓ మారుమూల పల్లెలో పుట్టింది. పేదరికం మధ్య పెరిగింది. పశువులు మేపేందుకు వెళ్లేది. వెళ్తూ వెళ్తూ కాలక్షేపానికి ఎంబ్రాయిడరీ సామగ్రి తీసుకెళ్లేది. బట్టల మీదే కాదు, అలంకరణ వస్తువుల మీదా ముచ్చటగా ఎంబ్రాయిడరీ చేయగలదు తను. నీలేశ్ థాపర్ అనే వ్యాపారవేత్తకు పబీబెన్ పనితనం గురించి తెలిసింది. తనే చొరవ తీసుకుని ఆమెతో ఓ కంపెనీ పెట్టించాడు. ఇప్పుడు ఆ సంస్థలో యాభైమంది ఎంబ్రాయిడరీ నిపుణులు ఉన్నారు. షార్క్ ట్యాంక్ వేదికపై.. పబీబెన్ ఆలోచనలు నచ్చి యాభై లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు ఓ ఇన్వెస్టర్. ప్రస్తుతం పబీబెన్.కామ్ వార్షిక టర్నోవర్ రూ. రెండు కోట్లు. 'సిగ్గు పడకండి. మొహమాటం వద్దు. భయపడొద్దు. మీ కలల్ని నిజం చేసుకోండి' అని తోటి మహిళలకు సలహా ఇస్తారు పబీబెన్.

# ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ ఎందుకొస్తుంది? ఇది అంత ప్రమాదమా?

**గర్భధారణ అనే ప్రక్రియ.. అండంతో శుక్రకణం కలిశాక, అది పిండంగా ఏర్పడ్డ సమయం నుంచి మొదలవుతుంది. అండంతో శుక్రకణం కలవడాన్ని 'ఫలదీకరణ' అంటారు. ఫలదీకరణ జరిగాక ఏర్పడ్డ పిండం గర్భసంచిలో పెరగాలి. కానీ, కొన్ని సందర్భాల్లో గర్భసంచిలో కాకుండా.. దాని పరిసరాల్లో పిండం పెరగడాన్ని 'ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ' అంటారు. అండాశయం (ఓవరీస్) నుంచి అండాన్ని గర్భసంచిలోకి వచ్చేలా తోడ్పడే ట్యూబ్స్‌ను 'ఫెలోపియన్ ట్యూబ్స్' అంటారు. కొన్ని సందర్భాల్లో పిండం గర్భసంచిలో బదులు ఈ ఫెలోపియన్ ట్యూబుల్లో పెరగడంతోపాటు ఒక్కోసారి అండాశయాల్లో (ఓవరీస్), కాస్తంత కిందికి వస్తే గర్భాశయ ముఖద్వారంలో.. ఒక్కోసారి కడుపులో కూడా పెరగవచ్చు. ఈ సమస్యనే 'ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ'గా వ్యవహరిస్తారు.**



ఇలాంటి సందర్భాల్లో సాధారణ గర్భధారణలోలా పిండం ఏర్పడటం, ఆ తర్వాత అది శిశువుగా రూపొందే ప్రక్రియ జరగదు. ఫలితంగా ఆ పిండంలో మనుగడ కొరవడుతుంది. అంతేకాదు.. ఒక్కోసారి అరుదుగా తల్లిలో రక్తస్రావానికి కారణమై, ఆమెకు కూడా ముప్పు తెచ్చిపెడుతుంది.

**లక్షణాలు :**

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో మొదట్లో ఎలాంటి లక్షణాలూ కనిపించవు. అయితే కొంతమందిలో గర్భధారణలో కనిపించినట్టే పీరియడ్స్ ఆగిపోవడం, వికారం, వాంతులు కనిపిస్తాయి. అంతేకాదు.. మామూలుగా తమకు తాముగా చేసుకునే ప్రెగ్నెన్సీ పరీక్షల్లోనూ ఫలితాలు 'పాజిటివ్' అని వస్తాయి. అయితే, మామూలుగా పిండం ఎదుగుదల గర్భసంచిలో మాత్రమే ఉంటుంది. కానీ, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో పిండం ఎక్కడో గర్భసంచి బయట ఏర్పడుతుంది. కాబట్టి, పిండం ఎదుగుదల నార్మల్‌గా ఉండదు.

ఎప్పుడు అనుమానించాలి? డాక్టర్‌ను ఎప్పుడు సంప్రదించాలి అంటే?

- ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీగా అనుమానించడానికి తోడ్పడే కొన్ని లక్షణాలు ఇలా వ్యక్తమవుతాయి.
- తొలిదశల్లో యోని నుంచి రక్తస్రావం కావడం, పొత్తికడుపులో నొప్పి రావడం ద్వారా ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీగా అనుమానించాలి.
- తల తేలికైపోయిన ఫీలింగ్‌తోపాటు స్పృహ తప్పవచ్చు.
- భుజం నొప్పి కూడా కనిపించవచ్చు.
- ఈ లక్షణాలు కనిపిస్తే తక్షణం డాక్టర్‌ను కలవాలి.

**ఎవరెవరిలో ముప్పు ఉంటుందంటే?**

- మొదట ఒకసారి ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ వచ్చి ఉన్నవాళ్లలో మరోసారి కూడా వచ్చే అవకాశముంది.
- జీవిత భాగస్వామి నుంచి గనేరియా, క్లమీడియా వంటి కొన్ని లైంగిక సంబంధిత ఇన్ఫెక్షన్లు సోకిన మహిళల్లో ఈ ముప్పు కనిపించవచ్చు.
- సంతాన సాఫల్యత కోసం చికిత్సలు తీసుకుంటున్నవారిలో.
- ఫెలోపియన్ ట్యూబుల్లో లోపాలుండి, వాటిని సరిదిద్దేందుకు శస్త్రచికిత్స తీసుకున్నవారిలో.
- పొగతాగే అలవాటు ఉన్న మహిళల్లో ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీకి అవకాశాలు ఎక్కువ.

**ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ కాంప్లికేషన్లు**

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ చాలావరకు ఫెలోపియన్ ట్యూబుల్లో పెరుగుతుంది. ఆ పెరుగుదలకు తగినట్లుగా సాగలేక ట్యూబులు గాయపడవచ్చు. ఫలితంగా గాయపడ్డ ట్యూబుల్లోంచి తీవ్రమైన రక్తస్రావం అవుతుంది. ఇలా ఆగకుండా అయ్యే రక్తస్రావంతో ఒక్కోసారి తల్లి ప్రాణానికే ముప్పు రావచ్చు.

**నివారణ**

- పొగతాగే అలవాటుకు పూర్తిగా దూరంగా ఉండటం. ఇది ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ నివారణకే కాదు.. అనేక ఇతర అనారోగ్యాలనూ నివారిస్తుంది.
- లైంగిక సంబంధాల వల్ల సంక్రమించే వ్యాధులను నిర్ధారించడం
- ముందస్తుగా చేసే నిర్ధారణ మరియు చికిత్స ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో చాలా ముఖ్యం.

# సక్సెస్ లోడింగ్!





తయారీ రంగంలో ఇప్పటికీ పురుషులదే పెత్తనం. అందులోనూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో మగవారిదే ఆధిపత్యం. ఈ రెండు పరిమితులనూ అధిగమించి.. అమెరికా మాన్యుఫ్యాక్చరింగ్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాన్ని అందుకున్నారు రష్మి వడ్లకొండ.

మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలో మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించే రోజు ఎంతో దూరం లేదంటారు రష్మి వడ్లకొండ. ఈ యువతి వృత్తిరీత్యా మెకానికల్ ఇంజినీర్. ఉత్పాదక రంగంలో తమదైన ప్రతిభ కనబరుస్తూ.. నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోస్తున్న మహిళలకు అమెరికాలోని ద మాన్యుఫ్యాక్చరింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏటా 'ఉమెన్ మేక్' అవార్డులను అందజేస్తుంది. తాజాగా ఐర్లాండ్ వేదికగా జరిగిన సదస్సులో ఈ ఏడాదికిగాను ఆ పురస్కారం సాధించి ఎమర్జింగ్ లీడర్‌గా నిలిచారు రష్మి.

ఐర్లాండ్ రాజధాని డబ్లిన్ కేంద్రంగా పనిచేస్తున్న ట్రేన్ టెక్నాలజీస్‌లో రష్మి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్రీడీ ప్రింటింగ్‌లో ఆ సంస్థకు తను సాంకేతిక సలహాదారు. దాంతోపాటే, క్యాంపస్ నుంచి అప్పుడే బయటికొచ్చిన యువ ఇంజినీర్లకూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఉమెన్ ఇన్ మాన్యుఫ్యాక్చరింగ్ (డబ్ల్యూఐఎమ్) అసోసియేషన్ సౌత్ కరోలినా చాప్టర్‌కు వైస్ చైర్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఇంటర్నల్ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా.. ఈ రంగంలోకి వచ్చే మహిళలను ప్రోత్సహిస్తున్నారు. పట్టుదలతో పనిచేస్తే పురుషులతో పోటీపడటం అసాధ్యం కాదని భరోసా ఇస్తారామె. రష్మి నాయకత్వ ప్రతిభను ట్రేన్ టెక్నాలజీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మైరేడ్ మాగ్నెర్ కొనియాడారు కూడా.

**పక్కా హైదరాబాదీ**

రష్మి నేపథ్యమంతా హైదరాబాద్ చుట్టూనే తిరుగుతుంది. ఇక్కడే పుట్టిపెరిగారామె. ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ చేశారు. కొంతకాలం క్యాంపస్‌లోనే రీసెర్చ్ అసిస్టెంట్‌గా చేశారు. తర్వాత సైయెంట్ టెక్నాలజీస్‌లో ఏడాదిపాటు ఉద్యోగం చేశారు. అనంతరం అమెరికా వెళ్లి నార్త్ కరోలినా స్టేట్ యూనివర్సిటీలో ఎంఎస్ చదివారు. 'ఓ కొత్త వస్తువుకు రూపం ఇవ్వడం అనేది.. ఓ జీవికి ప్రాణం పోసినంత గొప్ప పని. బాల్యం నుంచీ నన్ను కొత్తకొత్త ఆవిష్కరణలు ఆకట్టుకునేవి. భిన్నంగా ఆలోచించేలా ప్రేరేపించేవి. వైద్యం, సాహిత్యం, రాజకీయం.. ఇలా అన్ని రంగాల్లో మహిళలు రోల్ మోడల్‌గా ఉన్నారే? ఇక్కడ మాత్రం ఎందుకులేరనే ప్రశ్న వెంటాడేది. అదే నాతో మెకానికల్ ఇంజినీరింగ్ వైపు అడుగులు వేయించింది' అంటారు రష్మి.

కూతురి తపనను కన్నవారూ అర్థం చేసుకున్నారు. తమవంతుగా ప్రోత్సహించారు. సివిల్, మెకానికల్, ట్రిపుల్-ఈ వంటి కోర్సులలో యువతులకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. తను చదువుకునే రోజుల్లోనూ అంతే. క్లాస్‌రూమ్‌లో అమ్మాయిల సంఖ్య పదిహేను లోపే. మాస్టర్స్ చదువుతున్న రోజుల్లోనూ అదే పరిస్థితి. పదిమంది విద్యార్థులు ఉంటే.. తానొక్కతే అమ్మాయి. అసలే క్లిష్టమైన సబ్జెక్ట్, దానికితోడు ఒంటరిననే భావన. అన్నీ వదిలేసి ఇంటికి రావాలనే ఆలోచన వచ్చేదట. అదీ తాత్కాలికమే. అంతలోనే గుండెనిండా ఆత్మవిశ్వాసం నింపుకొనేవారామె. మెటల్ ఎడెటివ్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో లోతైన అధ్యయనం చేశారు.

మాస్టర్స్ తర్వాత ట్రేన్ టెక్నాలజీస్‌లో ఉద్యోగం రష్మి జీవితంలో ఓ మలుపు. ఓ మామూలు ఇంజినీర్‌గా కెరీర్ ప్రారంభించి.. కంపెనీకి అవసరమైన సాంకేతికతను అందించే స్థాయికి చేరుకున్నారు. వివక్షకు తావులేకుండా మహిళలకు అవకాశాలు కల్పిస్తే కంపెనీలైనా, కుటుంబాలైనా వృద్ధి చెందుతాయి. అప్పుడే, మహిళల సత్తా వెలుగులోకి వస్తుంది. అమెరికాలో, భారత్‌లో.. ఈ విషయంలో జరగాల్సింది చాలా ఉంది' అంటారు రష్మి ఆశావాదం ప్రతిధ్వనించేలా. అవును. తను చెప్పినట్టు.. ముందుంది మంచికాలం.

**తనవైన అభిరుచులు**

'రష్మికి యోగా అంటే ప్రాణం. 'ఆరోగ్యకరమైన శరీరం, ఆరోగ్యకరమైన మనసు యోగాతోనే సాధ్యం' అంటారామె. తను ఫ్యాషన్ ప్రేమికురాలు. ట్రెండ్స్‌ను ఇష్టపడతారు. కొత్త ధోరణులను సాధికారికంగా విశ్లేషించగలరు కూడా. అప్పుడప్పుడూ ర్యాంప్ మీద మెరుపులు మెరిపిస్తారు. 'రేపటి తరం కోసం.. అందులోనూ మహిళల కోసం తయారీ రంగానికి సువిశాలమైన మార్గాన్ని సిద్ధం చేద్దాం' అంటూ పిలుపునిస్తారు రష్మి.

# పాదాల్లో పగుళ్లు వేధిస్తున్నాయా.. అయితే ఈ చిట్కాలు మీ కోసమే



అందంగా కనిపించడం కోసం చాలా మంది ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. మెరిసే చర్మం కోసం క్రీములు, లోషన్‌లు రుద్దుతుంటారు. హెయిర్ కటింగ్‌లో, వస్త్రధారణలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ పాదాల సంరక్షణను మాత్రం గాలికి వదిలేస్తుంటారు. కానీ, సుతిమెత్తగా ఉండాల్సిన పాదాలలో పగుళ్లు వస్తే తీవ్రంగా బాధిస్తాయి. అయితే, కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటించడం ద్వారా సమస్య నుంచి సులువుగా బయటపడవచ్చు. మరి ఆ చిట్కాలు ఏంటో చూద్దామా..?

**పాద సంరక్షణకు చిట్కాలు..**

1. నోటి శుభ్రత కోసం ఉపయోగించే మౌత్‌వాష్ పౌడర్ చర్మానికి తేమను అందిస్తుంది. ఒక వెడల్పాటి బకెట్‌లో కొంచెం మౌత్‌వాష్ పౌడర్, నీళ్లు కలిపి అందులో పాదాలను 15 నిమిషాలపాటు ఉంచాలి. తర్వాత వేరే నీళ్లతో పాదాలను శుభ్రం చేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

2. యాంటీ మైక్రోబయల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలున్న తేనె పగిలిన పాదాలకు చక్కని మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. పాదాలకు పగుళ్లు ఉన్నచోట కొద్దిగా తేనె రాసుకొని అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తే పాదాలకు నిగారింపు వస్తుంది.

3. కొబ్బరి నూనె కూడా పొడి చర్మానికి తేమను అందించి తాజాగా మారుస్తుంది. రాత్రిపూట నిద్రపోయే ముందు పాదాలకు కొబ్బరి నూనె రాసుకుంటే పగుళ్ల బాధ తగ్గుతుంది.

4. సాధారణంగా ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌ల వల్ల కూడా పాదాల్లో పగుళ్లు వస్తాయి. అలాంటప్పుడు వెనిగర్ కలిపిన నీటిలో పాదాలను కొద్దిసేపు ఉంచితే పగుళ్లు తగ్గి ఉపశమనం లభిస్తుంది.

5. అదేవిధంగా పగిలిన పాదాలకు ఓట్‌మీల్, పాల మిశ్రమం కూడా మంచి ఔషధంగా పనిచేస్తుంది. ప్రతివారం ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసుకుంటే పగుళ్లు మాయమవుతాయి.

## ఎడిటోరియల్

# మత విశ్వాసం-స్వేచ్ఛ



వివాహం, పెళ్లి వంటి వాటికి రాజ్యం దూరంగా వుంటేనే మత స్వేచ్ఛ రక్షించబడుతుంది. బలవంతపు మత మార్పిడులను ఎదుర్కొనడం అనే పేరుతో నడుస్తున్న సుదీర్ఘమైన వ్యాజ్యాలు న్యాయస్థానాల విలువైన సమయాన్ని హరించి వేస్తున్నాయి. దేశంలో మోసపూరితంగా జరుగుతున్న మత మార్పిడిని అణచివేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్)పై సుప్రీం కోర్టు విచారిస్తోంది. ఈ విషయంలో వెనుకబడకూడ దనుకుంటున్న గుజరాత్ ప్రభుత్వం కూడా తాము తీసుకువచ్చిన మత మార్పిడి నిరోధక చట్టంలోని నిబంధనలపై స్టే ఎత్తివేయాలని కోరుతోంది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఏ మత మార్పిడైనా జరగడానికి ముందుగా జిల్లా మేజిస్ట్రేట్ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆ నిబంధన కోరుతోంది. గుజరాత్ మత స్వేచ్ఛా చట్టం (వివాహం ద్వారా మత మార్పిడిని పొందుపరిచేందుకు లో సవరించారు) లోని సెక్షన్ 5పై గుజరాత్ హైకోర్టు సరిగానే స్టే విధించింది. మతాంతర వివాహాలను చట్టవిరుద్ధమైన మత మార్పిడులకు ఉదాహరణలుగా పేర్కొంటూ వాటిని కవర్ చేయాలని కోరుతున్న ఇతర నిబంధనల అమలుపై కూడా స్టే విధించింది. ముందస్తు అనుమతి తప్పనిసరనే ఈ నిబంధన వల్ల ఎవరైనా తమ మతాన్ని, లేదా విశ్వాసాన్ని మార్చుకోవాలనుకుంటే దాన్ని ముందుగానే వెల్లడించాల్సి రావడం వారిపై ఒత్తిడిని పెంచుతుందని హైకోర్టు పేర్కొంది. వివాహం, నమ్మకం అనేవి ఒక వ్యక్తి స్వంత ఎంపికగా వుండాలని పేర్కొంటున్న సుప్రీం కోర్టు గత రూలింగ్‌లకు ఈ నిబంధన విరుద్ధంగా వుందని పేర్కొంది. సెక్షన్ 5పై విధించిన స్టే ఎలాంటి మోసం లేదా బలవంతం లేని వాస్తవమైన మతాంతర వివాహాలను కూడా దెబ్బ తీస్తోందంటూ గుజరాత్ వాదించడం ఇక్కడ ఆశ్చర్యకరం. మతాంతర వివాహం పర్యవసానాలు ఏమైనా వున్నట్లైతే ఈ ముందస్తు అనుమతి తప్పనిసరి నిబంధన వల్ల మత మార్పిడి నిజమైన స్వభావాన్ని ప్రశ్నించాల్సిన అవసరం రాదు. స్వచ్ఛంద మత మార్పిడికి ఈ నిబంధన వెసులుబాటు కల్పిస్తోందని ఏ ఒక్కరూ పేర్కొనడం లేదు. కేవలం మతాంతర వివాహం జరిగిందనే వాస్తవం ఆధారంగా ఎలాంటి ప్రశ్నలు తలెత్తనప్పుడు లేదా ఎలాంటి అనుమానాలకు తావివ్వనప్పుడు మాత్రమే మత స్వేచ్ఛకు రక్షణ కల్పించబడుతుంది. తన విశ్వాసాన్ని మార్చుకోవాలనే ఉద్దేశ్యాన్ని వెల్లడించాలని ఒకరిపై ఒత్తిడి చేయడమంటేనే అది వారి మనస్సాక్షికి సంబంధించిన స్వేచ్ఛను, గోప్యతా హక్కును ఉల్లంఘిస్తుందనేది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన అంశం. అలాగే, ఈ నిబంధనలపై స్టే విధిస్తూ హైకోర్టు జారీ చేసిన తాత్కాలిక ఉత్తర్వులకు వ్యతిరేకంగా ప్రత్యేకంగా చేసిన అప్పీల్ సుప్రీం కోర్టులో పెండింగ్‌లో వుండగా...మత మార్పిడులకు వ్యతిరేకంగా దాఖలైన పిల్‌పై ప్రస్తుతం జరుగుతున్న విచారణలో భాగంగా ముందస్తు అనుమతి తప్పనిసరనే నిబంధనను పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెటిషన్ అవసరం లేదు. ఇక విస్తృతాంశానికి సంబంధించి చూసినట్లైతే, ప్రలోభాల ద్వారా లేదా దాతృత్వ కార్యక్రమాల ద్వారా మత మార్పిడి అనేది చాలా తీవ్రమైన సమస్య అంటూ జస్టిస్ ఎం.ఆర్.షా నేతృత్వంలోని సుప్రీం కోర్టు బెంచ్ చేసిన వ్యాఖ్యలు...జాతీయ స్థాయిలో మత మార్పిడి నిరోధక చర్యలు తీసుకురావడానికి ప్రభుత్వాన్ని ప్రేరేపించడానికి ఆసక్తిని సూచిస్తున్నాయి. దేశవ్యాప్తంగా విశృంఖలంగా, మోసపూరితంగా మత మార్పిడులు జరుగుతున్నాయంటూ వస్తున్న అతిశయోక్తితో కూడిన ఆరోపణలపై న్యాయస్థానాలు విచారించాలా అనేది ఇక్కడ ప్రశ్నార్థకమే. దానికి బదులుగా, సమస్య ఏదైనా వుంటే దాని తీవ్రత ఎంత వుందో గుర్తించేందుకు వాటిని రాష్ట్రాలకు వదిలిపెట్టి, మత స్వేచ్ఛ, మత సామరస్యతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సి వుంది.

# దేశ సమగ్రత, ప్రజల ఐక్యతకు లౌకికవాదమే శిరోధార్యం

అందుకే రాజ్యాంగ నిర్మాతలు జాతీయోద్యమ వారసత్వాన్ని కొనసాగించడానికి ...మన దేశం ఒక లౌకిక రాజ్యంగా ఉండాలని, సర్వమత సమానత్వాన్ని పాటించాలని, అన్ని భాషలను గుర్తించి గౌరవించాలని రాజ్యాంగంలో ఆ అంశాలను చేర్చారు. అయితే సంఘ్ పరివార్ చేతిలో నేడు రాజ్యాంగం అపహాస్యానికి గురికాబడుతున్నది. ఇతర మతాల ప్రజలందరూ భయం భయంగా బతికే వాతావరణం కల్పించి ప్రజల మధ్య విభజన తేవాలని సంఘ్ పరివార్ భావిస్తున్నది. బాబ్రీ మసీదు కూల్చివేత ఒక గాయమైతే, సంఘ్ పరివార్ చేతిలో భారత రాజ్యాంగం మరెన్నో గాయాలకు గురికావాల్సిన పరిస్థితులు నేడు ఉన్నాయి. లౌకిక వాదులు, ప్రజాస్వామ్య ప్రియులు భారత దేశ సమగ్రతను, సమ భావాన్ని గౌరవించే వాళ్ళందరూ ఏకోన్ముఖంగా రాజ్యాంగ విలువల పరిరక్షణకు లౌకికవాదాన్ని కాపాడుకోవడానికి నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైనది.డిసెంబర్ 6 అంటేనే, ముప్పై సంవత్సరాల కిందట బాబ్రీ మసీదును మనువాద ముష్కరులు దాడి చేసి దౌర్జన్యంగా అయోధ్య లోని చారిత్రక కట్టడాన్ని కూల్చివేసిన రోజు. లౌకికవాద రాజ్యాంగానికి ఆరోజు జరిగిన గాయం ప్రతి సంవత్సరం గుర్తుకొస్తూనే ఉంటుంది. అదే రోజు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి కూడా. బాబ్రీ మసీదు పైనే కాకుండా అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై దాడి చేయడానికి గాను బహుశా అదే తేదీని ఈ దాడికి ఎంపిక చేసుకున్నారేమో. మూడు దశాబ్దాలు గడిచిపోయాయి. కానీ లౌకిక రాజ్యాంగంపై దాడి నేటికీ కొనసాగుతూనే ఉన్నది. కాశీ లోని జ్ఞానవాపి మసీదును, మధుర లోని షాహి ఈద్గానూ స్వాధీనం చేసుకుంటామని సంఘ్ పరివార్ శక్తులు ప్రతిరోజూ హెచ్చరికలు చేస్తూనే ఉన్నాయి. ప్రాచీన కట్టడాల పరిరక్షణకై కట్టుబడి ఉంటామని సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం పదే పదే హామీలిచ్చినా, పార్లమెంటు ప్రత్యేక చట్టం చేసినా... సంఘ్ పరివార్ శక్తులు వాటిని లెక్క చేయకుండా ప్రతి చారిత్రక కట్టడానికి మతం రంగును పులుముతూ...ఇది తమ ఆత్మగౌరవ సమస్యగా చిత్రీకరించి ఒక మతం ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత భారత రాజ్యాంగానికి ప్రమాదం రోజు రోజుకు పెరుగుతూ ఉంది. బిజెపి మాతృకైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏ రోజూ భారత రాజ్యాంగాన్ని తమదిగా భావించడం లేదు. రాజ్యాంగం లోని ప్రజాస్వామ్యం, లౌకికతత్వం అనే పదాలు పాశ్చాత్య దేశాల ప్రభావంతో చేర్చబడినవిగా ఆర్.ఎస్.ఎస్ భావిస్తోంది. భారత దేశానికి ప్రజాస్వామ్య వ్యవస్థ పనికి రాదని కొందరు నిబద్ధులైన, దేశం పట్ల అంకిత భావం కలిగిన ధర్మకర్తలు ఈ దేశాన్ని పరిపాలించాలని వారి భావన. అందుకే గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ, అనిల్ అంబానీ లాంటి శత సహస్ర కోటీశ్వరులకు దేశ ఆర్థిక వ్యవస్థను అప్పజెప్పడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రైవేటీకరణ, ద్రవ్యీకరణ లాంటి అందమైన పదాలను జోడించి ప్రజా సంపదనంతా కట్టబెట్టడానికి, ప్రకృతి వనరులు యథేచ్ఛగా కొల్లగొట్టడానికి అనుమతులిస్తున్నారు. కార్పొరేట్లకు లొంగిపోయి వీరు చేస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజలు గమనించకుండా ఉండేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య మతాల పేర్లతో వైషమ్యాలను సృష్టిస్తూ భౌతికంగా దాడులు చేసుకునే వాతావరణాన్ని కల్పిస్తున్నది. రాజ్యాధికారాన్ని ఉపయోగించుకుని ఆర్.ఎస్.ఎస్ ఎజెండాను అమలు జరిపే కార్యక్రమాన్ని మోడీ సర్కార్ వేగవంతం చేస్తోంది. భారతదేశం బ్రిటీష్ పాలన కంటే ముందు ఒక దేశంగా లేదు. అనేక దేశాల సమూహంగా ఉన్నది. అనేక భాషల ప్రజలు, అనేక మత విశ్వాసాలతో ఉన్నవారంతా కలసి మెలసి ఒకే రాజ్యంలో సహజీవనం చేసే సత్ సాంప్రదాయం వందల సంవత్సరాలుగా భారత ప్రజల మధ్య ఉన్నది. హిందూ రాజుల వద్ద ఇతర మతాలకు చెందిన సైనిక అధికారులు, మంత్రులు, ముస్లిం రాజుల వద్ద హిందూ మతానికి చెందిన మంత్రులు, సైనిక అధికారులు ఉండేవారు. ఆధిపత్యం కోసం రాజ్య కాంక్షతో యుద్ధాలు తప్ప...ఆనాడు జరిగిన యుద్ధాలేవీ మత యుద్ధాలు కావు. బ్రిటీష్ ప్రభుత్వం



జాతీయోద్యమంలో చీలిక తెచ్చి తమ పాలనను కొనసాగించడం కోసం 'విభజించి పాలించు' సూత్రంలో భాగంగా భారతీయ ప్రజల మధ్య హిందూ, ముస్లిం మతాల పేరుతో ప్రజల్ని విభజించే కార్యక్రమం చేసింది. బాబ్రీ మసీదు వివాదం కూడా బ్రిటిష్ కుట్రలో భాగమే. దేశ విభజన జరిగిన సందర్భంలో జరిగిన మారణహోమానికి కూడా బ్రిటిష్ నాటిన మత విభజన విష బీజమే కారణం. అందుకే స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగాన్ని లిఖించడానికై ఏర్పడిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో నాటి జాతీయోద్యమ నాయకులందరూ ప్రజల మధ్య ఐక్యత, దేశ సమగ్రత కాపాడుకోవడానికై అన్ని మతాలను సమ భావనతో చూసేలా, అన్ని విశ్వాసాలను సమానంగా గౌరవించేలా రాజ్యాంగం ఉండాలని భావించారు. అందుకే రాజ్యాంగ పీఠికలో ఈ విషయాన్ని ఇలా ప్రస్తావించారు. "భారత పౌరులందరికీ సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ న్యాయం, భావము, భావ ప్రకటన, విశ్వాసము, ధర్మము, ఆరాధన స్వాతంత్ర్యము, అంతస్తుల్లోనూ, అవకాశాల్లోనూ, సమానత్వమును చేకూర్చుటకు మరియు వారందరిలో వ్యక్తి గౌరవము, జాతి ఐక్యతను, అఖండతను, సౌభాతృత్వమును, పెంపొందించుటకు, సత్యనిష్టా పూర్వకంగా తీర్మానించడమైనది.". రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ఆయన అనుయాయులు ప్రారంభం నుండి మత విద్వేషాన్ని పెంచడానికి తమ పాలనను వినియోగిస్తున్నారు. గో రక్షణ పేరుతో ముస్లింలు, దళితుల పైన దేశవ్యాప్తంగా దాడులు జరిగాయి. అనేక మంది అమాయకులు గో మాంసాన్ని తిన్నారనో, అమ్మారనో ఆరోపణలకు గురై సామూహిక హత్యలకు బలయ్యారు. శాంతి భద్రతలు కాపాడాలని సుప్రీంకోర్టు కేంద్రానికి ఆదేశాలిచ్చినా, ఆ ఆదేశాలను పట్టించుకోనవసరం లేదని గోరక్షకులు చేస్తున్న పవిత్ర కార్యక్రమాన్ని కొనసాగించమని ఆర్.ఎస్.ఎస్ అధినేత మోహన్ భగవత్ బహిరంగంగా పిలుపునిచ్చారు. దీన్నిబట్టే భారత రాజ్యాంగంపై వీరికున్న ప్రేమ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత కూడా లవ్ జిహాద్, ఘర్ వాపసీ లాంటి పిలుపులతో ముస్లీం మైనార్టీలపై విద్వేషాన్ని పెంచడం, దాడులు నిర్వహించడం చేస్తూనే ఉన్నారు. ముస్లిం పర్సనల్ లా ను పూర్తిగా మార్చివేస్తామని హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. మత విద్వేషాన్ని పెంచే కార్యక్రమంలో భాగంగా పౌరసత్వ చట్టాన్ని సవరించి భారత దేశంలో ఉంటున్న ముస్లింలు మినహా ఇతర మతాల వారికి మాత్రమే పౌరసత్వాన్ని ఇస్తామని చట్టం చేయడం దానికి పునాదిగా ఎన్.ఆర్.సి, ఎన్.పి.ఆర్ లను రూపొందించి ముస్లింలను దేశం నుంచి పంపేస్తామని బెదిరించడం...హిజాబ్, హలాల్ పేర్లతో అల్లర్లు సృష్టించడం ఇవన్నీ కూడా ఆర్.ఎస్.ఎస్ ఎజెండాలో భాగమే. హిందీ - హిందూ - హిందూస్తాన్ అన్నది ఆర్.ఎస్.ఎస్ నినాదం. దేశంలో గుర్తింపు కలిగి కోట్లాది మంది ప్రజలు మాట్లాడే భాషలు 26కు పైగానే ఉన్నాయి. ఇవి కాక చిన్న చిన్న సమూహాల ప్రజానీకం మాట్లాడే భాషలు గిరిజనులు మాట్లాడే భాషలు కలిపితే వందల భాషలు భారత ప్రజానీకం మాట్లాడుతున్నారు. హిందీ భాష తప్ప మిగతా భాషలన్నింటినీ ధ్వంసం చేయాలని ఆర్.ఎస్.ఎస్ ప్రయత్నం. అలాగే భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, సిక్కు, జైన, జొరాస్ట్రియన్ లాంటి మతాలకు చెందిన ప్రజలతో పాటు పై మతాలకు చెందకుండా ప్రకృతి శక్తులను ఆరాధిస్తూ, పూజిస్తూ ఉండే గిరిజన తెగలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఈ మతాలన్నింటినీ అణచివేసి హిందూ మతాధిక్యతను స్థాపించాలనేది ఆర్.ఎస్.ఎస్ లక్ష్యం. అలాగే దేశ విభజన తరువాత పాకిస్తాన్ ఒక మత రాజ్యంగా ఏర్పడినందున తమకు కూడా హిందూస్థాన్ అనే హిందూ మత రాజ్యం స్థాపించాలని ఆర్.ఎస్.ఎస్ ప్రయత్నిస్తున్నది. ప్రపంచంలో మధ్యయుగాల్లో తప్ప ఆధునిక యుగంలో మత రాజ్యాలు మనుగడ సాగించలేవు. ఐరోపా దేశాల్లో అత్యధికం, అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో అత్యధికులు క్రైస్తవ మత విశ్వాసులే అయినా ఆ రాజ్యాలు మత రాజ్యాలుగా లేవు. వాటి రాజ్యాంగంలో సెక్యులర్ వ్యవస్థను నెలకొల్పుతామని రాసుకున్నారు. అమలు చేస్తున్నారు. అరబిక్ దేశాల్లో మత రాజ్యాలుగా కొన్ని చెప్పుకుంటున్నా వాటిలో కూడా క్రమేపీ మార్పులొస్తున్నాయి. పరమత సహనం ఒక విధానంగానే అమలు చేస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్ లాంటి మతోన్మాద ప్రభుత్వాలు గల దేశాలు ఏ అభివృద్ధికి నోచుకోక పతనం వైపు ప్రయాణం చేస్తున్నాయి. భారతదేశంలో మెజార్టీ మతానికి చెందిన ప్రజలతో పాటు ఇతర మతాల ప్రజలు కూడా చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఒక మతం ఆధిపత్యంలో రాజ్య స్థాపన చేసి ఆ మత ధర్మాలను బలవంతంగా అమలు చేయాలని చూస్తే దేశ సమగ్రత ప్రమాదంలో పడుతుంది. దేశంలో ఉండే వందల భాషలను రూపుమాపి ఒక భాష ఆధిపత్యం తేవాలని ప్రయత్నిస్తే కోట్ల మంది ప్రజలు ఈ రాజ్యం యొక్క అస్థిత్వాన్నే ప్రశ్నిస్తారు. అందుకే రాజ్యాంగ నిర్మాతలు జాతీయోద్యమ వారసత్వాన్ని కొనసాగించడానికి మన దేశం ఒక లౌకిక రాజ్యంగా ఉండాలని, సర్వమత సమానత్వాన్ని పాటించాలని, అన్ని భాషలను గుర్తించి గౌరవించాలని రాజ్యాంగంలో ఆ అంశాలను చేర్చారు. అయితే సంఘ్ పరివార్ చేతిలో నేడు రాజ్యాంగం అపహాస్యానికి గురికాబడుతున్నది. ఇతర మతాల ప్రజలందరూ భయం భయంగా బతికే వాతావరణం కల్పించి ప్రజల మధ్య విభజన తేవాలని సంఘ్ పరివార్ భావిస్తున్నది. బాబ్రీ మసీదు కూల్చివేత ఒక గాయమైతే, సంఘ్ పరివార్ చేతిలో భారత రాజ్యాంగం మరెన్నో గాయాలకు గురికావాల్సిన పరిస్థితులు నేడు ఉన్నాయి. లౌకిక వాదులు, ప్రజాస్వామ్య ప్రియులు భారత దేశ సమగ్రతను, సమ భావాన్ని గౌరవించే వాళ్ళందరూ ఏకోన్ముఖంగా రాజ్యాంగ విలువల పరిరక్షణకు లౌకికవాదాన్ని కాపాడుకోవడానికి నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైనది. విస్మరిస్తే మరెన్నో ప్రార్థనా స్థలాలు నేలమట్టం కావడం, మరెన్నో భౌతిక దాడులు మైనార్టీ, దళిత, క్రైస్తవ సోదరులపై జరగడం, ఎందరో అమాయకులు హత్యాకాండకు గురికావడం చూడాల్సి వస్తుందని గమనించాలి.

# గృహహింస వెంటాడుతూనే వుంది...



పరిస్థితులు మారతాయి. ఆ పరిస్థితులు తమ భర్తల ప్రవర్తనను మార్చుతాయని మహిళలు ఆశించారు. ఇతరులకు, ముఖ్యంగా తమ కుటుంబాలకు 'భారం' కావడానికి మహిళలు ఇష్టపడలేదు. 'మా అమ్మకు చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఆమెకంటూ స్వంత జీవితం ఉంటుంది. అందువల్ల ఆమె ఇబ్బందులకు నా ఇబ్బందులు తోడవడం నాకిష్టం లేదు' వంటి సమాధానాలు వారి నోటెంట వచ్చాయి. తామెదుర్కొన్న హింసను నిర్దిష్టంగా చెప్పడం ద్వారా, వారి కుటుంబాలకు ఒక 'సమస్య'గా లేదా 'మానసిక వ్యధ'కు కారణంగా మారకూడదని...వారి కుటుంబాలకు తలవంపులు, అగౌరవం తేకూడదని... గృహహింస నుండి బయటపడిన మహిళలు విద్యా స్థాయి, కులం, వర్గంతో నిమిత్తం లేకుండా భావిస్తున్నారు.అంతర్జాతీయంగా స్త్రీలపై జరుగుతున్న హింసా వ్యతిరేక దినమైన నవంబర్ 25కి కొద్ది రోజుల ముందు జరిగిందా దారుణ ఘటన. ఓ యువతిని తన జీవిత భాగస్వామి హత్య చేసి, ముక్కలు ముక్కలుగా నరికేశాడు. 'భాగస్వాములు చేస్తున్న హింస' గురించి ఈ సంఘటన ఆలోచింపచేసింది. 'గృహహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం-2005' (పి.డబ్ల్యు.డి.వి.ఎ) దీనికి వర్తిస్తుందని కూడా గుర్తించారు. ఆమె తన జీవిత భాగస్వామిగా అతడ్ని ఎందుకు ఎంపిక చేసుకుంది? అతడ్ని ఎందుకు వదిలేయలేదు? లాంటి అనేక రకాల ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సహాయం కోరుతూ ఆమె చేసిన ప్రయత్నాలకు సంబంధించిన సాక్ష్యాలు బయట పడడంతో... ఈ చట్టాలు ఎందుకు అమల్లో లేవన్న సందేహం కలుగుతున్నది. భారతీయ చట్టాలు, నిబంధనల ప్రకారం గృహహింస శిక్షార్హమైన నేరం. ఇది మానవ హక్కుల ఉల్లంఘన కూడా. అయినప్పటికీ, 18-49 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న 32 శాతం మంది వివాహిత మహిళలపై హింస కొనసాగుతున్న సమాజంలో మనం బతుకుతున్నామని ఇటీవల జరిగిన 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5' నివేదిక తెలియజేస్తుంది. ఈ మహిళలు తమ భర్తలు పాల్పడుతున్న భావోద్వేగపూరిత, భౌతిక, లైంగిక హింసలకు గురవుతున్నారు. ఈ గృహహింస బారిన పడే వారిలో పట్టణ ప్రాంత మహిళల కంటే గ్రామీణ ప్రాంత మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఇతర కుటుంబ సభ్యులు పాల్పడే హింస మీద ఈ సర్వే దృష్టి కేంద్రీకరించలేదు.

పి.డబ్ల్యు.డి.వి.ఎ చట్టం వచ్చి పదిహేడు సంవత్సరాలైంది. భర్తల నుండి మాత్రమే కాక ఇతర కుటుంబ సభ్యుల హింస నుంచి కూడా మహిళలకు మద్దతుగా, రక్షణగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ చట్టం హామీ ఇచ్చింది. ఈ చట్టం కాగితాల మీద ఉన్నప్పటికీ, ఇప్పటికీ మహిళలు రక్షణ పొందలేకపోతున్నారు. దాని హామీలు, నిబంధనల అమలు అంతంత మాత్రంగానే వున్నాయి. అత్యంత నిరుత్సాహమైన వాస్తవమేమంటే, మూడింట ఒక వంతు మహిళలు గృహహింస కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ వారిలో కేవలం 14 శాతం మంది మాత్రమే సహాయాన్ని కోరుతున్నారు. ఈ సంఖ్య గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా తక్కువగా ఉంటుందని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే) నివేదిక తెలుపుతున్నది. గృహహింసను నేరంగా పరిగణించే దేశంలో, హింసకు గురవుతున్న మహిళలను రక్షించేందుకు అనేక చట్టాలను రూపొందించిన దేశంలో, గృహహింసకు గురై ప్రాణాలతో బయటపడిన అనేక మంది మహిళలు ఎందుకు సహాయాన్ని కోరడం లేదు ?తాము ఎదుర్కొన్న హింసను ఇతరులతో పంచుకునే, తెలియ చేసే సందర్భంలో...మహిళల భయాలు, ఆటంకాలు, సహాయం కోరే అంశాలను తెలుసుకోవాలన్న లక్ష్యంతోనే మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో మా పరిశోధన సాగింది. హింసిస్తున్న అతడి నుంచి నువ్వు ముందే ఎందుకు దూరంగా రాలేదు? ఇంతకు ముందే గృహహింస గురించి ఎవరో ఒకరికి ఎందుకు చెప్పలేదు? లాంటి మామూలు ప్రశ్నలకు చాలా సంక్లిష్టమైన, పరస్పర విరుద్ధమైన సమాధానాలు వెలువడ్డాయి. పరిస్థితులు మారతాయి. ఆ పరిస్థితులు తమ భర్తల ప్రవర్తనను మార్చుతాయని ఆశించారు. ఇతరులకు, ముఖ్యంగా తమ కుటుంబాలకు 'భారం' కావడానికి మహిళలు ఇష్టపడలేదు. 'మా అమ్మకు చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఆమెకంటూ స్వంత జీవితం ఉంటుంది. అందువల్ల ఆమె ఇబ్బందులకు నా ఇబ్బందులు తోడవడం నాకిష్టం లేదు' వంటి సమాధానాలు వారి నోటెంట వచ్చాయి. తామెదుర్కొన్న హింసను నిర్దిష్టంగా చెప్పడం ద్వారా, వారి కుటుంబాలకు ఒక 'సమస్య'గా లేదా 'మానసిక వ్యధ'కు కారణంగా మారకూడదని...వారి కుటుంబాలకు తలవంపులు, అగౌరవం తేకూడదని... గృహహింస నుండి బయటపడిన మహిళలు విద్యా స్థాయి, కులం, వర్గంతో నిమిత్తం లేకుండా భావిస్తున్నారు. గృహహింసకు గురైన మహిళలు సహాయం కోరే విషయంలో రెండు రకాలుగా స్పందిస్తున్నారు. మొదటిది, హింస జరిగిన ఆరు నెలల్లోపు చెప్పేవారు. రెండవది హింస జరిగిన ఐదు సంవత్సరాలు లేదా ఆ తర్వాత చెప్పేవారు. మొదటి సమూహానికి చెందిన మహిళలు సహాయం కోసం తమ తల్లిదండ్రుల దగ్గరకెటళ్ళారు. భర్తతో సర్దుకుని పోవడం ద్వారా కుటుంబాన్ని/సంసారాన్ని కాపాడాల్సిందిగా తమ కుమార్తెలను ఒత్తిడి చేసిన కేసులు అనేకం. 'కుటుంబ సంతోషం' కంటే కూతురు క్షేమానికే ప్రాధాన్యత ఇచ్చిన కేసులు తక్కువగా నమోదయ్యాయి.

అలాంటి కేసుల్లో మధ్యవర్తిత్వం వహించే చర్యలు చేపట్టడం లేదా తెగతెంపులు చేసుకోవడం జరిగాయి. సమస్య పరిష్కారానికి పోలీసులు, లాయర్లను కలవడం లాంటివి చాలా అరుదుగా జరిగాయి. గృహహింసకు గురై దాని నుండి బయటపడిన చాలా కాలానికి సహాయం కోరే వారి విషయానికి వస్తే...హింసకు సాక్షులుగా ఉన్న బంధువులు, ఇరుగు పొరుగు వారి (పరిస్థితులను మార్చడంలో) ప్రాధాన్యత చాలానే వుంది. బాధితురాలి పిల్లల సంరక్షణ, భర్త వివాహేతర సంబంధాన్ని గుర్తించడం, హింస తీవ్ర స్థాయిలో వున్నప్పుడు వైద్య సహాయం అందించడంలో వారి పాత్ర చాలా కీలకంగా వుంది. స్త్రీ యాజమాన్యానికి సంబంధించిన పితృస్వామిక నిబంధనలు, ఆర్థిక అభద్రత కారణంగా తెగతెంపులు చేసుకునే విషయమై ఎదురైన మానసిక సంఘర్షణల కారణంగానే...బాధితురాలు సహాయం కోరడానికి అంతకాలం ఎదురుచూసి ఉంటుంది.స్త్రీపురుష అసమానతల విషయంలో సామాజిక నియమాలు ఎంత లోతుగా పాతుకుపోయాయంటే భార్యను కొట్టే విషయాన్ని పురుషుల కంటే మహిళలే ఎక్కువగా సమర్థిస్తారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 నివేదిక తెలియజేస్తున్నది. 'మా మీద పెట్టే షరతులు ఎలా వుంటాయంటే... మేము ఎలాంటి బాధను గురించైనా ఫిర్యాదు చెయ్యలేనంత కష్టంగా ఉంటాయ'ని ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మహిళ చెప్పింది. బాధిత మహిళలు తాము ఎదుర్కొన్న గృహహింస గురించి మిత్రులు, బంధువులకు చెప్పుకున్న తర్వాత 'ఉపశమనం పొందినట్లు, భారమంతా తగ్గినట్లు, పరిస్థితులు మారిపోతాయానే ఒక కొత్త ఆశ కలిగిన భావన పొందినట్లు చెప్పారు. మహిళలు గృహహింస గురించి ఇతరులతో పంచుకోవాలని అనుకోవడమే వారు తీసుకునే అత్యంత ముఖ్యమైన నిర్ణయం. సాయం, మద్దతు పొందడంలో వారు అనిశ్చితి, భయం, నిరాశ, నిస్పృహలకు లోనుకావాల్సి వచ్చింది. భారతదేశంలో ఉన్న వాస్తవ పరిస్థితి ఏమంటే అనేకమంది మహిళలు తమ గోడును వెళ్ళబోసుకోడానికి ఎటువంటి వేదిక లేదు. కేవలం ధనవంతులైన కొందరు మహిళలు, స్వచ్ఛంద సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్న కొద్దిమంది మహిళలు మాత్రమే కోర్టుల ద్వారా న్యాయం కోసం ప్రయత్నం చేశారు. కొత్త నైపుణ్యాలను, జీవనాధార అవకాశాలను సాధించడం ద్వారా ఆర్థిక స్వావలంబన పొందడంతో గృహహింస బాధితు లు కొంతవరకు తమ పరిస్థితులను మార్చుకోగలుగుతారు. తాము ఎదుర్కొన్న గృహహింస గురించి పోలీసులకు చెప్పినప్పుడు వారు స్పందించిన తీరు పట్ల మహిళలు పెదవి విరిచారు. ఏదో కొద్దిమంది అనుకూలమైన ఫలితాలు పొందినప్పటికీ...'హింసకు పరిష్కారం చూపడం కంటే కూడా అసలు సమస్యలో పోలీసుల పాత్ర ఎక్కువైంద'ని మేము ఇంటర్వ్యూ చేసిన మెజారిటీ మహిళలు చెప్పారు. పోలీసులే బాధిత మహిళలను హింసకు పాల్పడిన వారితో రాజీ చేశారు. వారిని తిరిగి అదే ఇళ్లకు పంపించారు. అధికారికంగా ఫిర్యాదు నమోదు చెయ్యకుండా లేదా పిడబ్ల్యుడివిఏ మార్గదర్శకాల ప్రకారం సంరక్షణ అధికారులకు అప్పజెప్పకుండా హింసకు పాల్పడిన వారిపై హింసను ప్రయోగించినట్లు మేము అనేక రాష్ట్రాల్లో విన్నాం.

# ఇద్దరు మోసగాళ్లు



**జరిగిన కథ : వీరప్రతాపుని నలుగురు కుమారులు పెళ్లిళ్లు చేసుకోవడం కోసం దేశాటనకు బయలుదేరారు. విజయుని భార్యను భానుడు ఎత్తుకుపోయాడు. శ్రీశైలం కదళీవనంలోని స్ఫటికలింగ మహత్వం వల్ల చంద్రుడు ఒక యక్షకన్యను వివాహం చేసుకున్నాడు. అతనికి దారిలో కనిపించిన రాముడు.. తన కథ చెబుతున్నాడు. దొంగగా మారిన రాముడు తన భార్యనే తోడుదొంగగా చేసుకుని, విక్రమార్కుని అంతఃపురంలో దొంగతనానికి వెళ్లాడు. ఆమె దొరికిపోయింది. కానీ, నా గురించి ఏమీ చెప్పలేదట. విక్రమార్క మహారాజు ఎన్ని విధాలుగా అడిగినా.. నోరు మెదపలేదని తెలిసింది. మూగదానిలా నటించసాగిందట.**

'నిన్ను దొంగతనానికి పురికొల్పిన వారెవరో చెబితే, వాళ్లను పట్టుకుని నిన్ను విడిచిపెట్టేస్తాను' అని మహారాజు ఎన్నిసార్లు ప్రోత్సహించినా చెప్పింది కాదట. దాంతో విసిగిపోయిన విక్రమార్కులవారు.. ప్రతిరోజూ రుచిరను సభాభవనంలో నిలబడమని చెప్పాడు.'ఈమె చేత ఎవరైనా మాట్లాడిస్తే ఏం కోరినా ఇస్తాను" అని ప్రకటించాడట. ఎంతోమంది ప్రయత్నించారని తెలిసింది. కానీ, ఎవరికీ ఆమె బదులు చెప్పలేదు. తన తోటిదొంగనైన నా గురించి ఎన్నిసార్లు అడిగినా.. ఆకాశం కేసి వేలు చూపిస్తూ మౌనంగా ఉండిపోతున్నదట. ఆమెను విడిపించి తెచ్చే ఉపాయం కోసం అన్వేషిస్తూ ఉండగా నువ్వు కనిపించావు.. ..అని రాముడు తన కథ చెప్పాడు.నేను అతనికి ధైర్యం చెప్పి.. "అన్నా! విచారించకు. నీ రుచిరను నేను విడిపించి తెస్తాను" అని వాగ్దానం చేశాను.మరునాడు విక్రమార్కులవారి సభకు వెళ్లి, ఆమెతో మాట్లాడిస్తానని ప్రతిజ్ఞ చేశాను."వదినా! రాముడు నాకు అన్నగారు. నేను నిన్ను విడిపించడానికే వచ్చాను. నువ్వు ఒక్కసారి మాట్లాడితే చాలు.. నీ విడుదలే ప్రతిఫలంగా కోరుకుని, నిన్ను అన్న దగ్గరికి తీసుకుపోతాను" అని ఆమె చెవిలో చెప్పాను.

మహారాజుగారి దిక్కు తిరిగి.. "మీరడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి ఇప్పుడీమె సిద్ధంగా ఉన్నది" అన్నాను.

అప్పుడాయన.. "అమ్మాయీ! నువ్వెవరు?" అని అడిగాడు.

అందుకామె.. "ఆడపిల్లను" అని సమాధానమిచ్చింది.

"ఎవరి కూతురివి?".

"జనకుని కూతురిని".

"ఎవరి భార్యవు?".

"జగదభిరాముని భార్యను".

ఆమె సమాధానాల్లోని శ్లేషను అర్థం చేసుకోవడానికి సభాసదులందరూ తికమకపడుతుండగా.. నేను లేచి, "మహారాజా! మీరు చెప్పినట్లే ఆమెతో మాట్లాడించాను. మరి నా అభీష్టం నెరవేర్చరా?" అని అడిగాను.

"మాట తప్పేవాణ్ని కాను. ఏం కావాలో కోరుకో" అన్నాడు మహారాజు.

"మరో ప్రశ్న వేయకుండా ఆమెను విడిచిపెట్టేయండి. అదే నా కోరిక" అని కోరుకున్నాను. అంతటితో ఆమెను తీసుకుని బయటికి వచ్చేశాను. రహస్యంగా రాముణ్ని కలుసుకుని, ముగ్గురం ఉజ్జయిని నుంచి వెళ్లిపోయాం. ఆ తరువాత కూడా రాముడిలో దొంగతనాలు చేసే బుద్ధి పోలేదు. ఒకటి రెండుసార్లు నాకే పట్టుబడ్డాడు. అతనికి ఏదో విధంగా నచ్చజెప్పి, మంచిదారికి తీసుకురావాలని ప్రయత్నించాను.

"అన్నా! నువ్వు సహవాస దోషం వల్ల దొంగతనాలకు అలవాటు పడ్డావు. ఇకనైనా ఇటువంటి పనులు మానేయ్. ఆ రుచిరను వదిలేసి వేరొక పిల్లను పెళ్లి చేసుకో. అప్పుడు నీ బుద్ధి మారవచ్చు" అని చెప్పాను.

దానికి రాముడు అంగీకరించినట్లే కనిపించాడు.

"నేనొక యక్షకన్యను పెళ్లాడానని చెప్పాను కదా! ఆమె చెలికత్తె మల్లిక.. చాలా చక్కనిది. నువ్వొప్పుకొంటే మీ ఇద్దరికీ నేను పెళ్లి జరిపిస్తాను" అని చెప్పాను. రాముడు దానికి "సరే!" అన్నాడు.నేను వీణ తీసుకుని నిర్దేశిత రాగాన్ని వాయించాను. చెప్పినట్లుగానే చారుమతి ప్రత్యక్షమైంది. కానీ, పక్కనే రాముడు ఉండటం చూసి వెగటు చెందింది."పరపురుషులు ఉండగా నన్ను పిలవకూడదు" అని హెచ్చరించి, వెనువెంటనే మాయమైపోయింది. నేను చేసేది లేక మిన్నకుండిపోయాను.ఆనాటి సాయంత్రం పట్టణంలో సంచరించి, సత్రానికి తిరిగి వస్తుండగా.. రాముని గదిలో నుంచి వినిపించిన మాటలు నన్ను ఆశ్చర్యానికి గురి చేశాయి.

"చూశావా! మనిద్దరం చిలకా గోరింకల్లా ఉండటం వాడికిష్టం లేదు. తన పెళ్లాం దగ్గరి దాసీదాన్ని తెచ్చి నాకు కట్టపెడతానంటున్నాడు. సవతి తల్లి పిల్లలకు ఇంతకంటే ప్రేమ ఉంటుందా?! ఆ మాత్రం తెలివితేటలు నాకు లేవనుకుంటున్నాడు.." అంటున్నాడు రాముడు.

వాడి మాటలు నాకు అనుమానం కలిగించాయి. ఎందుకైనా మంచిదని నేనారోజు నిద్రించే ప్రదేశాన్ని మార్చాను. తెల్లవారి లేచి చూసేసరికి నా గదిలో నిద్రించినవాడు హత్యకు గురయ్యాడు. ఆ పక్కనే ఉండాల్సిన నా వీణ కూడా లేదు. అప్పటినుంచి రాముణ్ని వెతుక్కుంటూ తిరుగుతున్నాను.. .. అని చంద్రుడు తన కథంతా చెప్పాడు.

"అన్నా! దైవవశాత్తూ నువ్వు కనిపించావు మనిద్దరం సోదరుల మూలంగానే భార్యలు లేనివాళ్లమయ్యాం" చివరిగా అన్నాడు. అందుకు విజయుడు.. "భార్య లేని జన్మ వృథా! ఆమె లేని ఇల్లు పొల్లు. భార్యకు ప్రియాన్ని చేకూర్చడమే భర్తకు ఆనందం. భార్యను పోగొట్టుకోవడం దురదృష్టకరం" అన్నాడు. ఆ అన్నదమ్ములిద్దరూ ఒకరినొకరు ఓదార్చుకున్నారు. కొన్నిరోజుల తరువాత విజయుడు తాను కొంతకాలం ప్రధానమంత్రిగా పనిచేసిన భీమవర్మ రాజ్యంలోని.. విజయపురమనే పట్టణానికి వెళ్లారు. అక్కడ విజయుడే స్థాపించిన సత్రంలో విడిది చేశారు. ఆ సత్రానికి ముందు భీమవర్మ మహారాజు తన పేరుతో వేసిన శాసనాన్ని చూసి, విజయుడు మురిసిపోయాడు. సత్రంలోకి ప్రవేశిస్తుండగా ఒక గదినుంచి ఒక సంభాషణ వినిపించింది."అన్నా! వాళ్లిద్దరికీ మనమంటే ముందునుంచీ అసూయే! నేను ఈ అమ్మాయితో ఉండటం ఇష్టం లేక, నాతో ఏమేమిటో చెప్పాడు. మనసిచ్చి పెళ్లాడిన ప్రియురాలిని విడిచిపెట్టడం ఎంత కష్టమో నువ్వే చెప్పు. అదీకాకుండా విక్రమార్కుడు ఎన్ని కష్టాలు పెట్టినా, నా పేరు చెప్పనే లేదు! అలాంటి పిల్లను ఎలా విడిచిపెట్టను!".

"అదీ నిజమే! ఆశ్రితులైన వారు ఎటువంటివారైనా విడిచిపెట్టకూడదని నీతి. మంచిపని చేశావు".

"పోనీ.. తాను నాకిచ్చి పెళ్లి చేస్తానన్న యువతి మాత్రం గొప్పదా?! తన భార్య వద్ద దాసీ పని చేసేదట. అంటే ఆ భార్యాభర్తలిద్దరికీ మేమిద్దరం దాసులం కావాలని వాడి బోడి అభిప్రాయం".

"ఇంతకీ వాడి భార్యను చూశావా? అందంగా ఉంటుందా?!".

"ఆఁ ఎర్రగా బొర్రగా ఉండగానే సరా?! అయినా నేను సరిగ్గా చూడలేదులే".

"పోనీ! ఆ వీణ మీటి రప్పించలేకపోయావా?!".

"అయ్యో! పడరాని పాట్లన్నీ పడ్డాను. కానీ, ఆ వీణమెట్లు సవరించడమే చేతకాలేదు".

"మరి దాన్నేం చేశావు?!"."తవ్వెడు బియ్యం అవసరమై, ఎవరో ఓ బ్రాహ్మణునికి అమ్మేశాను".

"అతణ్ని నువ్వు గుర్తుపట్టగలవా?".

"ఊహూఁ గుర్తుపట్టలేను".

"ఇంతకీ నువ్వా వీణ ఎత్తుకొచ్చిన సంగతి చంద్రునికి తెలుసా?!".

"తెలిస్తే ఊరుకుంటాడా?! వాణ్ని మట్టుపెట్టిన తరువాతే వీణ ఎత్తుకొచ్చేశాను".

"మంచిపని చేశావు. ఇద్దరమూ వీరపురుషులమే".

"అంటే నువ్వు కూడా విజయుణ్ని హతమార్చావా?! అన్నట్లు వాడి భార్య హేమను ఎత్తుకుపోయానని చెప్పావు కదా! ఆ తరువాత ఏమైంది?!".

"వాణ్ని ఒక్కదెబ్బతో కైలాసానికి పంపాను. కానీ, ఏం లాభం?! ఆ మొండిది నా మాట వినలేదు".

"ఏ అడవికో తీసుకుపోయి.. చెర పట్టవలసింది".

"ఆ పనే చేశాను. చంపుతానని బెదిరించినా.. నా మాట లెక్క చేయలేదు. చివరికి చిరాకేసి ఓ నూతిలో తోసేశాను".

"చచ్చిందా?". "ఏమో తెలియదు. అదే సమయానికి ఎవరో ఒక బ్రాహ్మణుడు స్నానం కోసం బావి దగ్గరికి వస్తుంటే, నేను పారిపోయి వచ్చేశాను".

"మంచిపని చేశావు. వాళ్ల పీడ విరగడైనట్లే! ఇక మనం ఇంటికిపోయి, హాయిగా రాజ్యం చేసుకోవచ్చు".

"నిజమే కానీ, నేనొక్కణ్నే వస్తే తండ్రిగారు ఆక్షేపించవచ్చు. ఎవరో ఒక స్త్రీని ఎన్నుకుని పెళ్లాడాలి"."ఈ ఊళ్లో నీకు నచ్చిన అమ్మాయిని ఎన్నుకో. రాత్రికి నేను, మీ వదిన కన్నం వేసి.. ఆ అమ్మాయిని ఎత్తుకొచ్చేస్తాం. పెళ్లి చేసుకుని, ఇంటికి తీసుకుపోవచ్చు". .. ఆ తరువాత గదిలో నుంచి ఒకటే నవ్వులు వినిపిస్తున్నాయి. వాళ్లిద్దరూ భానుడు, రాముడు అనే విషయం.. గదిబయట నుంచి వింటున్న విజయునికి, చంద్రునికి స్పష్టంగా అర్థమైంది. వీణ పోయినందుకు చంద్రుడు.. నూతిలో పడిన హేమ బతికుందో లేదోనని విజయుడు ఎంతగానో విచారించారు. అప్రయత్నంగా వారి కళ్లవెంట నీళ్లు వచ్చాయి. విజయుడు కన్నులు తుడుచుకుంటుంటే.. చూడలేక చంద్రుడు ఒరలోంచి కత్తి తీశాడు."వద్దు తమ్ముడూ! ఎంతైనా మనమందరం ఒక తండ్రి కడుపున పుట్టాం. మనకు ద్రోహం చేసినా సరే, వాళ్లను మనం చంపవద్దు" అని వారించాడు విజయుడు.చంద్రుడు అప్పటికి తన కోపాన్ని అదుపు చేసుకున్నాడు. తెల్లవారింది. సత్రం బయట నలుగురు అన్నదమ్ములూ ఒకరికొకరు ఎదురుపడ్డారు. తమకు చేసిన ద్రోహాన్ని మరిచిపోయి విజయుడు, చంద్రుడు తమ సోదరులను కుశల ప్రశ్నలు అడిగి, కౌగిలించుకున్నారు.భానుడు సమయోచితంగా.. "ఆనాడు నువ్వు, వదిన దూరంగా ఉన్నారు. రాత్రివేళ అకస్మాత్తుగా ఒక పులి నామీద పడింది. నేను దాన్నుంచి తప్పించుకోవడానికి చాలాదూరం పరుగెత్తాను. రెండురోజుల తరువాత భయం తగ్గి నేను తిరిగి వచ్చేసరికి మీరు కనిపించలేదు. అన్నా! వదినగారు క్షేమంగా ఉన్నారా?!" అని ప్రశ్నించాడు.

రాముడు అంతకంటే తెలివిగా చంద్రునితో.. "తమ్ముడా! ఆనాడు సత్రంలో నువ్వు వేరొక గదిలో నిద్రిస్తున్నావు. అర్ధరాత్రివేళ రాజభటులు సోదాలు జరిపారు. మమ్మల్ని పట్టుకోవడానికే వచ్చారనిపించి, మేమిద్దరం పారిపోయి వచ్చేశాం. ఆ తరువాత నీ క్షేమ సమాచారం తెలుసుకోవడం సాధ్య పడలేదు. దైవవశాత్తూ నిన్ను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది" అన్నాడు.

ఆ ఇద్దరు మోసగాళ్ల మాటలకు సమాధానం ఏం చెప్పాలో తెలియక.. విజయుడు, చంద్రుడు మౌనంగా ఉండిపోయారు.

రెండుమూడు రోజుల తరువాత విజయుడు తమ్ముళ్లందరినీ పిలిచి..

"మనం ఇంటినుంచి వచ్చి, చాలాకాలం అయింది. ఇక ఇంటికి పోదాం" అన్నాడు. అతని మాటలకు చంద్రుడు సమ్మతించాడు. కానీ, మిగిలిన ఇద్దరూ మరికొంతకాలం దేశాటనం చేద్దామన్నారు.

విజయుడు అన్యాపదేశంగా వారిని మందలించాడు. దాంతో ఆ మోసగాళ్లిద్దరూ రహస్యంగా మాట్లాడుకుని ఒక పథకం రచించుకున్నారు. ఆ రహస్యాన్ని విజయునికి, చంద్రునికి తెలియకుండా జాగ్రత్త పడ్డారు.

అడవి మార్గం మీదుగా నలుగురు అన్నదమ్ములూ.. రుచిరతో కలిసి నడిచి వెళ్తున్నారు. దారిమధ్యలో భోజనం కోసం ఓ చెట్టుకింద ఆగారు. సమీపంలోని బావి నుంచి నీరు తోడి తేవడానికి వెళ్లిన రుచిర.. కొద్దిసేపటికే పెద్దగా కేకలు పెడుతూ వెనక్కి తిరిగి వచ్చింది.

"ఆ బావిలో ఇద్దరు స్త్రీలు మునుగుతూ, తేలుతూ కనిపిస్తున్నారు. ఎవరో తెలియడం లేదు. ప్రమాదంలో ఉన్నారో, క్రీడిస్తున్నారో చెప్పలేను" అన్నది. ఆమె మాటలు విన్న నలుగురు అన్నదమ్ములూ ఒకేసారి బావివైపు నడిచారు.

# సకలకళా.. వల్లభన్!



అప్పట్లో ఈ ఫెన్సింగులూ, కోట గోడలూ ఏవీ ఉండేవి కావు. మమ్మల్ని చూసి.. "సక్కని తల్లులు! మా ఇంటికొచ్చిన్రు" అంటూ మాకేదైనా తినడానికి పెడదామని వాళ్లు తాపత్రయపడేవారు. మాకేమో ఇంట్లో.. "ఎవరింటికి బోయినా లేకిగ జెయ్యొద్దు! వాళ్లు 'ఏం బెడ్తరా? ఎప్పుడు బెడ్తరా?' అని చూడొద్దు!" అని సూక్తి ముక్తావళి బోధించేది అమ్మ. ఈ పెరటింటి వాళ్లు మక్కజొన్న పేలాలో, పల్లీలో వేయించి.. పొట్లు చెరిగి మాకు పెట్టేవారు పాపం! మేం శుభ్రంగా తిని వాళ్లు దారి చూపిస్తే వెనక్కి వచ్చేవాళ్లం. ఇంతకూ ఆ పల్లీల రుణం మేం చాలా ఏళ్లపాటు బదులు తీర్చుకోవాల్సి వస్తుందని మాకు అప్పుడు తెలియలేదు.ఆ తరువాత కొన్నేళ్లకు నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు.. మేము కొత్తింటికి మారాక, వాళ్ల పెద్దకొడుకు మా ఇంటి ఎదురుగా పశువుల కొట్టంలోకి మారాడు. "మీ నాయనదీ నాదీ ఒకటే వయసు! సందమామ లెక్కున్నడని మీ నాయినను జూసొచ్చినంక మా అవ్వకు నేను పుట్టిన్నట.

అడివి పనికి పొయ్యి గిట్లయిన గనీ.. నేను సుత తెల్లగనె ఉంటి. నాగ్గూడ గదేపేరు పెట్టిన్రు" అనేవాడు. రంగు మాట ఎలా ఉన్నా.. మా నాన్న తదియ నాటి చంద్రుడైతే, ఇతను పౌర్ణమి చంద్రుని సైజు. ఎత్తుగా, లావుగా.. పహిల్వాన్‌లా ఉండేవాడు.ఈ పెద్దమనిషికి ఎన్ని విద్యలొచ్చో లెక్కేలేదు! నాటు వైద్యుడు. పాములూ, ముంగిసలూ పట్టేవాడు. కులంలో పంచాయితీలు తీర్చేవాడు. పొగాకుతో చుట్టలు చుట్టేవాడు. నులకతాళ్లు పేనేవాడు. అతనికి మంత్ర తంత్రాలొచ్చని ఊళ్లోవాళ్లు భయపడేవాళ్లు. కానీ, మా ఇంట్లో అవేవీ నమ్మకపోయేవాళ్లం గనుక.. ఆ విద్య మా ముందు ప్రదర్శించే అవకాశం రాలేదు.

ఒక్కోసారి ఉదయన్నే మేం ఇంకా లేచి ముఖాలు కడుక్కోకముందే.. ఆ నాటువైద్యుడి క్లినిక్ ప్రారంభం అయ్యేది. బర్రె ముందు రెండు కాళ్లకూ, వెనక రెండు కాళ్లకూ విడివిడిగా కలిపి తాళ్లు కట్టి.. అమాంతం పడేసేవాళ్లు.. అది భయంకరంగా అరుస్తుంటే.. మన డాక్టర్ గారు ఎర్రటి నిప్పుల్లో కాల్చిన ఇనుప సీకుతో దానికి ఏ భాగంలో నొప్పి ఉందో అక్కడే కాల్చేవాడు. మరోసారి ఓ పెద్ద చాకు తీసుకుని సర్రుమని కోసేవాడు. అది అరుస్తుంటే.. ఏదో ఆకు పసరు చేత్తోనే నలిపి ఆ గాయం మీద పోసేవాడు. "ఆఁ! మరిగింత దాన్క ఎందుకు దెచ్చుకున్నవ్? నీ ఇంటికేమన్న వస్తినా? నువ్వే నా ఇంటికొస్తివి!" అనేవాడు. అదే పేషెంట్ ఆవు అయితే.. "ఏందే శెల్లె! పాలెందుకు ఎక్వ ఇస్తలేవే!" అని చాలా క్యాజువల్‌గా నవ్వుతూ ఉంటే.. ఆ ఆవు కళ్లలో నీళ్లతో చూసేది.

మరుసటి రోజు ఆ కొట్టంలోంచి గావు కేకలు వినిపించాయి. 'ఏమిటా!?' అని చూస్తే.. ఓ యువకుణ్ని క్రితంరోజు ఎద్దును పడుకోబెట్టిన చోటే పడుకోబెట్టి వైద్యం చేస్తున్నారు. అదేమిటో.. ఈయనగారు మనుషులకూ, పశువులకూ ఒకేలా వైద్యం చేసేవాడు. పశువును కట్టేసి.. వెదురు బొంగుతో కషాయం పోసినట్టే.. మనుషుల్ని గట్టిగా పట్టుకుని మందు తాగించేవాడు. ఏదైనా నొప్పి ఉందని వస్తే.. అన్నీ అవయవాలనూ.. ముందుకూ, వెనక్కీ విరిచి.. తొక్కీ, మెలిపెట్టీ, గోధుమపిండిలా పిసికి పెట్టేవాడు. చిన్నప్పుడు విన్న కథల్లో.. యమలోకంలో శిక్షలు కూడా ఇంత ఘోరంగా లేవనిపించేది మాకు.

మా ఇంటి ఆవరణలోకి అప్పుడప్పుడూ పాములు వచ్చేవి. మాకు భయం వేసి వెంటనే.. మన సకల కళా వల్లభన్ గారిని పిలిచేవాళ్లం. ఆయన తాపీగా.. "ఆఁ! వొచ్చినాది?" అనుకుంటూ ఇనుప సీకు పట్టుకుని వచ్చేవాడు. పామును మెడ దగ్గర పట్టుకుని, గిరాగిరా తిప్పి నేలకేసి కొట్టి చంపేసేవాడు. ఆ తరువాత.. "ఇగ వంద రూపాయలియ్యండి! నా కోసం గాదు.. గీమె నోట్లె రాగి పైస పెట్టి దానం జెయ్యాలె. అటెంక నేను ప్రాయచ్చిత్తం చేసుకోవాలె" అనేవాడు. మొదట్లో వంద ఉన్న చార్జీ.. రానురానూ వెయ్యి రూపాయలు అయ్యింది. అంతేకాదు.. పాములు రావడం ఫ్రీక్వెన్సీ కూడా పెరిగింది. ఒక్కోసారి "ఒక్క రెండు వందలు బదలు ఇస్తరా!? మల్ల రెండు దినాలు అయినంక ఇస్త" అంటూ వచ్చేవాడు. మనం డబ్బు లేదంటే.. "ఈ నడ్మ పాములొస్తలేవా?" అనడిగేవాడు. అదేం ఖర్మో గానీ.. తెల్లారేసరికే మా ఇంట్లో పాము కనిపించేది. ఆయన్ని పిలవక తప్పేది కాదు. వెయ్యి ఇవ్వక తప్పేదీ కాదు. ఓసారి ఇలానే.. ఎవరింట్లోనో పాము వచ్చిందని ఈయన్ని పిలిచారట. పామును పట్టాక.. అడిగినంత డబ్బు ఇవ్వలేదని, "అయితే మీరే ఉంచుకోండి!" అంటూ చేతిలోని పామును మళ్లీ చెట్లల్లోకి వదిలి వెళ్లిపోయాడట. వాళ్లు ఆ రాత్రంతా నిద్రపోక.. తెల్లారి మళ్లీ పూర్తి సొమ్ము ఇచ్చాకే పామును పట్టాడట. మరోపక్క నాటు వైద్యానికి జనం రావడం తగ్గిపోయి, పాములు పట్టడమే ప్రధాన వృత్తి అయ్యింది మన సకలకళా వల్లభన్‌గారికి. మేం ఎప్పుడైనా ఎదురు పడితే.. "వందో.. రెండొందలో ఇచ్చి పోరాదమ్మా!" అని అడిగేవాడు. పాము రావడం, టెన్షన్, వెయ్యి రూపాయలివ్వడం.. దీనికన్నా రెండొందలివ్వడం మంచిదనే అభిప్రాయానికి వచ్చి డబ్బులు ఇచ్చేవాళ్లం. కొన్నాళ్ల తరువాత మా పిల్లల్ని కూడా డబ్బులు అడిగేవాడు. "అమ్మా! ఇవ్వాళ టోల్ గేట్‌కు ఇరవై రూపాయలు ఖతం!" అనేవాడు మా చిన్నబ్బాయి. నాటువైద్యుడు కాస్తా.. 'టోల్ గేట్' బిజినెస్ మొదలుపెట్టాడని నవ్వుకున్నా.. మళ్లీ ఎందుకో జాలేసేది.

# కట్టెలకు పోయిన పెండ్లానికి బంగారం ముల్లె దొరికింది..

## మొగనికేమో ఆకిట్ల లడ్డూల వాన పడ్తంది అని జెప్పింది



ఒక ఊళ్లె ఇద్దరు ఆలుమొగలు ఉండెటోళ్లు. పెండ్లాం జరంత ఇకమతు ఉన్నామెనే. కనీ.. పెనిమిటి అట్టి అమాయకుడు. పరమానందయ్య శిష్యులసోంటోడు. 'ఉన్నవా అంటే.. ఉన్నట్టే!' దప్ప.. ఏం దెల్వని పిసోడు. పాపం, ఆమెనే ఎట్లనో ఒల్లు సవరిచ్చుకత్తంది. ఈని పిసతనాన్ని సవరియ్యక.. పనిచ్చినోళ్లు అందరు పరేషానయ్యే టోళ్లు. ఒక్కపారి పనిచ్చినోడు మల్ల దగ్గరికి రానిచ్చేది గాదు. ఈని అమాయకం అందరికీ మూడుకత్తుండె. ఇగ ఇట్లయితే గాదని.. పెనిమిటిని ఇంట్లుంచి పెండ్లామే పనికి వోతుండె. పని దొర్కన్నాడు.. అడివికి వోయి కట్టెలు గొట్టుకచ్చి సంతల అమ్ముతుండె.ఆమె ఒకపారి ఎప్పటితీర్గనే కట్టెలుదేను అడివికి వోయింది. ఎండిన శెట్టు జూసి కొడుదామని దగ్గరికి వోంగనే.. ఆ శెట్టు తొర్రల ఒక ముల్లె కానచ్చింది. ముల్లె ఇప్పి సూడంగనే కండ్లకు నమ్మకం గాలే. అండ్ల బంగారం, అజ్రాలు, ముత్యాలు, పగుడాలు ఉన్నయి. అటీటు సూశింది. ఆడ ఎవ్వలు గనిపియ్యలే. దేవుడిచ్చిండనుకుని ముల్లె దీస్కోని ఇంటికి వోయింది. మొగనికి సూయించి.. "ఇవ్వి అమ్ముకుని ఏదన్న పని వెట్టుకుంటె మన దరిద్రమంత వోద్ది!" అని జెప్పి, ముల్లెను దాశి పెట్టింది. "అట్లనే!" అన్నడాయినె. నడిరాత్రి ఆమెకు తెలివైంది. 'ఈ ముచ్చట ఎట్లనన్న అందరికి ఎరుకైద్ది.. పిసోడు ఎవలకన్న శెప్పక వోడు' అనుకుంది. ఎట్లనన్న ఇకమతు జేయా లని సోచాయించింది. శిటుక్కున నిద్రవోతున్న మొగన్ని లేపింది. "ఏమయ్యో! ఏం మొద్దు నిద్రవోతున్నవ్ లెవ్వు! అగో సప్పుడు ఇనత్తందా..? ఆకిట్ల లడ్డూల ఆన వడ్తాంది" అని జెప్పింది. కడుపునిండ దిని పనీపాట లేక పన్నడాయె. నిద్ర మబ్బుల్నే.. "సరే.. అట్లనే" అనుకుంట గుర్రువెట్టి మల్ల నిద్రవోయిండు.

రోజులు గడువవట్టె.. ఈల్లు నగలమ్ముకుంట బతకవట్టిండ్లు. అయినా అనుమానం రావద్దని ఎప్పటోలె ఆమె అడివికి వోయి.. కట్టెలు దెత్తనే ఉన్నది. అయినా సుట్టుపక్కోల్లకు ఈ ఇద్దరాలు మొగల మీద అనుమానం అచ్చింది. ఆమె ఎట్లన్నా జెప్పదని ఎర్కనేనాయె! ఆమె ఇంట్ల లేంది జూశి.. సుట్టుపక్కోల్లు ఆనితోని మాట ముచ్చట గలిపిండ్లు. "మునుపటి కంటె మంచిగ బతుకుతాండ్లు! పైసలు ఎక్కడియి!" అంట అడిగిండ్లు. దానికాడు.. "మాకు అడివిల బంగారం ముల్లె దొరికింది. అండ్లకెల్లి అమ్ముకుంటున్నం" అని జెప్పిండు. అసలు ముచ్చట ఎరుకై.. అందరు ఆశ్చర్యంల వడ్డరు. "ఆ ముల్లె ఎప్పుడు దొరికింది" అంట మల్ల అడిగిండ్లు. మస్తు సేపు యాజ్జేసుకోంగ యాదికచ్చింది. ఎంటనే.. "ఆ యాది కచ్చింది. మాకు లడ్డూలు దొర్కిన్నాడు.. నడిమి రాత్రి లడ్డూల ఆన వడ్డది. ఆనాడె దొర్కినయ్" అంట జెప్పిండు. ఆని ముచ్చటిన్నోల్లు.. 'నగల్లేవు, గిగల్లేవు.. పిసోడు!' అనుకుని నవ్వుకుంట ఎల్లిపేయిండ్లు. ముందుగాల్నె జాగర్త వడ్డందుకు.. ముచ్చట దెలిశిన పెండ్లాం పానం కూనం వడ్డది.

# సాగులోకి సరికొత్త పంట.. తక్కువ నీరు, ఎక్కువ లాభం

జొన్న, తెల్లజొన్న, ఎర్రజొన్న, పచ్చజొన్న.. ఒకప్పుడు మన పల్లెల్లో విరివిగా కాసిన ఈ జొన్న పంట కాలక్రమంలో కనుమరుగైపోయి.. 'ముళ్ల జొన్న'గా సరికొత్త రూపంలో మళ్లీ వచ్చింది. అనుకూలమైన నేలలు, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టే ఈ పంటను ఇప్పటికే నిజామాబాద్ జిల్లాలో వందల ఎకరాల్లో సాగు చేస్తుండగా ఇప్పుడు మన దగ్గరా ప్రయోగాత్మ కంగా సాగవుతోంది. ఎ మాఘి జొన్న, తెల్లజొన్న, ఎర్రజొన్న, పచ్చజొన్న.. ఒకప్పుడు మన పల్లెల్లో విరివిగా కాసిన ఈ జొన్న పంట కాలక్రమంలో కనుమరుగైపోయి.. 'ముళ్ల జొన్న'గా సరికొత్త రూపంలో మళ్లీ వచ్చింది. అనుకూలమైన నేలలు, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టే ఈ పంటను ఇప్పటికే నిజామాబాద్ జిల్లాలో వందల ఎకరాల్లో సాగు చేస్తుండగా ఇప్పుడు మన దగ్గరా ప్రయోగాత్మ కంగా సాగవుతోంది. విత్తన కంపెనీ ప్రోత్సాహంతో ఎల్కతుర్తి మండల రైతులు ఏడెకరాల్లో పంట వేయగా ప్రస్తుతం ఏపుగా పెరిగి కోతకు వచ్చింది. ఎకరానికి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పంటకు క్వింటాల్‌కు రూ.4వేల ధర చెల్లించనుండగా తొలిపంట విజయవంతమైతే వచ్చే యాసంగిలో వరి, మక్కజొన్న కన్నా జొన్న సాగే మేలని రైతాంగం భావిస్తోంది. జిల్లా వ్యవసాయ యవనికపై మరో కొత్త పంట ఆవిష్కృతమైంది. ప్రపంచానికే విత్తన భాండాగారంగా ప్రసిద్ధికెక్కిన మన ప్రాంతం మరో విత్తన పంట పండించేందుకు రైతాంగం కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వందల ఎకరాల్లో రైతులు పండిస్తూ లాభాలు గడిస్తుండగా ఇప్పుడు హనుమకొండ జిల్లాలోనూ రైతులు ఈ పంట సాగు మొదలుపెట్టారు. రెండు మూడు దశాబ్దాల క్రితం వరకు మనం పండించి మరిచిపోయిన జొన్న పంట ఇప్పుడు సరికొత్త రూపంలో మళ్లీ మన ముందుకొచ్చింది. ముళ్లజొన్న పేరుతో వచ్చిన ఈ పంటను ఎల్కతుర్తి మండలంలోని జీల్గుల, జగన్నాథపూర్ గ్రామాల్లో ఏడెకరాల్లో రైతులు సాగుచేస్తున్నారు. ప్రోలైన్ అనే సీడ్ కంపెనీ బైబ్యాక్ పద్ధతిలో ప్రయోగాత్మకంగా సాగు మొదలుపెట్టింది. మొదటి పంటగా సాగుచేస్తున్న పంట విజయవంతంగా దిగుబడి వచ్చినట్లయితే వచ్చే యాసంగి లో రైతులకు లాభదాయకంగా ఉన్న ఈ పంట వైపు అనేక మంది రైతులు మొగ్గుచూపే అవకాశం ఉంది.

**పూర్వకాలపు పంటే అయినా..**

సోర్ఘం అనే నామంతో పిలిచే ఈ జొన్న పంట 30 దేశాల్లో పండిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా 500 మిలియన్ల మంది జొన్నలను మాత్రమే ప్రధాన ఆహారంగా తీసుకుంటారు. సింధూ నాగరికతతో సమాంతరంగా కృష్ణా, గోదావరి నదీ తీర ప్రాంతాల్లో పూర్వకాలంలోనే జొన్నలను పెద్ద ఎత్తున పండించినట్లు చరిత్ర చెబుతోంది. 20 ఏండ్ల క్రితం వరకు మనదేశంలో 15లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలు పండిస్తే అది ఇప్పుడు కేవలం 7లక్షల మెట్రిక్ టన్నులకు పడిపోయినట్లు అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ(ఇక్రిశాట్) పేర్కొంది. అయితే జొన్న పంట అనేక రూపాంతరాలు చెందుతూ రకరకాల రంగుల్లో సాగవుతోంది. ముఖ్యంగా మాఘి జొన్న, పచ్చ జొన్న, ఎర్రజొన్న, తెల్లజొన్న ఇంకా అనేక రకాల్లో జొన్నను రైతులు పండిస్తారు. నగేరియా, అమెరికా, ఇథియోపియా, ఇండియా, అర్జెంటీనా, చైనా, బ్రెజిల్ లాంటి దేశాల్లో ఈ జొన్న పంట విస్తృతంగా పండుతుంది. అనేక దేశాల్లో వీటిని నేరుగా తినడంతో పాటు పలు తినుబండారాల్లోనూ వినియోగిస్తారు. ప్రపంచంలో పాడి ఉత్పత్తిలోనూ జొన్న కీలక పాత్ర పోషిస్తున్నది. ఇప్పుడు ముళ్ల జొన్నగా..జొన్న పంట అనేక రూపాంతరాలు చెందుతూ ఇప్పుడు ముళ్ల జొన్నగా వచ్చింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే బహుళ ప్రాచుర్యం పొందింది.

ప్రతి యాసంగిలోనూ విరివిగా సాగు చేస్తున్నారు. మన వాతావరణం, భూములు కూడా ఈ పంటకు అనుకూలంగా ఉండడంతో ప్రోలైన్ అనే విత్తన కంపనీ ఇక్కడికి ఈ పంటను తీసుకొచ్చింది. ఎల్కతుర్తి మండలంలో ఏడెకరాల్లో సాగు చేస్తున్నారు. ఏపుగా పెరిగి మంచి దిగుబడి అంచనా కనిపిస్తోంది. మరోవారం, పది రోజుల్లో కోతకు వస్తుంది. దీని కంకి చుట్టూరా అత్యంత పదునుతో సన్నని ముండ్లు ఉండడంతో పిట్టలు దీనిపై వాలవు. ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటాలుకు రూ.4వేల చొప్పున విత్తన కంపెనీ కొనుగోలు చేస్తుంది. సాధారణ



హార్వెస్టర్‌తోనే ఈ పంటను కోయవచ్చు. ఈ పంటకు చీడపీడలు కూడా తక్కువేనని.. కేవలం మూడు నీటి తడులతో పంట కాలం పూర్తవుతుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. దిగుబడిలో గనుక విజయవంతం అయినట్లయితే మక్కజొన్న, వరికి ప్రత్యామ్నాయంగా పండించవచ్చంటున్నారు.

**ఆశాజనకంగానే ఉంది**

నేను ప్రతీసారి యాసంగిలో మక్కజొన్న వేస్తా. ఈసారి సీడ్ కంపినోళ్లు వచ్చి కొత్త పంట ఒక్కసారి వేసి చూడు అని చెప్పారు. వాళ్లను నమ్మి నేను ఈ జొన్న పంటను వేశాను. ఇప్పటివరకైతే మంచిగనే ఉంది. పంట కోసిన తర్వాత దిగుబడి సుత బాగనే వస్తుందనుకుంటున్న. ఈసారి అక్కెరకు వస్తే వచ్చే సంవత్సరం కూడ వేస్తా, మక్కజొన్న కంటే నయంగానే కనవడుతాంది.

**రైతులకు మంచి లాభాలొస్తాయి**

జొన్న పంట పండిస్తే మంచి లాభాలు వస్తాయి. ప్రపంచ దేశాల్లో ఈ జొన్నలకు ఎక్కువగా డిమాండ్ ఉంది. ఎన్ని వందల ఎకరాలైనా విత్తనం ఇవ్వడానికి కంపెనీ సిద్ధంగా ఉంది. మళ్లీ మేమే కొనుగోలు చేస్తాం. ఈ పంట పశుగ్రాసంగా కూడా ఎక్కువగా ఉపయోగపడుతుంది. తక్కువ పెట్టుబడి, తక్కువ నీరుతో ఎక్కువగా లాభం పొందవచ్చు. మక్కజొన్న, వరి కంటే ఎక్కువగా డబ్బులు వస్తాయి. గీసిడి కొండాల్‌రెడ్డి, సీడ్ ఆర్గనైజర్

# సాఫ్ట్‌వేర్ జాబ్స్ వదిలి.. వ్యవసాయం చేస్తున్న కవలలు

వారిద్దరూ కవలలు. పుట్టింది పల్లెటూరు.. చదివింది బీటెక్.. చేసేది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు.. రూ. లక్షల్లో జీతం.. అయినా అక్కడ ఇమడలేకపోయారు.. కరోనా సమయంలో ఇంటికి చేరుకున్నారు.. తండ్రి చేస్తున్న వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు

వారిద్దరూ కవలలు. పుట్టింది పల్లెటూరు.. చదివింది బీటెక్.. చేసేది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు.. రూ. లక్షల్లో జీతం.. అయినా అక్కడ ఇమడలేకపోయారు.. కరోనా సమయంలో ఇంటికి చేరుకున్నారు.. తండ్రి చేస్తున్న వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు.. తమ సొంత పొలం వైపు వెళ్లిన వారు నేలతల్లి ప్రేమలో పడ్డారు.. చిన్ననాటి నుంచి మట్టితో ఉన్న అనుబంధాన్ని గుర్తుకుతెచ్చుకున్నారు.. అప్పుడే నిర్ణయించుకున్నారు.. ఉద్యోగాలు వదిలేశారు.. వ్యవసాయం వైపు అడుగులు వేశారు.. అయితే ఇటు ప్రకృతిని, అటు మనిషిని సర్వనాశనం చేస్తున్న రసాయనాలపై కోపం వచ్చింది.. ఆర్గానిక్ వ్యవసాయమే లక్ష్యంగా ముందుకు కదిలారు.. వ్యవసాయ ఉద్యమకారులు విజయ్‌రామ్, జగ్గీవాసుదేవ్ సద్గురు సేవ్ సాయిల్ ప్రోగ్రామ్‌ల ద్వారా 'ప్రకృతి వ్యవసాయం'పై పట్టు సాధించారు. మొదటి సంవత్సరమే 15 ఎకరాల్లో చెలక సేద్యం పేరుతో ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేసి లాభాలు గడించారు.. ఓ వైపు ప్రకృతిని ఆస్వాదిస్తూ.. మరోవైపు డబ్బులు సంపాదిస్తున్న ఈ అన్నదమ్ముల విజయగాథ ఓ సారి లుక్కేద్దాం రండి. టేకులపల్లి మండలంలోని చింతోనిచెలక గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు కంభంపాటి చంద్రశేఖర్‌రావు- విజయ దంపతుల కుమారులు కంభంపాటి నరేశ్, నవీన్. వీరిద్దరూ కవలలు. వ్యవసాయ ఆధారిత కుటుంబం కావడంతో చిన్నతనం నుంచి తండ్రి చేస్తున్న పనుల్లో సాయం చేస్తూ వచ్చారు. కాలక్రమేన పెద్ద చదువులు చదివి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడ్డారు. ఈక్రమంలో కరోనా ప్రభావం వల్ల లాక్‌డౌన్ ఏర్పాటు చేయడంతో ఇంటికి చేరుకున్నారు. తండ్రితోపాటు పొలానికి వెళ్తూ వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు. మనిషి శరీరంలో ఇమ్యూనిటీ తగ్గుటకు కారణం రసాయనాలతో కూడిన పదార్థాలని తెలుసుకున్న సోదరులు రసాయనరహిత పంటలను సాగుపై దృష్టి పెట్టారు. భవిష్యత్ తరాల రైతులకు ఆదర్శంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడువుగా ఉద్యోగం వదిలి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేశారు.

'సేవ్ సాయిల్' లక్ష్యంగా..

విజయ్‌రామ్, జగ్గీవాసుదేవ్ సద్గురు సేవ్ సాయిల్ ప్రోగ్రాంలకు సోదరులిద్దరూ ఆకర్శితులయ్యారు. భవిష్యత్‌తరాలకు మంచి భూమిని అందించేందుకు రసాయనరహిత సేద్యం చేయాలని తెలుసుకున్నారు. ప్రకృతి వనరులతో ఆర్గానిక్ వ్యవసాయం చేసేందుకు నిశ్చయించుకున్నారు. హైదరాబాద్‌లో జరిగే ప్రోగ్రాంలకు హాజరవుతూ ఆర్గానిక్ వ్యవసాయంపై పూర్తిగా పట్టు సాధించారు.

తొలి సంవత్సరమే మంచి ఫలితాలు

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా గత వానకాలంలో ఐదెకరాల్లో వరి, రెండున్నర ఎకరాల్లో కూరగాయలు, ఎకరంలో మిర్చి సాగు చేశారు. పంట ప్రారంభం నుంచే పశువుల వ్యర్థాలనే ప్రధాన ఎరువులుగా వినియోగించారు. పంచగవ్య, జీవామృతం, బ్రహ్మాస్త్రం వంటి ఆర్గానిక్ ఎరువులను పిచికారీ చేశారు. దీంతో రూపాయి ఖర్చు లేకుండా అధిక దిగుబడి సాధించి లాభాలు పొందారు. అదేవిధంగా ప్రస్తుతం యాసంగిలో పుచ్చకాయ, కాకర, గుమ్మడికాయ, దోస పంటలు సాగు చేస్తున్నారు.

చెలక- సేద్యం పేరుతో..

వారికి ఉన్న 30 ఎకరాల భూమిలో మొదటి సంవత్సరం 15 ఎకరాల్లో చెలక-సేద్యం అనే పేరుతో



ఆర్గానిక్ వ్యవసాయం చేశారు. గత వానకాలం మూడు ఎకరాల్లో కాకర, బెండ, బీరకాయ, సొరకాయ, కొత్తిమీర, క్యారెట్ వంటి కూరగాయలు పండించారు. వాటిని కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో 240మందికి సరఫరా చేసి ప్రతినెలా రూ.35 వేలు సంపాదిస్తున్నారు. ఐదెకరాల వరి సాగులో రెండున్నర ఎకరాల్లో బ్లాక్ రైస్, రెండున్నర ఎకరాల్లో కుంకుమపువ్వు రైస్ సాగు చేశారు. సహజ వనరులైన జీవామృతం, ఘన జీవామృతం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, పశువుల వ్యర్థాలతో తయారు చేసిన మందులను మాత్రమే పిచికారీ చేసి మంచి దిగుబడి సాధించారు. బ్లాక్ రైస్ ఎకరాకు 20 బస్తాల చొప్పున 50బస్తాలు పండాయి. వాటిని బియ్యం పట్టించి ఆసక్తి గల వారికి విక్రయించారు. బ్లాక్ రైస్ 25కిలోల బ్యాగ్‌ను రూ.2500, కుంకుమపువ్వు రైస్ 25కిలోల బ్యాగ్‌ను రూ.1800 చొప్పున విక్రయించారు. వరి పంటతో లాభం రూ.2 లక్షలు వచ్చింది. అలాగే లావు మిరప ఎకరాకు 8క్వింటాలు వచ్చాయి. వాటిని కారంపొడి చేయించి కిలో రూ.600 చొప్పున కొంత, మిర్చి కిలో రూ.350 చొప్పున కొంత విక్రయించగా మొత్తం రూ.3 లక్షల లాభం వచ్చింది.

ఉద్యోగంలో తృప్తి లేదు..

మాది వ్యవసాయ ఆధారిత కుటుంబం. పొలంలోకి వెళ్లినప్పుడు ఎంతో హాయిగా అనిపించేది. కానీ చదువు నిమిత్తం దూరంగా ఉన్నాం.. మంచి ఉద్యోగం సాధిం చాం. అక్కడ సంతృప్తి లేకపోవడంతో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాం. ఆర్గానిక్ వ్యవసాయం చేసి భూమిని కాపాడాలని అనుకున్నాం. మా చుట్టుపక్కల రైతులకు ఈ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాం.

'ప్రకృతి వ్యవసాయం' చేయాలిద..

రైతులు పండించిన పంటను ప్రతిఒక్కరూ ఏదో రూపంలో ప్రతిరోజు తింటున్నారు. కానీ ఆ ఆహారంలో హాని కలిగించే రసాయనాలు ఉంటున్నాయి. కృత్రిమ ఎరువులు, పురుగుమందులు వాడడంతో పెట్టుబడి పెరిగి రైతులు అప్పుల పాలవుతున్నారు. దాన్నిచూసి కొంతమంది రైతులనైనా ప్రకృతి వ్యవసాయం వైపు తీసుకురావాలని నిర్ణయించుకున్నాం. ఉద్యోగం వదిలి ఆర్గానిక్ వ్యవసాయం వైపునకు వచ్చాము.

# రైతులకు గుడ్ న్యూస్.. ఈ మెషీన్‌తో అడవి పందులు, కోతుల పరార్



అడవి పందులు, కోతుల బారి నుంచి పంట పొలాలకు రక్షణ కల్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీలో భాగమైన అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం ప్రత్యేకంగా 'జీవ ఆర్తనాద' యంత్రాన్ని తయారుచేసింది.

అడవి పందులు, కోతుల బారి నుంచి పంట పొలాలకు రక్షణ కల్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీలో భాగమైన అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం ప్రత్యేకంగా 'జీవ ఆర్తనాద' యంత్రాన్ని తయారుచేసింది. ఈ యంత్రం సహాయంతో 5 నుంచి 10 ఎకరాల విస్తీర్ణంలోని పంటలను అడవి పందులు, కోతుల బారి నుంచి రక్షించుకోవచ్చు. ఈ యంత్రం నుంచి వెలువడే శబ్దాలు, వివిధ రకాల జంతువుల అరుపులకు అడవి పందులు, కోతులు పారిపోతాయి. దీనిని వర్సిటీ అధికారులు ప్రయోగాత్మకంగా పరీక్షించగా 80-90 శాతం పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చునని తేలింది.

యంత్రం ఎలా పనిచేస్తుంది?

జీవ ఆర్తనాద యంత్రంలో స్పీకర్, మదర్ బోర్డు, బ్యాటరీతో కూడిన ఒక బాక్స్ ఉంటుంది. మదర్‌బోర్డులో పలు రకాల జంతువుల అరుపులను రికార్డు చేసి పెడతారు. ముఖ్యంగా అడవి పందులను భయపెట్టే పులులు, అడవి కుక్కలు, చిరుత పులులు ధ్వనులను నిక్షిప్తం చేస్తారు. ఇది పూర్తిగా సోలార్ ప్యానెల్, బ్యాటరీతో పనిచేస్తుంది. రైతులు ఈ పరికరాన్ని ఒక స్టాండ్ సాయంతో పంటకు అడుగు దూరంలో కాస్త ఎత్తులో అమర్చుతారు. రాత్రి సమయంలో ఈ బాక్స్ ను ఆన్ చేయడం వల్ల అందులో నుంచి వచ్చే జంతువుల అరుపులకు అడవి పందులు భయపడి పంట పొలాల వైపు రాకుండా వెళ్లిపోతాయి. బ్యాటరీ ఒక్కసారి ఫుల్ అయితే రోజుకు 18-20 గంటలు పనిచేస్తుంది. బ్యాటరీ ఐదేండ్లపాటు పనిచేస్తుంది. ఈ పరికరాన్ని అమర్చిన ప్రదేశం నుంచి 5-10 ఎకరాల పరిధి వరకు ప్రభావం ఉంటుంది. ఈ ఆర్తనాద యంత్రాన్ని రైతులు తమ స్మార్ట్‌ఫోన్‌తో అనుసంధానం చేసి ఆపరేట్ చేసుకోవచ్చు. ఈ యంత్రాలు వ్యవసాయ యూనివర్సిటీలోని అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగంలో లభిస్తాయి. దీని ధర రూ.26 వేలు. అవసరమైన రైతులు 9490806018 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

# బుగ్గ సేంద్రియ పాలు..!



చీనీ చెట్లకు వచ్చే వ్యాధుల నివారణకు పురుగు మందులతో అలసిపోయి పాలేకర్ సూచించిన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించడానికి ఒక దేశీ ఆవుతో మొదల్కె గేదెలతో సహా రోజుకు 200 లీటర్ల పాలను ఉత్పత్తి చేసి సేంద్రీయ పరంగా విక్రయిస్తున్న బుగ్గ సుబ్బారెడ్డి. ఇతని పూర్తి పేరు సంసాని సుబ్బారెడ్డి. ఊరు కడప మండలం వెంకట గారి పల్లి. కడపలో బీటెక్ పూర్తి చేసి వ్యవసాయము మీద ఆసక్తితో తన దగ్గర ఉన్న 20 ఎకరాలలో చీనీ తోటను ప్రారంభించాడు.సుబ్బారెడ్డిది వ్యవసాయ నేపథ్యం, ఉన్నత చదువులు చదివిన తరువాత ఎలాంటి ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా వ్యవసాయం మీద ఉన్న మక్కువతో వ్యవసాయరంగంలోనే స్థిరపడ్డాడు. 20 ఎకరాలలో బత్తాయి సాగు ఉంది. 2005వ సంవత్సరములో బత్తాయి మొక్కలు నాటి 2010 వరకు రసాయనాలు కూడా ఉపయోగించి 2010 నుంచి రసాయనాలను పూర్తిగా మానివేసి సేంద్రియ పద్ధతులు మొదలుపెట్టాడు.సేంద్రియ సాగు చేయాలంటే పాడి పశువులు తప్పనిసరి అని గ్రహించి 2015వ సంవత్సరం నుండి పాడి పశువులను కొనుగోలు చేస్తూ వస్తున్నాడు. ప్రస్తుతానికి 50 గేదెలు, 10 నాటు ఆవులు ఉన్నాయి. వీటి మేత కొరకు 10 ఎకరాలలో సూపర్ నేపియర్, 4 ఎకరాలలో కో-4 గ్రాసాన్ని పెంచుతున్నాడు. పశువులకు మేత కోసం సూపర్ నేపియర్, కో-4 గ్రాసంతోపాటు వేరుశనగ చెక్క, వరిగడ్డి, అలసంద పొట్టు, శనగచెత్త, అలసంద మొక్కలు, తవుడు అందిస్తున్నాడు. పశువులకు ఆహారం కొరకు బయట నుంచి ఏమీ కొనుగోలు చేయడం లేదు. ప్రతిరోజు సగటున 200 లీటర్ల గేదె పాలు, లీటరు 70/-ల చొప్పున 20 లీటర్ల ఆవుపాలు పొందుతూ లీటరు 80/-ల చొప్పున అమ్మకం చేస్తున్నాడు. పాల దిగుబడి తగ్గకుండా చూసుకుంటూ అవసరమయితే పాడి పశువుల కొనుగోలు చేసుకుంటూ వస్తున్నాడు.

చీనీ తోటలో కాయలు వచ్చే సమయానికి మరియు వచ్చిన తరువాత 3 ఏళ్ల వరకు వ్యాధుల నివారణకు అతను చెట్లకు కొట్టని పురుగు మందు లేదు. వచ్చే దిగుబడి కన్నా పురుగుమందులకు అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంది. ఆ సమయంలో పాలేకర్ సూచించిన గో ఆధారిత ప్రకృతి వ్యవసాయానికి మారడం జరిగినది. దీనికి ముఖ్యముగా దేశీ ఆవు పేడ అత్యవసరం. ఎందుకంటే ప్రకృతి కషయాలు తయారు చేయాలంటే దేశీ ఆవు పేడ తప్పనిసరి. ఈ గోఆదారిత వ్యవసాయములో దిగుబడి కోసం సమయం వెచ్చించిన సుబ్బారెడ్డి తరువాతి మూడు ఎండ్లలో రెట్టింపు దిగుబడి మరియు రుచికరమయిన కాయలతో విజయవంతముగా పురుగు మందులు లేని చీనీ కాయలు సాధించాడు. అదే మూడు సంవత్సరాలలో మరో వైపు సేంద్రియ పాలను కుడా ఉత్పత్తి చేసాడు.ఈ ప్రకృతి వ్యవసాయం కోసం మంచి ఒంగోలు దేశీ ఆవు కోసం మమ్మల్ని సంప్రదించడం జరిగినది. దేశీ ఆవు ను కొనుగోలు చేసిన తర్వాత ఆవు ద్వారా వచ్చే పాలను ఇంటి వద్దనే విక్రయించడం మొదలుపెట్టాడు. అతని దగ్గర అంతకు మునుపు ఉన్న గేదెలతో ఇంటి దగ్గరకు వచ్చి గేదె పాలు వేపించుకునే ప్రైవేటు డ్కెరీ వారు వెన్న శాతం ప్రకారం లీటరుకు 40 రూపాయలు మాత్రమె వచ్చేవి.వ్యవసాయములోనే గాక పాలలో కూడా ఎటువంటి కల్తీ లేకుండా సేంద్రియ పాలను ఉత్పత్తి చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ పశువులకు సరి కొత్తగా పశువుల పాక ఏర్పాటు చేసి సేంద్రియ పద్దతిలో ఎటువంటి మందులు మరియు రసాయనాలు వాడని గడ్డిని మేతగా ఇవ్వడం ప్రారంభించాడు. ఈ విధమయిన దేశీ పాల యొక్క ప్రాముఖ్యత తెలిసిన వాళ్ళు తన ఊరిలో కూడా సేంద్రియ పాలకు మంచి డిమాండు ఏర్పడి మొదటగా లీటరు 50 రూపాయలకు విక్రయించాడు. అంతేగాక తన వద్ద ఉన్న మూడు నాటు గేదెలకు వచ్చే పాలను కూడా లీటరు రూ.50లకు విక్రయించేవాడు. తద్వారా ఎక్కువ డిమాండ్ రావడంతో కడపలో బుగ్గ సేంద్రియ పాలు అని షాపు ప్రారంభించాడు. అదే క్రమములో ఎక్కువ దేశీ ఆవు పాలు ఇచ్చే గిర్ జాతి ఆవులను మరియు ఇంకా కొన్ని గ్రేడేడ్ ముర్రా జాతి గేదెలను కొనుగోలు చేసాడు. ప్రస్తుతం రోజుకు ఈ దేశీ ఆవులు మరియు గేదెల నుండి 200 లీటర్లకు పైగా సేంద్రియ ఆవు మరియు గేదె పాలను ఉత్పత్తి చేసి లీటరు గేదె పాలు 70 /- లకు, దేశీ ఆవు పాలు అయితే లీటరు 80/- లకు విక్రయిస్తూ సేంద్రియ ఆవు పాలకు మార్కెట్ చేయడం జరిగినది.

ఇతనిని ఆదర్సముగా మరి కొందరు అదే ల్కెన్లో చాల వరకు సేంద్రియ ఆవు పాలు మరియు పల్లె పాలు అని పేర్లతో అవుట్ లెట్లు ప్రారంభించారు. మామూలుగా అయితే మన రైతు పేరు సంసాని సుబ్బారెడ్డి. ఈ సేంద్రియ పాలు ప్రారంభించిన తరువాత అతని ఇంటి పేరు బుగ్గ సుబ్బారెడ్డిగా మారిపోయింది. ఈ విధముగా యువరైతు తన ఆలోచన పరిధిని మార్చుకోవడం వలన మిగతా పాడి రైతులకు ఆదర్సంగా నిలిచాడు.